అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 11-01-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 12 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



వేళాపాళా లేని సినిమా

హైకోర్టు ఆగ్రహం

గేమ్‌ఛేంజర్ టిక్కెట్ ధరల పెంపుపై సమీక్షించాలి : ప్రభుత్వానికి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామ్‌చరణ్ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమా టిక్కెట్ ధరలను పెంచుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులను 24 గంటల్లోగా తిరిగి సమీక్ష చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అదనపు షోలకు అనుమతించే విషయంలో కూడా ప్రభుత్వం చట్ట నిబంధనలను అమలు చేయాలని తెలిపింది. పబ్లిక్ హెల్త్, సెక్యూరిటీ వంటి విషయాలపై అన్ని ఏర్పాట్లు చేసే వరకు తెల్లవారు జాము షోలకు అనుమతి ఇవ్వరాదని కోరింది. సమగ్ర వివరాలతో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి ...5లో



ఊసరవెల్లి సిగ్గుపడేలా మాటమార్చిన సీఎం

టికెట్‌రేట్లు, అదనపు షోలకు అనుమతి

సభను అవమానించడమే : మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి రెండు వారాల్లో ఊసరవెల్లి సిగ్గుపడేలా మాట మార్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మరణించిన నేపథ్యంలో ఇక మీదట స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ సీఎంతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన మాటలు స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలయ్యాయని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా ? అని ప్రశ్నించారు. అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ ...13లో



పైఅధికారుల ఆదేశం మేరకే డబ్బులు బదిలీ చేశా

ఏసీబీ ముందు బీఎల్ఎన్ రెడ్డి వ్యాఖ్య

ఆరున్నర గంటల పాటు సాగిన విచారణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో విదేశీ కంపెనీకి హెచ్ఎండీఏ తరపున నిధులను ఉన్నతాధికారుల ఆదేశం మేరకే బదిలీ చేశానని హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి వెల్లడించారని తెలిసింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో మూడో నిందితుడైన బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు దాదాపు ఆరున్నర గంటల పాటు విచారించారు. ఐఓబీ బ్యాంకు ఖాతా ద్వారా ఈ డబ్బులను ఎఫ్ఈఓ కంపెనీకి బదిలీ చేసినట్టు అంగీకరించారు. అయితే, ఒక ఉన్నతాధికారిగా ...13లో



కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి , చిత్రంలో మంత్రి ఉత్తమ్ , డిప్యూటీ సీఎం భట్టి , సీఎస్ శాంతికుమారి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రైతుల్ని గందరగోళపర్చొద్దు

వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా

- ఉపాధి హామీ రైతు కూలీలకు ఇందిరమ్మ రైతు భరోసా
- ఏడాదిలో కనీసం 20 రోజులు పనిచేసిఉండాలి
- ఒక కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు
- గ్రామసభల్లోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
- అనర్హులకు పథకాలు వర్తించరాదు : కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వ్యవసాయయోగ్యమైన ప్రతి ఎకరా భూమికి రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. దీనిపై రైతుల్ని గందరగోళ పరచొద్దని హెచ్చరించారు. రైతుబంధు పేరిట గతంలో భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందనీ, వ్యవసాయయోగ్యం కాని భూములకు కూడా పంట పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేశారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదనీ, వ్యవసాయానికి అక్కరకు రాని భూములను గుర్తించి, వాటిని మాత్రమే ఈ పథకం నుంచి మినహాయించాలన్నారు. రియల్ ఎస్టేట్ భూములు, లే అవుట్ భూములు, నాలా కన్వర్ట్ అయిన భూములు, మైనింగ్ భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సేకరించిన భూములన్నీ అనర్హత జాబితాలోకి వస్తాయని వివరించారు. అనర్హులు ఎవరూ ప్రభుత్వ పథకాలు పొందకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందని స్పష్టం చేశారు. దీనికోసం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులు, డీటీసీపీ లే అవుట్ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా అనర్హుల జాబితాలను తయారు చేయాలనీ, విలేజ్ మ్యాప్‌లతో పాటు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి, ధ్రువీకరించుకొని, ఆ వివరాలను గ్రామ సభల్లో పెట్టాలన్నారు. ప్రతి జిల్లాకు, ప్రతి మండలానికో నోడల్ ఆఫీసర్లను నియమించాలనీ, అధికారుల బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి అనర్హులను గుర్తించాలని ఆదేశించారు.

ఇదీ ప్రణాళిక..

ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని సీఎం సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, నోడల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలని చెప్పారు.

శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు, వివరాల సేకరణ, లబ్దిదారుల జాబితాల తయారీపై చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ...5లో

అధికారికంగా కొమురం భీం జయంతి.. వర్ధంతి

ఆదివాసీలపై పెట్టిన ఉద్యమ కేసులు ఎత్తివేస్తాం

ఆదివాసీ విద్యార్థులకు వంద శాతం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు

ప్రతి నాలుగు నెలలకోసారి నాయకులతో సమావేశం : ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

6లో..

రండి..పెట్టుబడులు పెట్టండి



అంతర్జాతీయ నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ

అత్యున్నత వ్యాపారసౌలభ్యం అందిస్తాం

చైనా తరహా క్లస్టర్ల ఏర్పాటు

స్కిల్ యూనివర్సిటీకి మద్దతునివ్వాలి : సీఐఐ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

డాలర్ @ 86

చరిత్రలోనే అథమ స్థానానికి రూపాయి

కరిగిపోతోన్న విదేశీ మారకం నిల్వలు



వివరాలు 13లో

భారత జీడీపీ 6.6 శాతానికి మందగింపు

- ఐక్యరాజ్య సమితి అంచనా
- గ్లోబల్ వృద్ధిలోనూ స్తబ్దత



త్వరలో స్పౌజ్ టీచర్ల బదిలీ

ముఖ్యమంత్రి కార్యాలయానికి దస్త్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్పౌజ్ టీచర్ల బదిలీల ప్రక్రియ త్వరలోనే చేపట్టే అవకాశమున్నది. ఇందుకు సంబంధించిన దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యాశాఖ పంపించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ఉన్న నేపథ్యంలో అందుకు సంబంధించిన దస్త్రంపై ఈలోపు సంతకం చేసే అవకాశమున్నది. స్పౌజ్ బదిలీల్లో సుమారు 850 మంది ఉపాధ్యాయులకు అవకాశం ఉండనుంది. స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా సీనియార్టీ ఆధారంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపులు చేసేందుకు 2021, డిసెంబర్ ఆరున 317 జీవోను గత ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. దానిపై ...13లో

ఛిద్రమైన వలస కూలీల జీవితాలు

పొగమంచులో ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు



- ఐదుగురు కూలీలు మృతి
- తీవ్రంగా గాయపడిన మరికొందరు
- ఎలాంటి సిగ్నల్ వేయకుండా రోడ్డుపై ఆపిన లారీ డ్రైవర్
- పొట్టకూటి కోసం వెళ్తున్న కూలీల బతుకుల్లో చీకటి
- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ఘటన
- మరోచోట బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరు మృతి



నవతెలంగాణ-చివ్వెంల

పొగమంచు, నిద్రమత్తు కారణంగా బస్సు.. టైర్ పంక్చర్ అయ్యి రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొట్టడంతో ఐదుగురు కూలీలు మృతిచెందారు. మరికొందరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ...5లో

విద్యాశాఖ కార్యదర్శిగా యోగితారాణా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


విద్యాశాఖ కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి యోగితా రాణా శుక్రవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఇంటర్ ...13లో

తప్పులు చేసి ఉండొచ్చు

మనిషినే..దేవుడిని కాను : నిఖిల్ కామత్ పాడ్కాస్ట్‌లో మోడీ



న్యూఢిల్లీ : జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్కాస్ట్ (పాడ్కాస్ట్ అంటే డిజిటల్ ఆడియో ఫైల్. దీనిని ఇంటర్నెట్ లేదా ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఎప్పుడైనా వినవచ్చు) తదుపరి ఎపిసోడ్‌కు ప్రధాని నరేంద్ర మోడీ అతిథిగా హాజరవుతారు. ఈ ఎపిసోడ్‌కు సంబంధించిన ట్రైలర్‌ను గురువారం సాయంత్రం విడుదల చేశారు. నాయకత్వం, ...13లో



కుల-మత వివక్షే ప్రధాన సమస్య


ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వేలో భారతీయుల మనోగతం

దేశాన్ని పట్టిపీడిస్తున్న అతి పెద్ద సమస్య మత, కుల వివక్షేనని మెజారిటీ భారతీయులు...అంటే 70 శాతానికి పైగా అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలోని 36 దేశాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్యూ రిసెర్చ్ సెంటర్ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. మన దేశానికి సంబంధించినంత వరకూ కుల మత వివక్షే ప్రధాన సమస్య అని ఎక్కువ మంది కుండబద్దలు కొట్టారు. 70 శాతానికి పైగా భారతీయులు మత వివక్షను ప్రస్తావించగా 69 శాతం మంది కుల, జాతి వివక్షను వేలెత్తి చూపారు. ఇతర దేశాల ప్రజలు కుల వివక్ష కంటే జాతి వివక్షే అతి పెద్ద సమస్య అని చెప్పారు.

న్యూఢిల్లీ : 'ప్రపంచంలో అతి పెద్ద సవాలుగా ఆర్థిక అసమానత' అనే పేరుతో ప్యూ రిసెర్చ్ సెంటర్ గురువారం తన నివేదికను ప్రచురించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతం, యూరప్, లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, ఉత్తర అఫ్రికా ప్రాంతం, ఉత్తర అమెరికా, సబ్-సహారా ఆఫ్రికాలోని 36 దేశాల్లో సర్వే నిర్వహించారు. అమెరికాలో 3,600 మందిని సర్వే చేయగా మిగిలిన దేశాలన్నింటిలో కలిపి 41,503 మంది అభిప్రాయాలు సేకరించారు. గత సంవత్సరం జనవరి 5-మే 24 తేదీల మధ్య ఈ సర్వే జరిగింది. మూడింట ఒక వంతు దేశాల్లో ఫోన్ ద్వారా సర్వే జరపగా భారత్ సహా మిగిలిన దేశాల్లో ప్రజలను వ్యక్తిగతంగా కలిశారు.

ధనికులు, పేదల మధ్య వ్యత్యాసం

ధనికులు, పేదల మధ్య వ్యత్యాసం అతి పెద్ద సమస్యగా ఉన్నదని ప్రతి దేశంలోనూ మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. మన దేశంలోని 64 శాతం మంది ప్రజలు ఈ వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉన్నదని చెప్పగా 17 శాతం మంది ఓ మాదిరిగా ఉన్నదని తెలిపారు. తమ సర్వేలో మత వివక్ష కంటే ఇతర అంశాల పైనే ఎక్కువగా ఆందోళన వ్యక్తమైందని నివేదిక వివరించింది. అయినప్పటికీ మతం ప్రాతిపదికన వివక్ష చూపడం అతి పెద్ద సమస్యగా ఉన్నదని 29 శాతం వయోజనులు చెప్పారు. 27 శాతం మంది అది ఓ మోస్తరుగా ఉన్నదని తెలిపారు. మత వివక్ష ఎక్కువ ఆందోళన కలిగిస్తోందా అని భారత్ సహా కొన్ని దేశాలకు చెందిన వారినే సర్వేలో ...13లో



క్రైస్తవులపై 834 దాడులు

2023 కంటే గతేదాదే అధికం

ఏడాది వ్యవధిలో వంద ఘటనలు పెరిగిన వైనం

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువ

6లో..



ఫిబ్రవరి 8న మత్స్య మహిళా జాతీయ సదస్సు

- తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా మెట్టు సాయికుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

ఫిబ్రవరి 8న హైదరాబాద్ నగరంలో మత్స్య మహిళా జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోరెంకల నర్సింహ, లెల్లెల బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సుకు సంబంధించిన సన్నాహక సమావేశంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ మత్స్యశాఖ పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య చైర్మెన్ మెట్టు సాయికుమార్, అధ్యక్షులుగా కొప్పు పద్మ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గౌరవ సలహాదారులుగా ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తోపాటు సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో లక్షలాది మంది మత్స్య మహిళలు చేపలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఎస్సారెస్పీ టెయిల్‌ఎండ్ భూములకూ నీరందించాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎస్సారెస్పీ టెయిల్‌ఎండ్ భూములకూ సరిపడా సాగునీటిని అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలసౌధలో ఎస్సారెస్పీ నీటి సరఫరాపై మంత్రి సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సారెస్పీ పరిధిలోని మొత్తం 9.68 లక్షల ఎకరాలకు యాసంగి సీజన్‌కు గాను ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ 25న నీటిని విడుదల చేశామనీ, ఏప్రిల్ 8 వరకు నీటి సరఫరా కొనసాగుతుందని అన్నారు. కాగా చివరి భూములకూ నీరందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీలు జి అనిల్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, హరీరాం, సీఈలు కే. శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రమేష్‌బాబు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం 2871 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 3348 దరఖాస్తులు అందాయి. అందులో ఇందిరమ్మ ఇండ్ల కోసమే 2871 దరఖాస్తులుండటం గమనార్హం. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 147, విద్యుత్ శాఖకు 130, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇతర శాఖలకు 145 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.

హెల్త్ కార్డులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

- ఫ్లెక్సీ ప్రింటర్లతో ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవసరమైన సహాయం, హెల్త్ కార్డులు అందించేందుకు ప్రయత్నిస్తానని ఫ్లెక్సీ ప్రింటర్లతో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. శుక్రవారం తెలంగాణ ఫ్లెక్సీ ప్రింటర్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (టీఎఫ్ పీఈడబ్ల్యూఏ) 2025 క్యాలెండర్‌ను హైదరాబాద్ లోని టీజేఎస్ పార్టీ కార్యాలయంలో కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫ్లెక్సీ ప్రింటర్లపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం వేధింపులు లేకుండా సమస్యలు వింటూ పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. గత బీఆర్ఎస్ సర్కారు ఆర్థిక వ్యవస్థను దివాళా దిశగా నడిపించిందనీ, కొత్తగా చేస్తున్న అప్పుల్లో 75 శాతం పాత అప్పులు తీర్చడానికే వెచ్చించాల్సి వస్తున్నదని తెలిపారు. కాళేశ్వరం కుంగివేతకు రూర్కీ ఐఐటీ ప్రొఫెసర్లు నిర్మాణ లోపాలే కారణమని అధ్యయనంతో తేల్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌పీఈడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అన్సారీ, ఉపాధ్యక్షులు రాజ్ శేఖర్, జాయింట్ సెక్రెటరీ మహ్మద్ అలీ, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, బైరి రమేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'బనకచర్ల' వివరాలు తెప్పించండి

- జీఆర్ఎంబీకి తెలంగాణ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు వివరాలు తెప్పించాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి అనిల్‌కుమార్ గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)కు ఇటీవల లేఖ రాశారు. గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఏపీ అక్రమంగా చేపట్టిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే అమలు చేసేందుకు పూనుకుందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో నిర్వహించిన సమావేశం పత్రికా క్లిప్పింగులను జీఆర్ఎంబీకి పంపారు. ఎలాంటి నీటి కేటాయింపులు లేకుండా ప్రణాళికలు రూపొందించడం సరికాదన్నారు. వరదనీటి ఆధారంగా రూ.80 వేల కోట్లతో చేపట్టడం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించారు. వెంటనే గోదావరి- బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు వివరాలు తెప్పించాలని సూచించారు. అలాగే వాటిని తెలంగాణకు సైతం పంపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం మధ్యతరగతి, పేద ప్రజలు లక్షల సంఖ్యలో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏండ్ల తరబడి అవి పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఊరట కలగడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూరుతుందని వివరించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వాటిని కాకుండా న్యాయబద్ధంగా ఉన్న ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే వ్యవసాయ భూములను రైతులు విక్రయించగా వాటిని ప్లాట్లుగా చేసిన స్థలాలను కూడా క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతి పండగకు ఆర్టీసీ 6432 ప్రత్యేక బస్సులు

- ప్రయాణికులకు అవసరమైనన్ని బస్సులు నడేపేందుకు ఆర్టీసీ సిద్ధం..
- ప్రయివేటు ట్రావెల్స్ అదనపు చార్జీలు వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తాం
- ప్రయాణీకులకు ఏ సమస్య వచ్చినా రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఫిర్యాదులొస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సంక్రాంతి పండుగ వేళ.. ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ 6432 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు శనివారం నుంచి అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. అవసరమైతే ఆర్టీసీ మరిన్ని బస్సులు నడపడానికి సిద్ధంగా ఉందనీ, ఆర్టీసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి మేజర్ బస్ స్టేషన్ వద్ద ప్రత్యేక అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా బస్సుల్లో అదనంగా మహిళలు వచ్చే అవకాశం ఉందని, అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తూ ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఇదే సమయంలో ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలకు మంత్రి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి పండగ పూట ప్రయాణికులను అదనపు చార్జీల పేరుతో దోపిడికి గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న చార్జీలనే వసూలు చేయాలనీ.. అదనంగా వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తామని తెలిపారు. ట్రావెల్స్ ఆపరేటర్స్ అదనంగా చార్జీలు వసూలు చేస్తే ప్రయాణికులు రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు ఫీల్డ్‌లోనే ఉండి నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఫిర్యాదులొచ్చినా వెంటనే స్పందించాలన్నారు. తమ ప్రభుత్వం ప్రయాణికుల భద్రత, సంక్షేమానికే ప్రాధానత్య కల్పిస్తుందని గుర్తుచేశారు. ప్రయాణికులు పండగ సమయంలో జాగ్రత్తగా గమ్యస్థానాలకు వెళ్లాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సురేంద్ర మోహన్, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రవాణాశాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ హెచ్చరించారు. నిబంధనలకు మించి అదనపు చార్జీలు వసూలు చేసినా, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించినా, సరుకు రవాణా చేసినా, అటువంటి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై కేసు నమోదు చేయడమే కాకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాల్లోని రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామనీ.. వారు ఈ వారం రోజులు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఇప్పటివరకు ప్రయివేట్ బస్సులపై 150 కేసులు నమోదు చేశామని చెప్పారు. అంతేకాకుండా ప్రయివేట్ బస్సులు నడిపే డ్రైవర్లు అనుభవం గల డ్రైవర్లు ఉండడమే కాకుండా ప్రయాణికుల లిస్టు కూడా సంబంధిత అటెండెంట్ దగ్గర ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమిషనర్ తెలిపారు. కాంట్రాక్టు క్యారేజీ బస్సులకు సంబంధించిన నిబంధనలు అన్నింటిని పాటించాలనీ.. లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేటినుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు శనివారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. శనివారం నుంచి ఈనెల 17 వరకు ఏడురోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. శనివారం నుంచి ఈనెల 16 వరకు ఆరురోజులపాటు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులుంటాయని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈనెల 18న పాఠశాలలు, 17న జూనియర్ కాలేజీల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు తరగతులు నడిపితే చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ హెచ్చరించింది. అవసరమైతే గుర్తింపు రద్దు చేస్తామని ప్రయివేటు పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలను ఆదేశించింది.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య
- రజక వృత్తి ఆధునీకరణ,ఉపాధి కల్పన అంశంపై సదస్సు

నవతెలంగాణ- ముషీరాబాద్

కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రజక వృత్తి ఆధునీకరణ, ఉపాధి కల్పన అంశంపై రాష్ట్ర సదస్సు రెండో రోజు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో వృత్తుల ఆధునీకరణ ఉపాధి కల్పనకు డ్రై క్లినిక్ షాపులు ఏర్పాటు చేసుకోవడానికి రూ.10 లక్షల వరకు రుణాలు, పూర్తి సబ్సిడీతో విద్యుత్, రజక ఫెడరేషన్‌కు నిధుల కేటాయింపు, రజక వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో సంప్రదాయ వృత్తిదారులకు ఆధునీకతపై శిక్షణ కల్పించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అత్యంత వెనుకబాటులో ఉన్న సేవా వృత్తిదారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చేనేత, గీత కార్మికుల్లాగా ప్రత్యేక పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సభ్యులు ఎం.బాలకృష్ణ, మల్లేష్, ఎం.గోపాల్, జ్యోతి ఉపేందర్, పాయిరాల రాములు, కంచర్ల కుమారస్వామి, వెంకటేశ్వర్లు, ఎస్.సుభద్ర, జి.మానస పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు ఉపసంహరించుకోవాలి : డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్
- హైదరాబాద్ డీఆర్వో వెంకటాచారికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో



కాంగ్రెస్ ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ఐదు హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసు పెంచాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ డీఆర్వో వెంకటాచారికి డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్, సౌత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హస్మి బాబు, జావీద్, కృష్ణ, క్రాంతి, రాజయ్య, శ్రీనివాస్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతియేటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతామని చెప్పిందని అన్నారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని, యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించారే తప్ప అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలనే ప్రతిపాదన వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండా అన్యాయం జరుగుతుందని చెప్పారు. పదేండ్ల నుంచి నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంచాలనే ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

బీ కేటగిరీలో ఒక్కరూ చేరని ఇంజినీరింగ్ కాలేజీలు 9

గ్రామీణ ప్రాంత కళాశాలల పట్ల విద్యార్థుల విముఖత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొమ్మిది ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లోని బీ కేటగిరీ సీట్లలో ఒక్కరూ చేరలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. హైదరాబాద్‌లో చదివితే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న అభిప్రాయంతో ఉన్నారు. దీంతో బీ కేటగిరీలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉండే కాలేజీల్లో చేరేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇంకోవైపు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యం పెంచుకోవడానికి అవకాశాలు కూడా హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు కార్పొరేట్ సంస్థలు, ఐటీ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగానే విస్తరించి ఉన్నాయి. దీంతో రాజధానిలో ఉండే కాలేజీల్లో చేరడానికే విద్యార్థులు ఇష్టపడుతున్నారు. ఇంకోవైపు కాలేజీల్లో ఉండే సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులను కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు గమనిస్తున్నారు. న్యాక్ గ్రేడ్, కోర్సులకు ఎన్‌బీఏ ఉందా? లేదా? అనేది కూడా పరిశీలిస్తున్నారు. అన్నింటి కంటే ప్లేస్‌మెంట్లు ఎలా ఉన్నాయనేది కూడా తెలుసుకుంటున్నారు. అన్నింటి కంటే అర్హులైన అధ్యాపకులు పనిచేస్తున్నారా?, ల్యాబ్‌లు, కంప్యూటర్లు ఉన్నాయా?లేదా? అనేది చూస్తున్నారు. వీటి ఆధారంగానే కాలేజీల్లో చేరడానికి మొగ్గుచూపుతున్నారు. కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ప్రమాణాలు, మౌలిక వసతులు అంతంత మాత్రమే ఉంటాయి. దీంతో బీ కేటగిరీలో వాటిలో చేరేందుకు విద్యార్థులు ఇష్టపడడం లేదు. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. వాటిలో 18 ప్రభుత్వ, యూనివర్సిటీలు కాలేజీలుంటే, రెండు ప్రయివేటు యూనివర్సిటీ, 155 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటా ద్వారా, 30 శాతం సీట్లు బీ కేటగిరీ ద్వారా భర్తీ చేస్తారు. వాటిలో తొమ్మిది కాలేజీల్లో బీ కేటగిరీ సీట్లలో ఒక్కరూ చేరకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 86,943 సీట్లున్నాయి. ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో 81,904 (94.20 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 5,039 (5.80 శాతం) సీట్లు మిగిలాయి.

హష్ మనీ కేసులో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

- శిక్ష ఆదేశాలు జాప్యం చేసేందుకు సుప్రీం నిరాకరణ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌కు హష్‌మనీ కేసులో ఎదురు దెబ్బ తగిలింది. ఈ కేసులో శిక్ష విధింపు ఆదేశాలు జాప్యం చేసేందుకు సుప్రీం తిరస్కరించింది. దీంతో న్యాయమూర్తి జువాన్ ఎం.మర్చన్ శిక్ష విధించేందుకు మార్గం సుగమం అయింది. శృంగార తార స్టార్మీ డేనియల్స్ నోరు మూయించేందుకు 1,30,000 డాలర్ల డబ్బును ఆమెకు చెల్లించిన కేసులో ట్రంప్‌ను దోషిగా న్యాయస్థానం నిర్ధారించింది. తానేమీ తప్పు చేయలేదని, డేనియల్స్‌తో తనకెలాంటి సంబంధం లేదని ట్రంప్ వాదిస్తూ వచ్చారు. మన్‌హటన్ కోర్టు విచారణలో ఉపయోగించిన సాక్ష్యాధారాలు గత వేసవిలో సుప్రీం కోర్టు ఇచ్చిన రూలింగ్‌ను ఉల్లంఘించాయని ట్రంప్ తరపు అటార్నీలు వాదించారు. అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైనందున ఆయన ఇటువంటి చర్యల నుండి రక్షణ వుంటుందని సుప్రీం కోర్టు ఆనాడు పేర్కొంది.

సంధి ప్రేలాపనలు

- భారత్‌పై విషం చిమ్ముతూ ఎక్స్‌లో విద్వేష పోస్టులు
- భావోద్వేగాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు

అమెరికాలో ట్రంప్ మద్దతుదారుల దుశ్చర్య

వాషింగ్టన్ : గత సంవత్సరం చివరి వారాల్లో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో భారత్‌కు వ్యతిరేకంగా విద్వేష ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు ఆజ్యం పోస్తున్నారు. వీరంతా హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న వారే. భారత్‌పై విషం కక్కుతూ సాగుతున్న ఈ ప్రచారం వ్యవస్థీకృతంగా, ఓ పద్ధతి ప్రకారం జరుగుతుండడం గమనార్హం. ఎక్స్‌లో భారత్ వ్యతిరేక పోస్టుల సంఖ్య పెరుగుతోందని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్ సంస్థ తెలిపింది. దీనికి సంబంధించిన నివేదికను గురువారం విడుదల చేశారు.

గత సంవత్సరం డిసెంబర్ 22, ఈ నెల 3వ తేదీ మధ్య భారత్‌కు వ్యతిరేకంగా పెట్టిన 128 పోస్టులను ఎక్కువ మంది వీక్షించారని, షేర్ చేశారని ఆ సంస్థ తెలియజేసింది. ఈ నెల 3వ తేదీ నాటికి ఈ పోస్టులను 138.54 మిలియన్ల మంది చూశారు. వీటిలో 36 పోస్టులకు సంబంధించి ఒక్కో దానిని పది లక్షల మందికి పైగా చూడడం జరిగింది. ఈ పోస్టులు 85 ఖాతాల నుండి వచ్చాయి. వీటిలో మూడో వంతు ప్రీమియర్ ఖాతాలే. భారత్‌కు వ్యతిరేకంగా వివాదాస్పద, విద్వేషపూరిత, చట్టవిరుద్ధ, సంచలనాత్మక పోస్టులు పెడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే ఈ పోస్టులు ఎక్స్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయి. అయినప్పటికీ నేటికీ 125 పోస్టులు ఆ వేదికలో దర్శనమిస్తూనే ఉన్నాయి. వీటిలో ఎనిమిది పోస్టులను సమస్యాత్మకమైనవిగా చూపారు. నివేదికలో విశ్లేషించిన 85 పోస్టుల్లో కేవలం ఒక దానిని మాత్రమే తొలగించారు.

లారా పోస్ట్‌తో మొదలు

ట్రంప్ మద్దతుదారు లారా లూమర్ ఎక్స్‌లో భారతీయ అమెరికన్లను లక్ష్యంగా చేసుకొని పోస్ట్ పెట్టినప్పటి నుండీ విద్వేష ప్రచారం మొదలైంది. త్వరలో ఏర్పడబోయే ట్రంప్ ప్రభుత్వంలో ఏఐ సలహాదారుగా శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. నైపుణ్యం కలిగిన సాంకేతిక సిబ్బందిని తయారు చేయడంలో అమెరికా విఫలమైందంటూ అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వివేక్ రామస్వామి విమర్శించడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ట్రంప్ మద్దతుదారుడు, ఎక్స్ వేదిక అధిపతి ఎలన్ మస్క్ హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని సమర్ధించారు. ఆ కార్యక్రమం ద్వారానే తాను అమెరికా వచ్చానని గుర్తు చేశారు. ఈ పరిణామాలన్నీ భారత్ పట్ల విద్వేష ప్రచారానికి దోహదపడ్డాయి. జాత్యాహంకార, విద్వేష ప్రచారానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

ఇవేం పోస్టులు?

భారతీయులు శ్వేతజాతి ఉద్యోగుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారంటూ 47 పోస్టుల్లో సెంటిమెంటును రగిల్చే ప్రయత్నం చేశారు. భారతీయుల్లో పరిశుభ్రత కన్పించదని, వారి మనసులు స్వచ్ఛమైనవి కావని 35 పోస్టులు విషం చిమ్మాయి. భారతీయులు బహిరంగ ప్రదేశాల్లో మల మూత్ర విసర్జన చేస్తారని, గో మూత్రాన్ని, ఆవు పేడను ఉపయోగిస్తారని పాతిక పోస్టుల్లో అవాకులూ చవాకులూ పేలారు. భారతీయులు పశ్చిమ దేశాల పౌరులు...ముఖ్యంగా అమెరికా వారితో పోలిస్తే నాసిరకంగా ఉంటారని కొన్ని పోస్టుల్లో సంధి ప్రేలాపనలు కన్పిస్తున్నాయి. శ్వేత జాతీయులతోనే కాకుండా ఇతర ఇమ్మిగ్రెంట్ ప్రజలతో పోల్చినా భారతీయుల్లో తెలివితేటలు తక్కువేనని కొన్ని పోస్టుల్లో వితండవాదం చేశారు. కొన్ని పోస్టులకు చిత్రాలు జోడించి వాటిలో మన దేశంలోని మురికివాడలను చూపారు. విద్వేష ప్రచారం కేవలం హిందువులను లక్ష్యంగా చేసుకొని సాగుతున్నది మాత్రమే కాదు...సిక్కు సమాజం సహా మొత్తం భారత సమాజం పైనే దాడి జరుగుతోంది.



ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలివ్వాలి

ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులను ముట్టడించిన ఆశాలు

సమస్యలు పరిష్కరించాలని వినతులు

"తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. దీనిపై వచ్చే బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో ప్రకటించాలి" అంటూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు.





నవతెలంగాణ- విలేకరులు

"తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. దీనిపై వచ్చే బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో ప్రకటించాలి" అంటూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు క్యాంపు కార్యాలయం వద్దకు ఆశాలు పెద్దఎత్తున చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో వినతిపత్రాన్ని గేటుకు అతికించారు. నిజామాబాద్ రూరల్, అర్బన్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టి వినతిపత్రాలు అందజేశారు.

వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్పీకర్ పీఏకు వినతిపత్రం అందజేశారు. పరిగి పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంటి వద్ద, కొడంగల్‌లోని కాడ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ప్రత్యేక అధికారి వెంకటరెడ్డికి మెమోరాండం అందజేశారు. తాండూర్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైటాయించారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, కల్వకుర్తి, నారాయణపేట, కొల్లాపూర్, మక్తల్‌లో ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేల కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. భూపాలపల్లిలో ఆశాలు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలో పోస్ట్ ఆఫీస్ నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వరకు ర్యాలీ చేపట్టారు. పోలీసులు మధ్యలో అడ్డుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క పీఏకు వినతిపత్రం అందించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందించారు. సిద్దిపేట పట్టణంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పీఏకు వినతిపత్రం అందించారు. దుబ్బాకలోని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేతో ఫోన్లో మాట్లాడి వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని హామీ తీసుకొని పీఏకి మెమోరాండం అందించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. దమ్మపేట, ఇల్లందు మండలంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు.

నల్లగొండ ఎమ్మెల్యే, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. హాలియా మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాంప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ క్యాంపు కార్యాలయాన్ని ఆశావర్కర్లు ముట్టడించి.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నకిరేకల్‌లో ఆశా వర్కరు ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు.

దల్లేవాల్‌కు మద్దతుగా సీపీఐ(ఎం) ప్రదర్శన

ప్రపంచ బ్యాంకు విధానాలు అనుసరిస్తోన్న మోడీ ప్రభుత్వం

రైతన్నను కాపాడేందుకు చర్యలు శూన్యం

ఆయనకు ఏమైనా జరిగితే బీజేపీనే బాధ్యత వహించాలి : సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ సరిహద్దులోని ఖనేరీలో 46 రోజుల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్ నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు విధానాలు, కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఫలితంగా భారత్ దేశం వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందటం లేదని విమర్శించారు. అంబానీ, అదానీ కోసం బడా ప్రపంచ పారిశ్రామికవేత్తల కోసం మోడీ 24 గంటలు పని చేస్తున్నారని చెప్పారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కాపాడటానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ఈ దేశంలో రైతులు ఆత్మహత్య చేసుకొనే విధంగా మోడీ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. దేశంలో ఉన్న రైతులు బాగుపడాలని నిరవధిక దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జిత్ సింగ్‌కు ఏమైనా జరిగితే మోడీ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై .విక్రమ్, వైరా డివిజన్ కార్యదర్శి భుక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లాస్‌ఏంజెల్స్‌లో కొనసాగుతున్న కార్చిచ్చు

- 35వేల ఎకరాలు ఆహుతి
- ఎక్కడ చూసినా బూడిదే
- 10కి చేరిన మృతుల సంఖ్య
- బాధిత ప్రాంతాల్లో దోపిడీలు

లాస్ ఏంజెల్స్ : సంపన్నులు నివసించే ప్రాంతమైన లాస్ ఏంజెల్స్‌లో కార్చిచ్చు రాన్రాను విస్తరిస్తోంది. గాలులు కూడా ఉధృతంగా వీస్తుండడం ఇందుకు దోహదపడుతోంది. ఇప్పటికే దాదాపు 35వేల ఎకరాలను ఈ దావానలం ఆహుతి చేసింది. మృతుల సంఖ్య పదికి పెరిగిందని అధికారులు తెలిపారు. వేలాదిమంది ఇళ్ళు, వాకిళ్ళు వీడి ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. కాగా ప్రస్తుతం నెలకొన్న కల్లోల పరిస్థితులను చక్కదిద్దడానికి, వీధులను శుభ్రం చేయడానికి కాలిఫోర్నియా నేషనల్ గార్డు సైనికులు రంగంలోకి దిగారు. అమెరికాలోనే రెండవ అతిపెద్ద నగరమైన లాస్‌ఏంజెల్స్ నగరంలో చాలా భాగం బూడిద, శిధిలాలుగా మారింది. కాగా రాత్రంగా అగ్ని కీలలను అదుపు చేయడానికి అగ్నిమాపక దళాలు పనిచేస్తూనే వున్నాయి. దీనికితోడు హెలికాప్టర్ల ద్వారా నీటిని చిమ్ముతునే వున్నారు. గాలుల తీవ్రత కూడా కొంచెం తగ్గడం కలిసివచ్చింది. కాగా మరోవైపు పలు చోట్ల చిన్న చిన్నగా కొత్తగా మంటలు తలెత్తినట్లు వార్తలందాయి. కార్చిచ్చు ఒకవైపు తగలబెడుతుంటే మరోవైపు దోపిడీ దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. హాలీవుడ్ స్టార్లు, సంపన్న ప్రముఖులు ఇళ్లను ఖాళీ చేసి వచ్చేయడంతో దోపిడీలు, దొంగతనాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాత్రి పూట కర్ఫ్యూ విధించాలని భావిస్తున్నట్లు లాస్‌ఏంజెల్స్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా తెలిపారు. బాధత ప్రాంతాల్లో గస్తీ తిరిగే బాధ్యతలను నేషనల్ గార్డు బలగాలకు అప్ప చెప్పారు. ప్రజలను కాపాడేందుకు తమ వద్ద గల అన్ని పరిష్కార మార్గాలను అమలు చేస్తున్నామని గవర్నర్ గవిన్ న్యూసమ్ చెప్పారు. దోపిడీలను ఎంత మాత్రమూ సహించేది లేదన్నారు. అయితే మంటలకు దగ్ధమైన ఏరియా చాలా విస్తారంగా వుండడంతో అంతా కాపలా కాయడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది.

నారిశక్తి సత్తా చూపుదాం

మహారాష్ట్రలో తొలిసారిగా మహిళా రైతు రాష్ట్ర సదస్సు

- ప్రారంభించిన ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే
- 17 పాయింట్ల చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను ప్రవేశపెట్టిన ఏఐకేఎస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషిస్తున్న నారిశక్తి సత్తాను మరోసారి చూపుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ నాసిక్ నగరంలోని కామ్రేడ్ గోదావరి పరులేకర్ హాల్‌లో మొట్టమొదటి మహిళా రైతు రాష్ట్ర సదస్సును నిర్వహించింది. 15 జిల్లాల నుంచి మొత్తం 515 మంది ప్రతినిధులు హాజరయ్యారు. థానే-పాలెర్ (155), అహ్మద్‌నగర్ (109), నాసిక్ (93) అనే మూడు జిల్లాల నుంచి రైతు మహిళల అతిపెద్ద సమీకరణ జరిగింది. కిసాన్ సభ జెండా ఎగురవేసిన అనంతరం ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ దేశ్‌ముఖ్ స్వాగతించారు. ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజిత్ నవాలే సమావేశం లక్ష్యాన్ని వివరించారు. ఇది ఐదుగురు సభ్యులతో కూడిన అధ్యక్షవర్గంతో మొత్తం మహిళల వేదికగా నిలిచింది. ఈ సదస్సును ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభించారు. మహిళా కిసాన్ అధికార్ మంచ్‌కి చెందిన సీమా కులకర్ణి సభలో ప్రసంగించారు. ఏఐకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ కవితా వారే 17 పాయింట్ల చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను ప్రవేశపెట్టారు. రైతు సమస్యలపై సీఐటీయూ, ఐద్వా, ఎఐఏడబ్ల్యుయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర సంఘాల నుంచి 21 మంది మహిళా ప్రతినిధులు మాట్లాడారు.

ఈ సదస్సులో సీఐటీయూ ఉపాధ్యక్షులు డాక్టర్ డీఎల్ కరాడ్, దహను నుంచి సీపీఐ(ఎం) ఎమ్మెల్యే వినోద్ నికోలే, సీఐటీయూ శ్రామిక మహిళా నాయకులు శుభ షమీమ్, ఆనంది అవఘాడే, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు నసీమా షేక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దత్తా చవాన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు సోమనాథ్ నిర్మల్ మాట్లాడారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే ముగింపు ప్రసంగం చేశారు. గ్రామీణ మహారాష్ట్ర అంతటా చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని, మహిళా రైతుల జిల్లా స్థాయి సమావేశాలను నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. డిమాండ్స్ చార్టర్‌లో హైలైట్ చేసిన అంశాలపై పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చింది.



కాలుష్య నియంత్రణ 'గాలి'కి

- ఎన్‌క్యాప్ నిధుల వినియోగంలో అలసత్వం
- 82 నగరాలలో దాదాపు 66 శాతమే ఖర్చు
- ఢిల్లీలో ఇది 40 శాతం కంటే తక్కువే
- గత ఐదేండ్లలో ఇదీ పరిస్థితి
- పర్యావరణవేత్తలు, నిపుణుల ఆందోళన

ప్రపంచంతో పాటు భారత్‌నూ పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య గాలి కాలుష్యం. రోజురోజుకూ తీవ్రమవుతున్న ఈ రక్కసిని నియంత్రించటానికి ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా దేశంలోని పలు నగరాలు, పట్టణాలను లక్ష్యంగా చేసుకుంటూ, వాయు కాలుష్య నియంత్రణ కోసం తీసుకొచ్చిన కార్యక్రమమే నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ). ఈ కార్యక్రమం కింద కోట్ల రూపాయల్లో నిధులు విడుదలవుతున్నా.. కాలుష్య నియంత్రణ కోసం పూర్తిగా నిధుల వినియోగం జరగటం లేదు. గత ఐదేండ్లుగా ఈ విషయంలో పలు నగరాలు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. దీనిపై పర్యావరణవేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగాలు నిధులను పూర్తిగా వినియోగించి గాలి కాలుష్య రక్కసిని దూరం చేయాలని సూచిస్తున్నారు.

న్యూఢిల్లీ : భారత్‌లో గాలి కాలుష్యం తీవ్రమవుతున్నది. ముఖ్యంగా, ఉత్తర భారతదేశంలో చలికాలంలో గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) ఆందోళనకరంగా ఉంటుంది. ఢిల్లీ, నోయిడాతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) నగరాలు, పట్టణాలు, ప్రాంతాల్లో ఈ పరిస్థితులు కనిపిస్తాయి. ఇక్కడ ప్రజలకు శ్వాస తీసుకోవటమూ ఇబ్బందిగానే ఉంటుంది. గాలి కాలుష్య నియంత్రణ కోసం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా దేశంలోని 131 నగరాలకు లక్ష్యాలను నిర్దేశించింది. 40 శాతం గాలి కాలుష్య తగ్గుదలను 2025-26 నాటికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టింది.


ఎన్‌క్యాప్ కింద 82 నగరాలు నేరుగా నిధులను పొందుతాయి. మిగిలిన 42 నగరాలు, పట్టణాలు మాత్రం 15వ ఆర్థిక సంఘం కింద నిధులను అందుకుంటాయి. 2019 నుంచి గతేడాది మే వరకు 131 నగరాలకు పైన తెలిపిన రెండు మార్గాల ద్వారా మొత్తం రూ.10,566 కోట్ల నిధులు అందాయి. ఇందులో 82 నగరాలకు గత ఐదేండ్లలో ఎన్‌క్యాప్ కింద 1615.47 కోట్ల నిధులు అందగా.. ఖర్చు చేసింది 1092 కోట్లు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ నగరాల్లో మాత్రం గాలి కాలుష్యం తీవ్ర ఆందోళనకరంగా ఉన్నది. ఇక్కడ ప్రమాదకర స్థాయిలో గాలి కాలుష్యం నమోదవుతున్నది. గతనెలలో గాలి నాణ్యతా సూచీ(ఏక్యూఐ) 481గా నమోదై నిర్ఘాంతపర్చింది. ఇక్కడ గాలి కాలుష్యం దేశంలోని మిగతా నగరాలతో పోలిస్తే చాలా ఆందోళనకరంగా ఉన్నా.. నిధుల వినియోగం మాత్రం 40 శాతం కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 131 నగరాలలో 55 మాత్రమే గాలిలో పీఎం10 సాంద్రతను 20 శాతం తగ్గించాయి. ఢిల్లీ కేవలం 14 శాతం తగ్గించటం గమనార్హం.

అట్టడుగున ఢిల్లీ

ఇక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు(యూటీ) వారీగా చూసుకుంటే ఢిల్లీ ఈ జాబితాలో అట్టడుగు స్థానంలో ఉన్నది. ఐదేండ్లలో రూ.42.69 కోట్ల నిధులు విడుదల కాగా.. ఢిల్లీ ఖర్చు చేసింది 32 శాతం. గుజరాత్ వంద శాతం నిధులను ఉపయోగించుకోగా, ఒడిశా (93.55 శాతం), ఛత్తీస్‌గఢ్ (92.8 శాతం) లు తర్వాతి వరుసలో ఉన్నాయి. ఇక ఢిల్లీ తర్వాత తక్కువ మొత్తంలో నిధులను ఉపయోగించుకున్న రాష్ట్రాలు, యూటీలలో జమ్మూకాశ్మీర్ (40 శాతం), మేఘాలయ (44 శాతం)లు ఉన్నాయి.

లక్ష్యాన్ని చేరినవి 31 నగరాలే : సీఆర్‌ఈఏ

131 నగరాల్లో 31 మాత్రమే లక్ష్యాలను చేరినట్టు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్‌ఈఏ) ఒక ప్రకటనలో పేర్కొన్నది. 41 నగరాలు పీఎం10 స్థాయిలలో 20-30 శాతం తగ్గింపు అనే ప్రారంభ లక్ష్యాన్ని సాధించగలిగాయని వివరించింది. ఇందులో పారదర్శకత లోపించిందనీ, ఈ మెరుగుదల ఎలా సాధించగలిగాయన్న విషయంలో స్పష్టత లేదని పేర్కొనటం గమనార్హం.



ఢిల్లీ 'అసెంబ్లీ' ప్రచారాల్లో పార్టీలు స్పందిస్తాయా?

ఢిల్లీని ప్రధానకంగా కలవరపెడుతున్న సమస్య గాలి కాలుష్యం. ఇది అక్కడి నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నది. ఈ రక్కసి కారణంగా ఢిల్లీ వాసులు శ్వాసకోశ సంబంధ వ్యాధులను ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతమని వాతావరణ నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేడిలో ఉన్నది. రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని చూరగొనేందుకు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఈ సమయం లోనైనా రాజకీయ పార్టీలు వాయు కాలుష్యంపై స్పందిస్తాయా? కాలుష్య నియంత్రణ హామీకి ముందుకొస్తాయా? అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఈ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఢిల్లీ వాసులే రాజకీయపార్టీలను నిలదీసి, వారి నుంచి హామీని పొందాల్సిన అవసరమున్నదని వారు సూచిస్తున్నారు.

తక్కువగా.. తప్పుగా నిధుల వినియోగం

ఎన్‌క్యాప్ అమలుపై కమిటీ ఆన్‌లైన్‌లో ఒక సమావేశాన్ని నిర్వహించింది. దీని ప్రకారం.. 68 నగరాలు మాత్రం వాటికి కేటాయించిన నిధుల్లో 75 శాతాన్ని కూడా వినియోగించలేదు. ఉదాహరణకు, నోయిడాకు రూ.30.89 కోట్లను కేటాయిస్తే.. 11 శాతం నిధులే ఖర్చు చేయటం గమనార్హం. అలాగే, ఏపీ లోని విశాఖపట్టణం 14 శాతం, అనంతపూర్ 20 శాతం మేర ఖర్చు చేశాయి. మెట్రో నగరాల్లో.. బెంగళూరు అతి తక్కువగా 30 శాతం నిధులను వెచ్చించగా.. ఢిల్లీ (32 శాతం), పూణే (46 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మరికొన్ని నగరాల్లో ఈ నిధుల వినియోగం తప్పుగా జరుగుతున్నట్టు సమాచారం.

సంపాదకీయం

గవర్నర్లు-సమాఖ్య వ్యవస్థ



తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరు మారలేదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాల్సింది పోయి ఒక సంఘ్ కార్యకర్తలా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరం. తమిళనాడు ప్రభుత్వంతో నిత్యం విభేదిస్తూ వార్తల్లో నిలిచే వివాదాస్పద గవర్నర్ కూడా ఈయనే. చట్టాల అమలుకు సంబంధించిన అంశాల నుంచి సంస్కృతుల పద్ధతుల వరకు గవర్నర్ దాడిచేస్తుంటే రాష్ట్రపతి కలగ జేసుకోకపోవడం కడు విచిత్రం! నాలుగు రోజుల కిందట తమిళనాడులో ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల నుంచి ఆర్ఎన్ రవి వాకౌట్ చేశాడు. శాసనసభ నుంచి గవర్నర్ వాకౌట్ చేయడం దేశచరిత్రలో, అందులో ఆయనే కావడం ఇది మూడోసారి. అధికారిక ప్రసంగ ప్రారంభం సందర్భంగా తన అభ్యర్థన మేరకు జాతీయగీతాన్ని ప్లే చేయలేదని ఆయన వాదన. దీంతో ప్రసంగం ఇవ్వకుండానే వెనుదిరిగాడు.

దేశంలో సాంఘిక అసమానతలు రూపుమాపేందుకు పోరాడిన విప్లవ సంఘసంస్కర్త పెరియార్ ఇవి రామసామి నాయకర్, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కామరాజ్, అన్నాదురై, కరుణానిధి పేర్లను కూడా చదవడానికి కూడా నిరాకరించాడీ గవర్నర్. ఎందుకీ విద్వేష అసూయ? ఎవరిపైనా ఇంతటి అక్కసు? జాతీయగీతాన్ని అవమానించారని గగ్గోలుపెట్టిన గవర్నర్ మరి, అంబేద్కర్, పెరియర్‌లను అవమానించినట్టు కాదా? రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే కదా గవర్నర్ పదవిని చేపట్టింది. ఏకంగా రాజ్యాంగ నిర్మాత పేరునే ఉచ్చరించడానికి ఇష్టపడని వ్యక్తి నిజంగా ఆ పదవికి అర్హుడేనా?

ఇది గౌరవమైన స్థానంలో ఉన్న వారు చేయాల్సిన పనికాదు.

భిన్నత్వంలో ఏకత్వంగా కలిసుండే దేశంలో ఏ రాష్ట్ర ప్రత్యేకత ఆ రాష్ట్రానిదే. మన రాష్ట్రానికొస్తే 'జయజయహే తెలంగాణ' మన రాష్ట్రగీతం. అలాగే తమిళ ప్రభుత్వ కార్యక్రమలన్నింటినీ తమిళ్‌తాయ్ వాజ్తు (తమిళ తల్లికి ఆహ్వానం)తో ఆరంభించి, జాతీయ గీతాలాపనతో ముగించడం 1976 నంచి వస్తున్న సంప్రదాయం. ఈ విషయం ముందుగానే ప్రభుత్వం చెప్పినప్పటికీ, దాన్ని అంగీకరించకపోగా 'ద్రావిడ నాడు' భావనపై అభ్యంతరాలు చెబుతూ వివాదాన్ని లేవనెత్తడం సమాఖ్య భావనకు తూట్లు పొడవడమే తప్ప మరొకటి కాదు. రాష్ట్రాల యూని యన్ అయిన భారత దేశంలో గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడమనేది హుందాతనం. ప్రసంగంలో స్ఫూర్తినిచ్చే అంశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై వివరించడమనేది ఎక్కడైనా జరిగేదే. కానీ ఆర్ఎన్ రవి అందుకు భిన్నం. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన స్థానంలో ఉండి 'ఇది యురోపియన్ సిద్ధాంతం.భారతదేశంలో దీనికి చోటు లేదు' అని వ్యాఖ్యానించడం విషాదకరం. డీఎంకె ప్రభుత్వం కొలువుదీరిన దాదాపు ఈ రెండేండ్ల కాలంలో ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ ఏదో ఒక వివాదంతో వాకౌట్ చేయడం పరిపాటిగా మారింది.

దేశంలో సాంఘిక అసమానతలు రూపుమాపేందుకు పోరాడిన విప్లవ సంఘసంస్కర్త పెరియార్ ఇవి రామసామి నాయకర్, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కామరాజ్, అన్నాదురై, కరుణానిధి పేర్లను కూడా చదవడానికి కూడా నిరాకరించాడీ గవర్నర్. ఎందుకీ విద్వేష అసూయ? ఎవరిపైనా ఇంతటి అక్కసు? జాతీయగీతాన్ని అవమానించారని గగ్గోలుపెట్టిన గవర్నర్ మరి, అంబేద్కర్, పెరియర్ లను అవమానించినట్టు కాదా? రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే కదా గవర్నర్ పదవిని చేపట్టింది. ఏకంగా రాజ్యాంగ నిర్మాత పేరునే ఉచ్చరించడానికి ఇష్టపడని వ్యక్తి నిజంగా ఆ పదవికి అర్హుడేనా? ఇలాంటి సంకుచిత, మతతత్వ భావాలు గల వ్యక్తులను ఎలా చూడాలి? ఏమని సంబోధించాలి? అందుకే ఆర్ఎన్ రవి చర్యల్ని ముఖ్యమంత్రి స్టాలిన్ 'పిల్లచేష్టలు'గా అభివర్ణించారు. వెంటనే 'రీకాల్' చేయాలని డీఎంకె ఎంపీ కనిమొళితో సహా ఇతర నేతలంతా కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఒక్క తమిళనాడే కాదు, కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, కర్నాటక సహా బీజేపీయేతర రాష్ట్రాల్లో కేంద్రంచే నియమించబడిన గవర్నర్లు ప్రభుత్వాలతో కయ్యానికి దిగడం, అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల్ని వెనక్కి పంపించడం, తాత్సారం చేయడం, పాలనను బాహాటంగానే విమర్శించడం కొంతకాలంగా జరుగుతున్న తంతు. అందుకే రాజ్‌భవన్‌లు రాజకీయ కేంద్రాలవుతున్నా యని వస్తున్న విమర్శల్లో అవాస్తవమేమీలేదు. మొన్నటివరకు తెలంగాణలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ తమిళిసై కూడా సభలు, సమావేశాల్లో బహిరంగంగానే కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శిం చారు. అంతేకాదు, ఏకగ్రీవంగా ఆమోదించిన ఎమ్మెల్సీ పేర్లను కూడా వెనక్కి పంపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుపైనా అభ్యంతరాలు తెలిపారు.


వ్యక్తిగతంగా ప్రాథమిక హక్కుల్లో ఎవరు ఎలాంటి అభిప్రాయాలనైనా వెల్లడించవచ్చు. ఇది కూడా రాజ్యాగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ. అంతమాత్రాన రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉన్నవారు దాన్ని విస్మరించడం అత్యంత బాధాకరం. నూతన విద్యావిధానంలో భాగంగా ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా-2025 ప్రతిపాదనల్లో కూడా గవర్నర్లకు అధికారాలనిచ్చే విధానాల్ని చేర్చారు. ఇప్పటికే రాష్ట్రాల్లో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో గవర్నర్లు అడ్డుతగులుతున్నారు. ఇప్పుడు దీన్ని విద్యావంతులు ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలి. అలాగే రాష్ట్ర మంత్రిమండలి సూచనలు,సలహాల మేరకే గవర్నర్ వ్యవహరించాలని 1974లోనే ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దానికి అనుగుణంగా గవర్నర్లు నడవాలే కానీ రాజకీయ పార్టీల విధానాలు అమలు చేసే పరిస్థితికి రాకూడదు. అలా వ్యవహరిస్తే గనుక అది రాజ్యాంగ విరుద్ధం.

హిందువులు- భారతీయులు

ప్రతి మసీదు వద్ద ఒక శివలింగాన్ని వెతకవద్దని ఆరెస్సెస్ అధినేత మోహన్‌భగవత్ ఇటీవల హిందూ సమాజానికి ఓ హెచ్చరిక చేశాడు. భారతదేశం ఓ శక్తివంతమైన దేశంగా ఎదగాలని, అందరూ కలిసి ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని కూడా ఆయన సెలవిచ్చారు. మతం స్వరూపంపైనా ధర్మం అంటే ఏమిటి? అనే విషయంపైనా అవగాహనలేకనే గతంలో ఎన్నో ఘోరాలు కూడా జరిగాయని ఆయన వాపోయారు.

అయితే జితేంద్రానంద సరస్వతి మఠాధిపతులు కొందరికి ఇది రుచించటంలేదు. హిందూ మతాన్ని గూర్చి సమరానికి ఆదేశాలు ఇచ్చే అధికారం తమకే సొంతమని, సామాజిక సంస్థల నేతలకు అసలు లేనేలేదని వీరి భావన. 'మేం అతనికి ఆదేశాలు ఇస్తాం తప్ప అతను మాకు ఆదేశాలు ఇవ్వడం కాదని' కుండబద్దలు కొట్టారు. కొందరిలో నాయకుడు కావాలనే దుగ్దలోనే ఇలాంటి ప్రేలాపనలు చేస్తున్నట్టు కూడా వారు ఆగ్రహోరోపణలతో ఊగిపోయారు.

ఇప్పుడు అసలు సిసలైన హిందూమతవాదులకు పెద్ద చిక్కొచ్చిపడింది. ఎవరి మాటలు వినాలి? ఆరెస్సెస్ వారివా? లేక పీఠాధిపతులుగా ఉంటున్న మతాచార్యుల



వారివా? అని. ఆచార్యులు అంటే ఆచరించే ఆర్యులు కదా! అయితే ఇరువురూ హిందూ ధర్మపక్షపాతులే కనుక ఈ ఘర్షణను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కొందరు మేధావులు సైతం సన్నాయి నొక్కులు నొక్కడం విడ్డూరం.మరి హిందువులకు నిజమైన మార్గదర్శకులు ఎవరు? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

మనది ఓ ప్రజాస్వామ్యదేశం. కుల, మత, భాషా, ప్రాంతాలకు, బేధాలకు అతీతంగా ప్రజలందరిని సమ దృష్టితో చూసే లౌకికస్ఫూర్తి మన భారత రాజ్యాంగం మనకు కల్పిస్తున్నది. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్న మన గణతంత్ర (రిపబ్లిక్) పాలన మనకు అదే విషయాన్ని నొక్కిచెప్తున్నది. అటువంటప్పుడు హిందువులు భారతీయులు కారా? లేక హిందువులు భారతీయులకన్నా అతీతులా?అన్న అనుమానం పైమాటలు వింటున్నప్పుడు కలుగక మానదు.

'రాజ్యాంగమే మనకు దిక్సూచి. రాజ్యాంగ స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు కలసి మెలసి పనిచేయాల్సిన బాధ్యత మనపై ఎంతో ఉన్నదని' 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఉద్ఘాటించిన విషయం విదితమే. సామాన్యుల జీవితాలను మెరుగుపరచడానికి ఇది అత్యంత అవశ్యమని కూడా ఆమె ఆ సందర్భంలో తెలిపారు.

కాని మత విద్వేషాల చిచ్చు రగిల్చి, అమాయకపు ప్రజల ప్రాణాలను బలికొనే ఉన్మత్త దుర్నీతిపరులకు రాష్ట్రపతి మాటల అంతఃసారంగాని, రాజ్యాంగపు సామరస్య జీవనస్ఫూర్తిగాని బోధపడుతుందా? అనేది ప్రశ్నార్థకమే. లేదా రాజకీయ లబ్ధికోసమే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే వారి ప్రధాన రహస్య ఎజెండాగా భావించడంలో తప్పేముంటుంది?

రాజ్యాంగ దినోత్సవం (నవంబరు 26) నాటికి రెండ్రోజులు ముందే ఉత్తరప్రదేశ్‌లోని సంభావ ప్రాంతంలో ఊహించని విధంగా మతహింస జరిగింది. స్థానిక కోర్టు ఉత్తర్యుల మేరకు అక్కడ ఉన్న షాహిజామా మసీదు సర్వేను అడ్డుకోవాలని ప్రయత్నించడంతో ఘర్షణ మొదలైంది. చిలికి చిలికి గాలివానగా మారినట్టు రాళ్లురువ్వడం, పోలీసుల లాఠీచార్జీ, బాష్ప వాయుగోళాలు ప్రయోగం, చివరకు కాల్పులు జరపడం, ఐదుగురు చనిపోవడం సంభవించాయి. దాదాపు రెండున్నర వేలమందిపై ఈ సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేయడం ఆశ్చర్యం గొలిపింది.

ఆ షాహిజామా మసీదు ప్రాంతంలో ఐదువందల ఏండ్ల క్రితం హరిహర ఆలయం ఉండేదని, ఆ ఆలయాన్ని వచ్చి బాబర్ మొఘల్ చక్రవర్తి షాహిజామా మసీదును నిర్మించారని, ఆ నిజాన్ని నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టు న్యాయ వాది విష్ణుశంకర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈయనే జ్ఞానవాపి కేసులో హిందువుల తరపున లాయర్ కూడా.

మసీదులు, దర్గాల కింద ఆలయాలున్నాయని, వాటిని పునరుద్ధరించాలని హిందువులు కోర్టులకు ఎక్కు తున్నంత కాలం మతఘర్షణలు చెలరేగడానికి ఆస్కారమున్నదనే విషయం పైఘటన రుజువు చేస్తున్నది. వారణాసిలో జ్ఞాన వాసి మసీదు వివాదం హిందూ మతవాదులకు అతి ముఖ్య మైనది. ఆ మసీదు కింద విశ్వనాథుని ఆలయం ఉందని, ఆ ఆలయాన్ని కూల్చి, ఆ శిథిలాలపై ఔరంగజేబు 1670 ప్రాంతంలో అక్కడ మసీదు నిర్మించాడని హిందూ మత వాదుల ఆరోపణ. ఇప్పుడు ఇలాంటి వివాదాలే మత ఘర్షణ లకు కారణభూతమం అవుతున్నాయనేది కాదనలేని సత్యం.

1991నాటి ప్రార్థనా మందిరాల చట్టంపై తనతీర్పు వెలువడేంతవరకు మసీదుల కింద మందిరాలు న్నాయని వాదిస్తూ వాటిపై సర్వే జరిపించాలని కోరే వ్యాజ్యాలను అనుమతించరాదని దేశంలోని కోర్టులన్నింటికీ సుప్రీంకోర్టు డిసెంబరు 13న ఆదేశాలు జారీచేసింది. రాజ్యాంగంలోని 'సౌభ్రాతృత్వం' అనే పదానికి అర్థం తెలుసు కున్నా, ప్రజలం దరికీ సమానత్వపు హక్కు ఉన్నదనే గ్రహింపు ఉన్న సెక్యుల రిజం అనేది భారత రాజ్యాంగం మౌలిక నిర్మాణ స్వభావం లో భాగమేనన్నది బోధపడుతుంది. ఈ చిత్తశుద్ధి ఉన్నవారు మాత్రమే హిందువులు భారతీయుల్లో భాగమే అనే స్ఫురణ కు వస్తారు. లేనివారు హిందువులు వేరు, భారతీయులు వేరు అంటూ మత ఘర్షణలకు కారకులవుతారు.

- కె.శాంతారావు, 9959745723

అంబేద్కర్ భావజాలం హిందూత్వ రాజకీయాలకు అనుకూలమా?



రామ్ పునియానీ


లోక్‌సభలో బాబాసాహెబ్ అంబేద్కర్‌ను హోంశాఖ మంత్రి అమిత్ షా అవమానించిన తీరుపై దేశ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అంబేద్కర్ కూడా సావర్కర్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ రాజకీయాలకు అనుకూలంగా ఉన్నాడనే కథనాన్ని సృష్టించేందుకు మితవాద హిందూ జాతీయవాద సిద్ధాంతకర్తలు ప్రయత్నం చేస్తున్నారు. హిందూత్వ భావజాలాన్ని అంబేద్కర్ ఎంతగా ప్రశంసించాడో తెలియజెప్పేందుకు అంబేద్కర్ చేసిన బృహత్తర కృషిని ఎంచుకొని అక్కడ కొన్ని ఇక్కడ కొన్ని అంశాలను తీసుకొని వారు ఒక చిత్రాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. వారు అంబేద్కర్‌ను ఉదహరిస్తూ, అస్పృశ్యులలో స్వామి శ్రద్ధానంద అత్యంత గొప్ప, క్రమశిక్షణాయుతమైన యోధుడని" అంటున్నారు. 'ముస్లింలు, హిందూ మతంలోకి మారాలని' చేపట్టిన 'శుద్ధి' కార్యక్రమంలో పాల్గొన్నది ఇదే స్వామి శ్రద్ధానంద అనే వాస్తవాన్ని వారు పరిగణనలోకి తీసుకోలేదు. ఇది ముస్లిం మత పెద్దలకు ఆగ్రహం కలిగించింది.

"హిందూ మతం మనుగడ సాగించాలంటే, దాని సంఖ్యను పెంచడం గురించి కాక, దానికి సంఘీభావాన్ని పెంచడం గురించి ఆలోచించాలి, అంటే కులనిర్మూలన గురించి ఆలోచించాలని అర్థం. కుల నిర్మూలనే హిందువులకు నిజమైన సంఘటన. కులాలను నిర్మూ లించడం ద్వారా సంఘటనను సాధించినప్పుడు, 'శుద్ధి' కార్యక్రమాల అవసరం ఉండదని" అంబేద్కర్ 'శుద్ధి' పై ప్రతిస్పందించాడు. ఇది, హిందువులను ఇస్లాం మతంలోకి మార్పిడి చేయడానికి ప్రయత్నిస్తున్న తబ్లిఘి జమాత్‌చే నిర్వహించ బడుతున్న తన్జీమ్‌కు సమాంతరమైనది, వ్యతిరేకమైనది. తరువాత కాలంలో శ్రద్ధానంద భారత జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి అయినప్పటికీ, హిందూమత రాజ్య స్థాపనకు కట్టుబడి, పునరుజ్జీవించబడిన హిందూ మహాసభలో భాగంగా ఉన్న హిందూ సంఘటనలో కూడా భాగస్వామిగా ఉన్నాడు.

అంబేద్కర్, సావర్కర్‌లు ఒకే నాణేనికి ఇరువైపులుగా ఉన్నారనే కొత్త వివరణలు తెరపైకి వస్తున్నాయి. దేవాలయాల్లోకి దళితుల ప్రవేశాన్ని అనుమతించే పతిత పావన్ దేవాలయాలను సావర్కర్ ప్రారంభించింది వాస్తవం. బాబాసాహెబ్ చెప్పేదాని ప్రకారం, అంటే ఇది, కేవలం దళితులు మాత్రమే ప్రవేశం పొందే ఒక ప్రత్యేక దేవాలయాన్ని సృష్టిస్తుంది. "అంబేద్కర్, ప్రారంభం నుంచి పతిత పావన్ దేవాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించాడు. ఈ దేవాలయాలనే తర్వాత కాలంలో అస్పృశ్యుల దేవాలయాలని పిలుస్తారని ఆయన విశ్వసించినట్లు,"బహిష్కృత భారత్" పత్రిక 12 ఏప్రిల్1929 నాడు ప్రచురించిన సంపాదకీయంలో పేర్కొన్నారు.అయితే అంబేద్కర్, అవి అసంబద్ధమైనవని భావించి నప్పటికీ సావర్కర్ ప్రయత్నాలను ప్రశంసించాడు. ఇవి, హిందూత్వ సిద్ధాంతకర్తలు లేవనెత్తుతున్న కొన్ని అంశాలు. కాంగ్రెస్‌తో అంబేద్కర్ సంబంధాల గురించి వివరించే క్రమంలో వారు చాలా దూకుడుగా వ్యవహరిస్తారు. గాంధీ, పటేల్‌ల మరణం తరువాత నెహ్రూ చాలా నిరం కుశంగా వ్యవహరించి, ప్రతిపక్షాన్ని విస్మరిం చాడని హిందూత్వ సిద్ధాంతకర్తలు కొందరు వాదిస్తున్నారు.

ఆర్టికల్ 370, విదేశాంగ విధానం, ఎస్సీ, ఎస్టీల పరిస్థితులపై నెహ్రూతో "విభేదాలు" ఉన్న కారణంగానే నెహ్రూ మంత్రివర్గంలో మంత్రి పదవికి అంబేద్కర్ రాజీనామా చేశాడని, బీజేపీ నాయకుడు, హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నాడు. హిందూ కోడ్ బిల్లు విష యంలో నీచంగా వ్యవహరించిన తీరుపై తీవ్ర నిరుత్సాహానికి గురైన కారణంగానే అంబేద్కర్ కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆరెస్సెస్ పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించింది. ఆరెస్సెస్ కార్యకర్తలు పార్లమెంట్ ముందు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. 11డిసెంబర్ 1949న రామ్ లీలా మైదానంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించి, అంబేద్కర్, నెహ్రూ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో వారి చర్యలు పరాకాష్టకు చేరాయి. హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తూ, పత్రిక "ఆర్గనైజర్" 7 డిసెంబర్ 1949న "మేము హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఎందుకంటే, ఆ బిల్లు విదేశీ మరియు అనైతిక సూత్రాలపై ఆధారపడిన ఒక దిగజారుడు చర్య. అది హిందూ కోడ్ బిల్లు కానేకాదు." అని పేర్కొన్నారు. హిందూ కోడ్ బిల్లుపై ఆరెస్సెస్ సాగించిన దూకుడు ప్రచారం ఫలితంగా ఆ బిల్లు ఆలస్యమై, నీరుగారి పోయిన కారణంగా ఆవేదనతో అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు.

అంబేద్కర్‌కు, సావర్కర్ దగ్గర నుంచి బీజేపీ వరకు మధ్య ఉన్న విభేదాలలో ముఖ్యమైనది మనుస్మృతి, చాతుర్వర్ణ వ్యవస్థ. డిసెంబర్ 25, 1927 నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతిని తగుల బెట్టిన సందర్భంలో, ఆరెస్సెస్ రెండవ సర్సంగ్ చాలక్ గోల్వాల్కర్ మనుస్మృతిని స్తుతిస్తూ,పొగడ్తలతో రాయడం మొదలుపెట్టాడు. సావర్కర్ కూడా చాతుర్వర్ణ వ్యవస్థకు మద్దతు తెలిపి, మనుస్మృతిని ఇలా ప్రశంసించాడు: "మన హిందూ దేశానికి వేదాల తరువాత అత్యంత పూజ్యనీయమైన పురాణం మనుస్మృతి. ఇది, ప్రాచీన కాలం నుండి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, అలవాట్లకు ఆధారమైనది. శతాబ్దాల కాలంగా ఈ గ్రంథం మన దేశ ఆధ్యాత్మిక, దైవిక ప్రగతిని క్రోడీకరిస్తోంది. నేటికి కూడా హిందువులు కోట్ల సంఖ్యలో తమ జీవితాల్లో, తమ ఆచరణలో అనుసరిస్తున్న నియమాలన్నీ మనుస్మృతి ఆధారంగానే జరుగు తున్నాయి. నేడు మనుస్మృతే, అన్నిటికీ మూలాధారమైన హిందూచట్టం. నూతన భారత రాజ్యాంగంలో అత్యంత దారుణమైన విషయం ఏమంటే, దానిలో అసలు భారతీయత అనేది లేదు. ప్రాచీన భారతీయ రాజ్యాంగ చట్టాలు, సంస్థలు, పేర్లు, పదాల ప్రస్తావనే ఆ నూతన రాజ్యాంగంలో లేవు".



అంబేద్కర్, సావర్కర్‌లు ఒకే నాణేనికి ఇరువైపులుగా ఉన్నారనే కొత్త వివరణలు తెరపైకి వస్తున్నాయి. దేవాలయాల్లోకి దళితుల ప్రవేశాన్ని అనుమతించే పతిత పావన్ దేవాలయాలను సావర్కర్ ప్రారంభించింది వాస్తవం. బాబాసాహెబ్ చెప్పేదాని ప్రకారం, అంటే ఇది, కేవలం దళితులు మాత్రమే ప్రవేశం పొందే ఒక ప్రత్యేక దేవాలయాన్ని సృష్టిస్తుంది. "అంబేద్కర్, ప్రారంభం నుంచి పతిత పావన్ దేవాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించాడు. ఈ దేవాలయాలనే తర్వాత కాలంలో అస్పృశ్యుల దేవాలయాలని పిలుస్తారని ఆయన విశ్వసించినట్లు,"బహిష్కృత భారత్" పత్రిక 12 ఏప్రిల్1929 నాడు ప్రచురించిన సంపాదకీయంలో పేర్కొన్నారు. అయితే అంబేద్కర్, అవి అసంబద్ధమైనవని భావించి నప్పటికీ సావర్కర్ ప్రయత్నాలను ప్రశంసించాడు. ఇవి, హిందూత్వ సిద్ధాంతకర్తలు లేవనెత్తుతున్న కొన్ని అంశాలు.

హిందూత్వ భావజాలంతో అంబేద్కర్‌కు ఉన్న ముఖ్యమైన విభేదాన్ని చాపకింద దాచిపెడుతున్నారు. 13అక్టోబర్1935 నాడు అంబేద్కర్ నాసిక్ దగ్గర ఇయోలాలో మాట్లాడుతూ "నేను హిందువుగా మరణించననే" ఒక పిడుగు లాంటి విషయాన్ని చెప్పాడు. ఆయన చెప్పిన మాట ప్రకారం, ఈ మతంలో స్వేచ్ఛ, జాలి, కరుణ, దయ, సమానత్వాలకు స్థానం లేదు. సవరించబడిన ఆయన రచన,"థాట్స్ ఆన్ పాకిస్థాన్"లో, భారత ప్రజలకు ఒక "పెద్ద విపత్తు" గా మారే హిందూమత రాజ్య స్థాపనకు మార్గాన్ని సుగమం చేసే అవకాశం ఉన్న ఇస్లామిక్ పాకిస్థాన్ ఏర్పాటును వ్యతిరేకించాడు. ఆయన దీన్ని ప్రకటించాడు కాబట్టి సిక్కు మతం లేదా ఇస్లాం మతాలను స్వీకరించాలని ఆయనపై ఒత్తిడులు వచ్చాయి. ఒకవేళ అంబేద్కర్ ఇస్లాం మతాన్ని స్వీకరించడం జరగకుంటే, హిందూ మహాసభ అతని చర్యను వ్యతిరేకించదని, హిందూ మహాసభకు చెందిన డాక్టర్ మూంజే, అంబేద్కర్‌తో ముందుగానే ఒక ఒడంబడిక చేసుకున్నాడు. బాబాసాహెబ్ స్వంత లోతైన అధ్యయనాలే ఆయన బౌద్ధాన్ని స్వీకరించేందుకు దారితీసాయి.

నేడు, అంబేద్కర్ విగ్రహాల్ని ఏర్పాటు చేయడం ద్వారా, ఆయన జ్ఞాపకార్థం ఒక అంతర్జాతీయ మ్యూజియంను, ఇతర స్మృతి చిహ్నాల్ని ఏర్పాటు చేయడం ద్వారా వారు బాబాసాహెబ్ అంబేద్కర్ ను "గౌరవిస్తున్నామన్న" విషయాన్ని బీజేపీ వారు ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇవి గుర్తింపుకు సంబంధించిన సమస్యలు కాగా, బాబాసాహెబ్ విలువల్లోని ముఖ్యమైన అంశాన్ని బలహీన పరు స్తున్నారు. రిజర్వేషన్ల విషయంలో మండల్ కమిషన్ అమలైనప్పుడు, బీజేపీ, కమండల్ (హిందూత్వ) రాజకీయాల్ని ఆశ్రయించింది. కమం డల్ రాజకీయాల్లో భాగంగా నిర్వహించబడిన రథయాత్ర కాలంలో ప్రముఖ బీజేపీ నాయకుడు ఎల్.కే.అద్వానీని అరెస్ట్ చేయడంతో వీ.పీ.సింగ్ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన పార్టీలలో భాగంగా ఉన్న బీజేపీ, ఆ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పడిపోయింది.

అంబేద్కర్, హిందూత్వ రాజకీయాలలో భాగమనే విషయాన్ని నిరూపించాలన్న బీజేపీ ఆరాటం అనేది, హిందూ దేశం అనేవారి భావజాలానికి పూర్తి వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి జ్ఞాపకం నుండి చట్టబద్ధత పొందేందుకు ఒక శుద్ధమైన సమ్మేళనం. హిందూ రాజ్యాన్ని వ్యతిరేకించి, ప్రజాతంత్ర, లౌకిక గణతంత్రాన్ని కోరుకున్న అంబేద్కర్‌ను తమ సైద్ధాంతిక పరివార్‌లో భాగంగా ముందుకు తెచ్చేందుకు నేడు హిందూ రాజ్యం కోసం నిలబడే వారు ప్రయత్నించడం ఎంత విడ్డూరం!

("న్యూస్‌క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

మిగులు జలాలు - ప్రభుత్వాల బాధ్యత




బొంతల చంద్రారెడ్డి
9490098005

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో వివక్షత వలన మన ప్రాంతం వెనుకబడిపోయిందని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని సాగిన పోరాటాల ఫలితంగా పదేండ్ల క్రితం తెలంగాణ ఏర్పడింది. రాష్ట్రమైతే ఏర్పడింది. నీళ్ల విషయంలోనే రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలు సమసిపోలేదు. దీనికోసం ఏర్పడిన బ్రిజేష్ ట్రిబ్యునల్ కూడా సమస్యల్ని పరిష్కరించడం లేదు. రాష్ట్రం కృష్ణా-గోదావరి నదుల మధ్య ఉంది. ఈ నదుల్లో తెలంగాణకు భూపాలపట్నం ఇంద్రావతి జల విద్యుత్ ఉత్పత్తి నీటితో కలిపి 1343.69 టీఎంసీల జలాలు మన రాష్ట్రం వినియోగించుకోవటానికి వీలుంది. అయినా, సాగు తాగునీటికొరత నేటికీ కొనసాతూనేవుంది. రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా ఉన్న నదులనీటిని సద్వినియోగం చేయగలిగితే 134.30 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యము కలుగుతుంది. కానీ, ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంతో నేటికీ నీటి కొరత నుండి రాష్ట్రం విముక్తి కాలేదు.

తెలంగాణ ఇప్పటికి వ్యవసాయక రాష్ట్రమే. రాష్ట్ర బౌగోళిక విస్తీర్ణం283.65 లక్షల ఎకరాలు కాగా సాగు యోగ్యమైన భూమి 167.17 లక్షలు ఎకరాలు ఉన్నవని ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నవి. 1956 నాటికి తెలంగాణలో 3,49,993 ఎకరాలకు పన్నెండు ప్రాజెక్టుల కింద సాగునీటి సౌకర్యం అందింది. 2014-2024 వరకు టీ(బీ)ఆర్ఎస్ ప్రభుత్వం 15లక్షల 81వేఎకరాల వరకు నీటిపారుదల సౌకర్యం కల్పించినట్టు తెలిపింది. మొత్తంగా 46,80,613 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం ఏర్పడింది. మరోవైపు 2023 మార్చి వరకు 27.75 లక్షల పంపుసెట్ల కింద 52 లక్షల ఎకరాలు సాగవుతున్నట్టు ప్రకటించింది.క్రిష్ణానది పరివాహక ప్రాంతమంతా మహారాష్ట్ర, కర్నాటక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. కేంద్రం 1956లో అంతరాష్ట్ర నది జలాల పరిష్కార చట్టం తెచ్చింది. ఆ సందర్భంలో క్రిష్ణా జలాల పంపిణీకి జస్టిస్ ఆర్.ఎస్ బచావత్ ఛైర్మన్‌గా 1969లో ట్రిబ్యూనల్ ఏర్పాటైంది.ఈ కమిషన్ 1976మే 10న కేంద్రానికి తన తీర్పును సమర్పిస్తూ 2020వరకు ఈ తీర్పు మీద ఎలాంటి విచారణ చేయ రాదని పేర్కొన్నది. ఆ తదుపరి, రాష్ట్రాలు కోరితే స్కీమ్ 'బి' ప్రకారం మరో ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేయాలి.

స్కీమ్ (బి) మిగులు జలాల్లో 25శాతం మహారాష్ట్ర, 50శాతం కర్నాటక, 25శాతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలి. తీర్పు నాటికి రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాలను గౌరవించి, నిర్మాణం జరిగిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని పరిగణలోకి తీసుకొని 75శాతం నీటి లభ్యత విశ్వసనీయత ఆధారంగా నికర జలాలు 2060 టీఎంసీలు, పునరుత్పత్తి 70 టీఎంసీలు వెరసి 2130 టీఎంసీలుగా నిర్ధారించింది. అంతకుపైన జలాలు లభ్యమైతే వరదలొచ్చినా, కరువొచ్చినా నష్టపోయే దిగువ రాష్ట్రం ఏపీ వినియోగించుకోవాలని తెలిపింది. ఆ ప్రకారం మహారాష్ట్రకు 585 టీఎంసీలు, కర్నాటకకు 734 టీఎంసీలు, ఏపీకి 811 టీఎంసీలు ప్రకటించింది. తీర్పునాటికి మహరాష్ట్ర 439.65 టీఎంసీలు, కర్నాటక 504.55 టీఎంసీలు, ఏపీ749.16 టీఎంసీలు మొత్తంగా 1693.36 టీఎంసీల నీటి వినియోగం జరుగుతున్నది.



కృష్ణానదికి వచ్చే నీటిలో కర్నాటకలోని తుంగనది పరివాహక ప్రాంతం దేశంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతున్నది.యేటా 430 సెం.మీ నీరు ఈ నది ద్వారానే వస్తుంది. దీన్ని గమనించిన కర్నాటక ప్రభుత్వం తనకు కేటాయించిన 734 టీఎంసీల్లోని వాటాను తుంగ ప్రాంతంలో పెంచుకుని ఆమేరకు భద్ర ప్రాంతంలో తగ్గించుకుని నిర్మించిన ఫలితంగా శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుకు సకాల నీటి ప్రవాహం తగ్గింది. దీనిమీద అప్పటి ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేయలేదు. ఈ ఏడాది వరదలు రావటంతో శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ నుండి నీటిని దిగువకు వదులుతున్నారని కర్నాటక ప్రభుత్వం తుంగభద్ర జలాశయానికి సమాంతరంగా 45 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించతలపెట్టింది.

మిగులు జలాల వివాదంపై కర్నాటక ప్రభుత్వం చేసిన ఫిర్యాదుతో కేంద్రం 2004లో జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన రెండవ ట్రిబ్యునల్‌ను వేయగా నికరజలాలను 75శాతం కాకుండా 65శాతం విస్వసనీయతను పరిగణలోకి తీసుకోని బచావత్ తీర్పుకు అదనంగా147 టీఎంసీలు, పునరుత్పత్తి 16 టీఎంసీలు, మిగులుజలాలు 285 టీఎంసీలు మొత్తంగా 448 టీఎంసీలు బచావత్ కేటాయింపుకు అదనంగా నిర్ధారించింది. మహారాష్ట్రకు 81 కర్నాటకకు 177, ఏపీకి 190 టీఎంసీలు కేటాయింపులు చేసింది. బచావత్ తీర్పు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాలను పరిగణలోకి తీసుకుని నీటి కేటాయింపులు చేస్తే ఈ ట్రిబ్యూనల్ అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు 519.24 మీటర్ల వరకు నిర్మించుకోవచ్చని జోతిబసు అధ్యక్షతన ఏర్పడిన నిపుణుల కమిటీ రిపోర్టును కర్నాటకతో సహా అన్ని రాష్ట్రాలు అంగీకరించినదాన్ని సుప్రీంకోర్టు ధ్రువపరిచింది. అందుకనుగుణంగా కేంద్రం గెజిట్ ప్రకటించినా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు 524.256 మీటర్ల ఎత్తు వరకు పెంపుతో 303 టీఎంసీల నీటి నిలువకు అవకాశమిచ్చింది. ఇలా అనుమతివ్వడం వలన ఆంధ్రకంటే తెలంగాణకే ఎక్కువ నష్టం జరిగిందని నిపుణుల వాదన. మహారాష్ట్రలోని "కొహినా"జల విద్యుత్ ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ 67.5 టీఎంసీల నీరు కేటాయించగా విద్యుత్ ఉత్పత్తి తర్వాత ఆ నీరంతా అరేబియా సముద్రములో కలుస్తుంది. దీనికి కూడా ఈ ట్రిబ్యునల్ అదనంగా 25 టీఎంసీలు, వెరసి 92.5 టీఎంసీలు కేటాయించింది. మరోవైపు మహారాష్ట్ర, కర్నాటక ప్రభుత్వాలు క్రిష్ణబేసిన్‌లో నిర్మించాలనుకున్న వాటికి నీటి కేటాయింపులు చేయాలని కోరాయి. ఏపీ ప్రభుత్వం క్రిష్ణా, బేసిన్‌లో ఉన్న తెలంగాణ పాజెక్టులు ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి, బీమా 1,2 దశలు నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పెన్నా నది బేసిన్‌లో ఉన్న ఎస్ఆర్‌బిసి, గాలేరు-నగరి, హంద్రీ -నీవా, వెలిగొండ ప్రాజెక్టుల వివరాలిచ్చి క్రిష్టాబేసిన్ కాకుండా పెన్నాబేసిన్‌కు నీటి కేటాయిం పులు చేయాలనే డిమాండ్‌ను నిరాకరించిన ట్రిబ్యునల్ కర్నాటకకు అదనంగా నీళ్ల కేటాయించింది.

జీవో నెంబర్ 69/96 ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్ కనీస నీటిమట్టం 834అడుగులు ఉండాలని నిర్ణయించింది. ఇది 2004 వరకు అమల్లో ఉంది. రాయలసీమ విద్యుత్ ఉత్పత్తికి 4500 క్యూసెక్కుల నీరు వినియోగించిన తర్వాత మాత్రమే ఇరిగేషన్‌కు వినియోగం జరిగేది. 2004లో 107జీవో పేరుతో శ్రీశైలం నీటి మట్టం 834 నుండి 854 అడుగులకు పెంచుతూ అనుమతినిచ్చారు. 841 అడుగుల నుండి 11వేల క్యూసెక్కుల నీటిని తరలించటానికి పూనుకున్నారు. రెండేండ్లు గడవకముందే 2006లో జీవో 3 పేరుతో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుండి 11వేల క్యూసెక్కుల నుండి 44వేల క్యూసెక్కులకు పెంచారు. తదుపరి, 2020లో జీవో 203 పేరుతో రాయలసీమ ఎత్తిపోతల పథకం పోతిరెడ్డిపాడుకు సమీపంలో సంగమేశ్వరం వద్ద (రోజుకు 3 టిఎమ్‌సిల చొప్పున తరలిస్తున్నారు) 80వేల క్యూసెక్కుల ప్రవాహంతో ప్రాజెక్టును పూర్తిచేశారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో (క్యారీ ఓవర్) రాబోయే పంటలకు నిలువ 150 టీఎంసీలు పెట్టాలని తెలిపిన ఆచరణకు దిక్కులేదు. పాత కర్నూల్ జిల్లాలోని ముచ్చుమర్రి వద్ద క్రిష్ణానదిలో +797 అడుగుల వద్ద మోటర్లు బిగించి రోజుకు అర టీఎంసీ చొప్పున నీటిని తరలిస్తున్నారు.

2015లో ఉమ్మడి రాష్ట్రానికి ఉన్న 811 టీఎంసీల్లో బచావత్ ట్రిబ్యునల్‌ను పరిగణలోకి తీసుకోకుండా వినియోగించుకున్న నీటి ఆధారంగా ఏడాది వరకే అని తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కి 512 టీఎంసీలుగా 37:63 నిష్పత్తి ప్రకారము నీటివరకు కేటాయిస్తూ వస్తున్నది. క్రిష్టా పరివాహక ప్రాంతం తెలంగాణలో 68.5శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో 31.5 శాతం ఉంది.

పోలవరం నుండి క్రిష్టాబేసిన్‌కు 80టీఎంసీలు మళ్లింపు ప్రణాళిక చేసి 80కి బదులు 110 టీఎంసీలు మళ్లించారు. బేసిన్ మారిన ఫలి తంగా క్రిష్టా బేసిన్ ఎగువ రాష్ట్రాలకు 45 టీఎంసీలివ్వాలి. ఆ నీటిని తెంగాణకు కేటాయించాలి. అదేవిధంగా పెన్నా బేసిన్‌కు కూడా క్రిష్ణానీటిని 95 టిఎంసీల వరకు తరలించారు. ఆ మేరకు పరిగణనలోకి తీసుకోని మిగులు జలాల్లో తెలంగాణ వాటాను రాబట్టటానికి పూనుకోవాలి. పరివాహక ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాన్ని పరిగణించి నీటి కేటాయింపుల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

బ్రిజేష్‌కుమార్ ట్రిబునల్ తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేస్తూ తీర్పునివ్వాలి. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల ఆధారంగా నీటి కేటాయింపులు చేయాలి. జూరాలపై గల నెట్టెంపాడు(22 టిఎంసీలు), శ్రీశైలంపైన ఉన్న కల్వకుర్తి, (40 టిఎంసీలు) పాలమూరు ఎత్తిపోతల (120 టిఎంసీలు) కేటాయించాలి. ఉమ్మడి రాష్ట్ర నీటిలో తెలంగాణ వాటాను రాబట్టుకోవటంలోనే దక్షిణ తెలంగాణ భవిష్యత్ ఆధారపడి ఉంది. పాలకులు ఆ వైపు దృష్టి సారించాల్సిన అవసరమున్నది. ●

ఛిద్రమైన వలస కూలీల జీవితాలు

(మొదటిపేజీ తరువాయి)



సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఐలాపురం స్టేజీ సమీపంలో హైదరాబాద్-ఖమ్మం జాతీయ రహదారి 365పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా, బీహార్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి తెలంగాణలో వివిధ రకాల పనుల నిమిత్తం వందల మంది కార్మికులు ఉపాధి కోసం వస్తుంటారు. ఆ క్రమంలోనే ఒడిశా రాష్ట్రం గుప్తా ట్రావెల్స్‌కు చెందిన బస్సులో అక్కడి నౌపడ, కలహండీ, నవరంగ్‌పూర్, కొరపూట్ ప్రాంతాల కూలీలు 32 మంది ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటలకు ఒక ఏజెన్సీ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఖమ్మంలో బస్సు డ్రైవర్ మరొకరు అందుబాటులో లేకపోవడంతో సునీల్ గోరడా అనే వ్యక్తి ఒక్కడే నడుపుతున్నాడు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి కొవ్వూరు నుంచి సంగారెడ్డి జిల్లాలోని కోహిర్‌కు ఇసుక తీసుకెళ్తున్న లారీ సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల మండలం ఐలాపురంలోని అంగోతు తండా వద్ద రాత్రి టైర్ పగలడంతో డ్రైవర్ మడెం భాస్కర్ హైదరాబాద్ రోడ్డు పక్కకు ఆపాడు. ఎలాంటి సిగ్నల్ వేయకుండా, బోర్డులు పెట్టకుండా ఆపాడు. తెల్లవారుజామున 3గంటల సమయంలో పొగమంచు, నిద్రమత్తు కారణంగా వలస కూలీలతో వచ్చిన బస్సు డ్రైవర్ సునీల్ గోరడా లారీని గమనించక వెనుక నుంచి ఢీకొట్టాడు. ఆ సమయంలో కూలీలంతా నిద్రలో ఉన్నారు. రెప్పపాటులో కూలీల బతుకులు ఛిద్రమయ్యాయి. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరొకరు మృతిచెందారు. 18 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో భార్యాభర్తలైన రూపు హరిజన్(51), సుల హరిజన్(46), మరో మహిళ సునామని హరిజన్(61), బస్సు డ్రైవర్ సునీల్ గోరడా(37), ప్రత్యుష్ ప్రభాత్ హరిజన్(17) ఉన్నారు. పింటూ బంజారా, రోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను 108లో సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఒడిశాకు చెందిన తల్వాడ లాభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేశ్వర్ వెల్లడించారు.

చెల్లాచెదురు..

ప్రమాదం జరిగిన ప్రాంతంలో కూలీల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. చేతులు, కాళ్లు విరిగిపోయి రోడ్డు పక్కన పడిపోయాయి. మరణించిన ఓ వ్యక్తి కాలు రోడ్డు పక్కన పడి ఉండటంతో స్థానికులు డివైడర్ మధ్యలో వేశారు. బస్సు నుజ్జునుజ్జు అయింది.

నిబంధనలు పాటించని ట్రావెల్స్ యాజమాన్యం

దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు హెల్పర్లు ఉంటారు. ఒడిశా నుంచి బయలుదేరిన సమయం నుంచి మార్గమధ్యలో ఖమ్మం వద్ద ఒక డ్రైవర్, హెల్పర్ దిగిపోయి మరొక డ్రైవర్, హెల్పర్ డ్యూటీ చేయాలి. అలాంటిది ఖమ్మంలో డ్రైవర్ ఎక్కకపోవడంతో ఒకే డ్రైవర్ బస్సు నడిపాడు. నిద్రమత్తుకు పొగమంచు తోడవ్వడంతో ఐదుగురు ప్రాణం కోల్పోయారని తోటి కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. ఖమ్మంలో డ్రైవర్ మారితే ఇంతటి ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఉండేది కాదని బస్సులో ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

ఘటనాస్థలాన్ని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేసి జాతీయ రహదారిపై లారీలు, ఇతర వాహనాలు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ రవి, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను భారీ క్రేన్ సాయంతో పక్కకు జరిపించారు.

బైకును ఢీకొట్టిన లారీ..

నర్సాపూర్ : బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్(26), అతని స్నేహితుడు నాగరాజు(25) కొంపల్లి వెళ్లి వస్తున్న క్రమంలో నర్సాపూర్ ఎన్జీవోస్ కాలనీ వద్ద హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో అల్లీపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. దుర్గాప్రసాద్‌కు భార్య, కూతురు, నాగరాజుకు భార్య, కుమార్తె ఉన్నారు.

23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల భారీ ఆపరేషన్
- ఐదు రాష్ట్రాల్లో ఏడు టీంలతో గాలింపు
- దేశ వ్యాప్తంగా 359 కేసులతో సంబంధం
- నిందితుల్లో యూపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే
- ఆమెను అరెస్ట్ చేయొద్దంటూ 10 మంది లాయర్ల బృందం కోర్టులో వాదనలు
- వివరాలు వెల్లడించిన సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో జరిగిన నేరాల్లో అధిక సంఖ్యలో సైబర్ నేరాలే నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలను కట్టడి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, యూపీ, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలకు పాల్పడినవారితోపాటు డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఉద్యోగాలిపిస్తానంటూ అమాయకులను మోసం చేసి కోట్లు కొల్లగొట్టారు. నిందితులు దేశవ్యాప్తంగా 255 మంది బాధితులను ముంచారు. వీరిపై తెలంగాణలో 30, దేశవ్యాప్తంగా 359 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 25 సెల్‌ఫోన్లు, 45 సిమ్ కార్డులు, 28 చెక్‌బుక్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డులను, ల్యాప్‌టాప్, క్యూఆర్ స్కానర్‌లతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో నిందితులకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్స్ డీసీపీ ధార కవిత వెల్లడించారు. ఐదు ప్రత్యేక బృందాలతో ఆపరేషన్ నిర్వహించి 23 మంది సైబర్ నిందితులను అరెస్టు చేసినట్టు వివరించారు. వీరు వివిధ నేరాల్లో మొత్తం రూ.5.29 కోట్లు కాజేశారన్నారు. అక్కడి పోలీసుల సాయంతో అధునాతన సాంకేతికతను ఉపయో గించి ముఠా సభ్యులను పట్టుకున్నట్టు చెప్పారు. ఈ ముఠాలో ఓ మహిళ కీలకంగా వ్యవహరించినట్టు తెలిపారు.

ఎమ్మెల్యేగా పోటీ.. ఆర్థిక కష్టాల్లోకి..

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కమలేష్ కుమారి వ్యాపారం నిర్వహిస్తూ, స్వచ్ఛంద సంస్థను కూడా నిర్వహిస్తోంది. ఆమె అక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసింది. ఎన్నికలలో పెద్దఎత్తున డబ్బులు ఖర్చు పెట్టడంతో ఆమె ఆర్థిక కష్టాల్లోకి వెళ్లింది. దాంతో అందులో నుంచి బయటపడేందుకు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపింది. ఈ క్రమంలో ఆమెకు పరిచయమైన వాళ్లు ఆమె ఎన్జీఓ బ్యాంకు ఖాతాను వారికి అప్పగించాలని కోరారు. దీంతో ఆమె తన బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లకు అప్పగించింది. ఆ ఎన్జీఓ ఖాతాలో బాధితులు డిపాజిట్ చేసే సొమ్ములో కమీషన్ ఆమెకు అందుతుంది. ఇలా హైదరాబాద్‌కు చెందిన 70 ఏండ్ల వృద్ధుడు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రూ.34 లక్షలు పోగొట్టుకున్నాడు. డిజిటల్ అరెస్టు పేరుతో అతన్ని 8 రోజులు సైబర్ క్రైమ్ నేరగాళ్లు భయపెట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ సతీష్‌రెడ్డి బృందం బ్యాంకు ఖాతాలను ఆరా తీయడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థ ఖాతాలోకి బాధితుడి సొమ్ము డిపాజిట్ అయిందని గుర్తించారు. ఇలా కమలేష్‌కుమారికి రూ.1.90 కోట్లు వచ్చాయి. ఈ మేరకు ప్రత్యేక బృందం యూపీకి వెళ్లి కమలేష్‌కుమారితో పాటు మరికొంత మందిని అరెస్టు చేసింది. ఆమెను అరెస్టు చేయొద్దంటూ యూపీలో 10 మంది లాయర్ల బృందం కోర్టులో వాదనలు వినిపించడం గమనార్హం. అయితే, పోలీసులు ఆమె బ్యాంకు ఖాతాలోకి బాధితులు డిపాజిట్ చేసిన సొమ్ము, అక్కడి నుంచి ఇతర ఖాతాలకు వెళ్లిన వైనాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో అక్కడి కోర్టు ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసింది. దాంతో ఆమెను హైదరాబాద్‌కు తరలించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ కవిత కోరారు. గుర్తు తెలియని వారి మాటలకు బోల్తా పడొద్దని, వాట్సాప్ కాల్స్‌లో పోలీసుల డ్రెస్సు వేసుకుని విచారించినా, బెదిరించినా సైబర్ మోసమని గుర్తించాలన్నారు. ప్రజలు అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించకూడదని, వాటికి స్పందిస్తే ఖాతా నుంచి డబ్బులు పోయే ప్రమాదముందని తెలిపారు. మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- పెండ్లికి ఇంట్లో ఒప్పుకోవట్లేదని అఘాయిత్యం
- సంగారెడ్డి జిల్లా మునిపల్లిలోని హరిత రిసార్ట్స్‌లో ఘటన

నవతెలంగాణ-మునిపల్లి

పెండ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసరెడ్డిపల్లి వద్దనున్న హరిత రిసార్ట్స్‌లో శుక్రవారం జరిగింది. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట గ్రామానికి చెందిన కరిపే ఉదయ్, అదే గ్రామానికి చెందిన మంగలి రోహిత.. గత కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే వారి పెండ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెందారు. ఈ నేపథ్యంలో గురువారం హరిత రెస్టారెంట్‌కు చేరుకున్న వారు.. ఒకరోజు బస కోసమని రూమ్ అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి కిటికీ తెరిచి చూడగా నూలుతాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. కుంకుమ దారం పసుపుతో పెళ్లి చేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. కాగా హరిత రిసార్ట్ మేనేజర్ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ. 3,637 కోట్లు

- ఆంధ్రప్రదేశ్‌కు రూ . 7,002 కోట్లు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాల పంపిణీ కింద తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 7,002.52 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి నెలకు గానూ రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటా పంపిణీ నిధులను కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గానూ రూ.1,73,030 కోట్లను విడుదల చేసినట్టు ఆర్థిక శాఖ వెల్లడించింది. మూలధన వ్యయాన్ని వేగవంతం చేసే ఉద్దేశం, రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సంబంధిత ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అధిక మొత్తంలో నిధులు విడుదల చేసినట్టు స్పష్టం చేసింది. అయితే గత నెల డిసెంబర్ పన్నుల వాటా కింద రాష్ట్రాలకు కేంద్రం కేవలం రూ.89,086 కోట్లు విడుదల చేసినట్టు తెలిపింది. కాగా... పన్నుల వాటాలో ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా రూ. 31,039 కోట్లు దక్కాయి. ఆ తరువాత స్థానంలో బీహార్‌కు రూ.17,403 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ. 13,582 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ. 13,017 కోట్లను కేంద్రం విడుదల చేసింది. అత్యల్పంగా గోవాకు రూ.667 కోట్ల వాటాను పంపిణీ చేసింది. నిబంధనల ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో 14 వాయిదాల్లో కేంద్ర పన్నుల వాటాను రాష్ట్రాలకు పంపిణీ చేయొచ్చని తెలిపింది.

రైతుల్ని గందరగోళపర్చొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన సర్వేను విజయవంతంగా పూర్తి చేసినందుకు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆయన అభినందించారు.

కలెక్టర్లకు క్లాస్...

కలెక్టర్లు ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలనీ. ఇప్పటికీ కొంతమంది కలెక్టర్లు ఆఫీసుల్లోనే కూర్చొని పని చేయాలనుకుంటున్నారని ఆక్షేపించారు. క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లాలనీ, సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. జనవరి 26 తర్వాత తానే స్వయంగా జిల్లాలో పర్యటిస్తూ, ఆకస్మిక తనిఖీలు చేస్తాననీ, ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయి అధికారులను కూడా కలెక్టర్లు అప్రమత్తం చేయాలన్నారు. మహిళా ఐఏఎస్ అధికారులతో పాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టల్స్ విజిట్ చేయాలనీ, రాత్రిపూట అక్కడే బసచేసి విద్యార్థుల అవసరాలు, సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు.

26 నుంచి పథకాల అమలు

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లయినందున ఈ జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు అత్యంత ప్రాధాన్యముందని తెలిపారు. అదే రోజున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేలకు పెంచటంతో పాటు, భూమి లేని నిరుపేద కూలీ కుటుంబాలకు రూ.12 వేల నగదు సాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తామన్నారు. పనికి ఆహారం పథకం ద్వారా ఏడాదిలో కనీసం 20 రోజులు పనిచేసిన కుటుంబాలకు ఈ స్కీం వర్తిస్తుందని చెప్పారు. సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డులు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ పథకాల అమలుకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పథకాల్లో లబ్దిదారుల ఎంపికకు సేకరించిన వివరాలు, తయారు చేసిన జాబితాలను గ్రామసభల్లోనే వెల్లడించాలని చెప్పారు.

వన్ స్టేట్ వన్ రేషన్...

గతంలో ఉన్న అర్హత నిబంధనల ప్రకారమే రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. ఒక వ్యక్తికి ఒకేచోట రేషన్ కార్డు ఉండాలన్నారు. ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ కార్డులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్లు

గూడు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించామన్నారు. అందులో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తొలి విడత నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల ఆమోదంతో ఈ అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రచురించాలన్నారు.

వేళాపాళా లేని సినిమా

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేస్తూ జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమాల ప్రదర్శనలకు కూడా వేళాపాళా ఉంటుందనీ, ఎప్పుడుపడితే అప్పుడు సినిమాలను ప్రదర్శించ కూడదని హైకోర్టు వ్యాఖ్యానించింది. తెల్లవారుజాము 4 గంటలకే హీరో రామ్‌చరణ్ యాక్టింగ్ చేసిన గేమ్ ఛేంజర్ సినిమాను ప్రదర్శించేందుకు రాష్ట్రసర్కార్ అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా సినిమా షోలకు అనుమతివ్వడం మానవ హక్కుల ఉల్లంఘన లాంటిదేనని చెప్పింది. రాత్రి పూట నిద్రపోవాలనీ, ఇది ఆరోగ్య కోణంలో మానవ హక్కు కిందకే వస్తుందని చెప్పింది. అర్ధరాత్రి లేచి సినిమా చూసేందుకు సగటు ప్రేక్షకుడు వెళితే వాడి ఆరోగ్యం ఏం కావాలని వ్యాఖ్యానించింది. పగలు నిద్రపోయినప్పటికీ రాత్రి నిద్రపోతేనే మనిషికి ఆరోగ్యమని చెప్పింది. ఇదే సమయంలో తెల్లవారుజామున, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా సినిమా షోలకు మైనర్లకు ముఖ్యంగా 16 ఏండ్లలోపు వాళ్లకు అనుమతి ఇవ్వడం సబబు కాదని వ్యాఖ్యానించింది. ఒక షో తర్వాత మరో షోకి మధ్య పావుగంట మాత్రమే సమయం ఉంటే థియేటర్‌లోకి వెళ్లే వారికి, వచ్చే వారికి సమయం ఎలా సరిపోతుందని ప్రశ్నించింది. షోల మధ్య 15 నిమిషాల వ్యవధి ఉంటే ఎలా సరిపోతుందో అర్థం కావడం లేదంది. స్టేట్ గవర్నమెంట్ బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని చెప్పాక పుష్ప-2 తరువాత గేమ్ చేంజర్ సినిమా ఏంటని ఆరా తీసింది. అదనపు షో పేరుతో తెల్లవారుజామున షోకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించింది. దిల్ రాజు నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటించిన గేమ్‌ఛేంజర్ సినిమా తెల్లవారుజాము 4.30 గంటలకు ప్రదర్శనకు అనుమతి, సినిమా టిక్కెట్ల రేట్ల పెంపునకు అనుమతిస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇచ్చిన మెమోలను తిరిగి సమీక్ష చేయాలని తెలిపింది. ప్రధానంగా టిక్కెట్ల రేట్ల పెంపుపై 24 గంటల్లోగా ప్రభుత్వం తిరిగి సమీక్ష చేయాలంది. రాష్ట్రంలో సినిమా బెన్‌ఫిట్ షోకు అనుమతి ఇవ్వబోమని ప్రభుత్వం చెప్పిన కొద్ది రోజులకే గేమ్ ఛేంజర్ సినిమాకు ఎలా ఇచ్చిందని ప్రశ్నించింది. తెల్లవారు జామున 4 గంటలకు స్పెషల్ షో పేరుతో అనుమతి ఇవ్వడాన్ని తప్పుపట్టింది. అయితే, ఇప్పటికే సినిమా రిలీజ్ అయినందున ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని చెప్పింది. సినిమా టిక్కెట్ల రేట్ల పెంపుపై మెమో విషయంలో 24 గంటల్లోగా ప్రభుత్వం తిరిగి సమీక్ష చేయాలని ఆదేశించింది. ప్రభుత్వం కౌంటర్ వేయాలని ఆదేశించింది. విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

హరీశ్‌ను 28 వరకు అరెస్టు చేయొద్దు

ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా ఉన్న సిద్దిపేట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును అరెస్టు చేయరాదన్న గత ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 28 వరకు పొడిగించింది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేస్తే దానిని పోలీసులు నమోదు చేశారనీ, తనపై నమోదైన ఫోన్ ట్యాపింగ్' కేసును కొట్టివేయాలని హరీశ్ వేసిన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు జడ్జి లక్ష్మణ్ విచారించారు. పోలీసుల కౌంటర్‌కు రిప్లై ఇచ్చేందుకు గడువు కావాలని హరీశ్ లాయర్ కోరడంతో విచారణ 28కి వాయిదా పడింది.

బార్ కౌన్సిల్ ఎన్నికల కోసం రిట్

రాష్ట్ర బార్ కౌన్సిల్ పాలకవర్గానికి ఐదేండ్ల గడువు ముగిసి 6 నెలలు దాటినా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతోపాటు రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు నోటీసులు ఇచ్చారు. ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తారో వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

నేతన్నల కోసం చేనేత అభయహస్తం

ఇవీ విధివిధానాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ చేనేత అభయహస్తం పథకాన్ని ఈనెల 9వ తేదీ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నిధులు ఇలా...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తెలంగాణ చేనేత అభయహస్తం పథకం అమలు కోసం ఉన్న నిధులను వెల్లడించారు

1. తెలంగాణ నేతన్న పొదుపు (థ్రిఫ్ట్ ఫండ్)- రూ.15 కోట్లు
   పవర్‌లూమ్స్, బకాయిలకు-రూ.15 కోట్లు
2. తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా)- రూ.5.25 కోట్లు
3. తెలంగాణ నేతన్న భరోసా - రూ.31 కోట్లు
   వేతన ప్రోత్సాహకాలు (వేజ్ ఇన్సెంటివ్)- రూ.31 కోట్లు

ఇవీ మార్గదర్శకాలు...

తెలంగాణ నేతన్న పొదుపు (థ్రిఫ్ట్ ఫండ్)

- ఈ పథకం జియో-ట్యాగ్‌తో అనుసంధానమైన మగ్గాల చేనేత కార్మికులు, అనుబంధ కార్మికుల సంక్షేమం కోసం రూపొందించింది. ఇది కార్మికుల్లో పొదుపు అలవాటును ప్రోత్సహించడంతో పాటు వారికి సామాజిక భద్రత కల్పిస్తుంది.
- చేనేత కార్మికులు/అనుబంధ కార్మికులు వారి వేతనాల నుంచి దీనికి నెలవారీగా 8 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తారు. కాంట్రిబ్యూషన్ గరిష్ట పరిమితి రూ.1,200. ఇందుకు ప్రభుత్వం రెండింతలు అధికంగా అంటే 16 శాతం అందిస్తుంది. దీంతో దాదాపు 38 వేల మంది నేత కార్మికులు లబ్ధి పొందుతారు.



- ఈ పథకం 15 వేలమంది మర మగ్గాల (పవర్ లూమ్) కార్మికులకూ వర్తిస్తుంది. మర మగ్గాల కార్మికులు తమ వేతనం నుంచి నెలవారీగా 8 శాతం జమ చేస్తారు. వారి గరిష్ట పరిమితి రూ.1,200. ప్రభుత్వం వారి కాంట్రిబ్యూషన్‌కు సమానంగా 8 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తుంది.
- రికరింగ్ డిపాజిట్ వ్యవధి మూడు సంవత్సరాల నుంచి రెండు సంవత్సరాలకు తగ్గించారు..

తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా)

తెలంగాణ నేతన్న భద్రత పథకం రాష్ట్రంలోని జియో ట్యాగింగ్ అయిన మొత్తం చేనేత, మర మగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులకు వర్తిస్తుంది.

- ఈ స్కీంలో నమోదైన కార్మికుడు ఏదైనా కారణంతో మరణిస్తే, నామినీకి రూ.5 లక్షల సొమ్ము అందచేస్తారు.
- తెలంగాణ చేనేత కార్మికుల సహకార సంఘం ద్వారా బీమా కవరేజీ అందరికీ వర్తిస్తుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు ఉన్న 65 ఏండ్ల గరిష్ట వయోపరిమితిని ఎత్తివేశారు. 59 ఏండ్లు దాటిన వారికి కూడా ఇది వర్తిస్తుంది.
- ఈ పథకం అమలుకు ఏడాదికి బడ్జెట్ అంచనా వ్యయం రూ.9 కోట్లు

మార్కెట్ మరియు ఉత్పత్తి అభివృద్ధి కార్యక్రమం

- నేత కార్మికులకు వేతన ప్రోత్సాహకం ఈ కార్యక్రమ ప్రాథమిక లక్ష్యం. జియోట్యాగ్ అయిన మగ్గాల నుంచి నిర్దిష్ట ఉత్పత్తి ప్రమాణాల ఆధారంగా చేనేత కార్మికులకు ఏడాదికి గరిష్టంగా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేలు వేతన సహాయం అందించబడుతుంది. దీంతో కార్మికులకు వేతన మద్దతు లభించడంతో పాటు నాణ్యత పెరుగుతుంది.
- ఈ పథకం అమలుకు వార్షిక బడ్జెట్ అంచనా రూ.44 కోట్లు

తెలంగాణ చేనేత మార్క్ లేబుల్

- తెలంగాణకు ప్రత్యేకమైన చేనేత మార్క్ లేబుల్ రూపొందించారు. దేశ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రీమియానికి అనుగుణంగా తెలంగాణ చేనేత ఉత్పత్తులను లేబుల్ బ్రాండింగ్ చేస్తారు. దీన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు, మార్కెట్‌ను సృష్టించి, చేనేత కార్మికుల జీవనోపాధి, సంక్షేమం, అభివృద్ధికి మద్దతుగా నిలుస్తారు.
- దీనికి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ అవసరం లేదు
- ఈ పథకం తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ డైరెక్టరేట్ ద్వారా అమలవుతుంది.
- జియో ట్యాగ్‌తో అనుసంధానమైన మగ్గాలన్నీ వాటంతటవే రిజిస్టర్ అవుతాయి.కొత్త మగ్గాలకు ఆన్‌సైట్ వెరిఫికేషన్ చేస్తారు.
- తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుళ్లను ఆయా జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీ) సరఫరా చేస్తారు.
- దీనికోసం కేటాయించిన వార్షిక బడ్జెట్ రూ.4 కోట్లు

అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ

హీరో నాగార్జున సమక్షంలో ప్రారంభించిన దర్శకుడు ఎస్ఎస్. రాజమౌళి

నవతెలంగాణ-హైదరాబాద్

ఐకానిక్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో సినిమా అండ్ హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఏర్పాటు చరిత్ర సష్టించింది. దీనిని దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మెన్, అగ్రహీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ప్రారంభించారు. డాల్బీతో కలిసి ప్రారంభించబడిన ఈ అత్యాధునిక సౌకర్యం, భారతీయ చలనచిత్ర నిర్మాణం ఆడియో-విజువల్ ప్రమాణాలను రీడిఫైన్ చేయడం, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సినిమా ఎక్స్‌పీరియన్స్ అందించే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ గ్రాండ్ ఈవెంట్‌లో అకాడమీ అవార్డు గెలుచుకున్న రాజమౌళి ఆర్ఆర్ఆర్- స్పెషల్ ఫుటేజ్‌ను కూడా ప్రదర్శించారు.

అనంతరం దర్శకధీరుడు రాజమౌళి మాట్లాడుతూ "ఆర్ఆర్ఆర్ సమయంలో, మేము సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు, మేము జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలోనే డాల్బీ విజన్‌లో నా సినిమాను చూపించకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. కానీ ఈరోజు, అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి నేను చాలా థ్రిల్ అయ్యా. నా తదుపరి సినిమా విడుదలయ్యే సమయానికి, భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది అనేది మరింత గొప్ప విషయం. డాల్బీ విజన్‌లో సినిమా చూడటం పూర్తిగా భిన్నమైన అనుభవం - స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకెళ్తుంది. ప్రేక్షకులు దానిని ఎక్స్ పీరియన్స్ చేయడం థ్రిల్లింగ్‌గా వుంది' అని అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మెన్, అగ్రహీరో నాగార్జున అక్కినేని, భారతీయ సినిమా ఆవిష్కరణలలో స్టూడియో ఎలా ముందంజలో ఉందో చెప్పారు. "వర్చువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండటం నుంచి దేశంలో



మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా అండ్ హోమ్‌ను ఏర్పాటు చేయడం వరకు, భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం.

అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, డాల్బీతో ఈ సహకారం గొప్ప దార్శనికతకు నిదర్శనం. అన్నపూర్ణలో చేంజ్ ఇన్నోవేషన్ స్వీకరించడం మా లెగసీ, ఇది ఆ ప్రయాణంలో మరో ముందడుగు" అని అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియా యార్లగడ్డ ఈ మైలురాయి ప్రాముఖ్యతను వివరించారు. "సినిమా అండ్ హోమ్ కోసం డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీతో, భారతదేశంలో సినిమాల క్రియేషన్ ఎక్స్‌పీరియన్స్‌ని పునర్నిర్వచించే గేమ్-ఛేంజింగ్ టెక్నాలజీని మేము పరిచయం చేస్తున్నాం. ఫిల్మ్‌మేకర్స్ తమ కథలను అద్భుతమైన ప్రభావంతో చెప్పడానికి మేము సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్‌లో స్పెషల్ కంటెంట్, ఆర్ఆర్ఆర్ నుంచి సీన్స్ ప్రదర్శించారు. ఇవి ఫెసిలిటీ ఫీచర్స్‌ని హైలైట్ చేశాయి.

టీచర్ల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీచర్ల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం అభ్యర్థి మల్క కొమరయ్య అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ మీడియా ఇన్‌చార్జి ఎన్వీ.సుభాష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తన మీద నమ్మకంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన జాతీయ నాయకత్వానికి, ఎంపికలో సహకరించిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ కె.లక్ష్మణ్, అరవింద్‌కి, ఎమ్మెల్యేలకు, ముఖ్యనాయకులకు, ధన్యవాదాలు తెలిపారు. తాను సొంతూరులో మూడో తరగతి వరకు, అప్పన్నపేటలో పదోతరగతి దాకా, కరీంనగర్‌లో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించానని చెప్పారు. 1994 నుంచి తాను విద్యాసంస్థలను నడుపుతున్నాననీ, ఆరువేల మంది టీచర్లు తమ సంస్థల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు టీచర్లకు ఒకే రకమైన సమస్యలుంటాయనీ, 40 ఏండ్లుగా



విద్యార్థులను తయారు చేస్తూ, టీచర్ల సమస్యలను పరిష్కరిస్తున్నానని చెప్పారు. ఉత్తమ పౌరులను తయారుచేయడం టీచర్లతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడుతామన్నారు.



విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- లక్ష్యాల సాధనకు కృషి చేయాలి
- క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యతనివ్వాలి : ఇంజినీర్లకు మంత్రి ఉత్తమ్ ఉద్బోధ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నీటిపారుదల శాఖలో పని చేసే ఇంజినీర్లు విధి నిర్వహణలో అలసత్వం చూపరాదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి హితవు పలికారు. హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్‌కు ఘనమైన చరిత్ర ఉందనీ, ఆ వారసత్వాన్ని నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని జలసౌధలో మంత్రి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయభాస్కర్ రెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ రాపోలు రవిందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, గౌరవాధ్యక్షులు ధర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో నీటిపారుదల ఇంజినీర్లు ముందుండాలని అభిప్రాయ పడ్డారు. క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. హైదరాబాద్ విలీనానికి ముందే నిజాంపాలనలో ఏర్పడ్డ ఈ అసోసియేషన్‌కు తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చేయూతను ఇస్తుందని వివరించారు.

ఉత్తర ద్వారంలో భద్రాద్రి రాముడు

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- రామనామ స్మరణతో మార్మోగిన భద్రగిరి
- మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేల సందర్శన



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనరూపుడైన శ్రీ రామచంద్రుడు శ్రీ మహావిష్ణువు అలంకారంలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి 6.20 గంటల వరకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఆవశ్యకతను వివరించారు. అర్చకులు 108 ఒత్తులతో వెలిగించిన హారతిని భక్తులు అందుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదమంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా వేడుక నిర్వహించారు. అనంతరం రాపత్తు ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తరామదాసు కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవరులకు స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ సెక్టార్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, పినపాక, ఇల్లందు ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ దంపతులు, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, దేవస్థానం ఈఓ రమాదేవి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, పొంగులేటి ప్రసాద్ రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి, ఇతర ప్రముఖులు వేడుకను తిలకించారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. ఎస్పీ రోహిత్ రాజ్ నేతృత్వంలో 1200 మందికి పైగా పోలీసులు భద్రతాచర్యలను పర్యవేక్షించారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం : కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సీతారామచంద్రస్వామి దేవ స్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం విజయ వంతమైందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించామని చెప్పారు. ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాం గానికి, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

క్రైస్తవులపై 834 దాడులు

- 2023 కంటే గతేడాదే అధికం
- ఏడాది వ్యవధిలో వంద ఘటనలు పెరిగిన వైనం
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువ
- యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం సమాచారం


న్యూఢిల్లీ : భారత్‌లో మైనారిటీ వర్గమైన క్రైస్తవులకు రక్షణ కరువైంది. మోడీ పాలనలో వారి భద్రత విషయంలో పరిస్థితి దిగజారింది. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం (యూసీఎఫ్) విడుదల చేసిన సమాచారమే ఇందుకు నిదర్శనం. 2024లో భారత్‌లో క్రైస్తవులపై 834 దాడులు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించింది. 2023లో ఈ సంఖ్య 734గా ఉన్నది. ఏడాది వ్యవధిలోనే ఈ దాడి ఘటనల సంఖ్య వంద పెరిగి 834గా నమోదైందని పేర్కొన్నది.

యూపీ, ఛత్తీస్‌గఢ్‌లలో అధికం

బీజేపీ పాలిత రాష్ట్రమైన యూపీలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. 2024లో ఈ రాష్ట్రంలోని యోగి పాలనలో 209 ఘటనలు జరిగాయి. ఆ తర్వాతి స్థానంలో ఛత్తీస్‌గఢ్ (165) ఉన్నది. గతేడాది నుంచి బీజేపీ ఇక్కడ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి చాలా కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు కావటం లేదని పౌర హక్కుల కార్యకర్తలు ఆందోళనను వ్యక్తం చేశారు. మరికొన్ని కేసుల్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటానికే భయపడుతున్నారని చెప్తున్నారు. చాలా సందర్భాల్లో, హింసలో బాధితులైనవారి పైనే ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయనీ, నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



యూసీఎఫ్ జాతీయ కన్వినరల్ ఎ.సి.మైఖేల్



హిందూత్వ శక్తులకు ఆయుధంగా చట్టాలు

తమ విశ్వాసాన్ని పాటిస్తున్నందుకే భారత్‌లో ప్రతి రోజూ ఇద్దరి కంటే ఎక్కువ మంది క్రైస్తవులు దాడులకు గురవుతున్నారని యూసీఎఫ్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. "ఈ ఘటనలు పలు రకాలుగా ఉన్నాయి. చర్చిలు, ప్రార్థనా సమావేశాలపై దాడులు, తమ విశ్వాసాలను పాటించే వారిపై వేధింపులు, బహిష్కరణ, సమాజ వనరులను పరిమితం చేయటం, తప్పుడు ఆరోపణలు, క్రిమినల్ కేసులు. పలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వివాదాస్పద, కఠినమైన మతమార్పిడి నిరోధక చట్టాలు హిందూత్వ శక్తుల, కార్యకర్తల చేతిలో ఆయుధాలుగా మారుతున్నాయి. మైనారిటీ గ్రూపులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయి" అని యూసీఎఫ్ వివరించింది. 2014లో కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌లో క్రైస్తవులతో పాటు ఇతర మైనారిటీ సమూహాలను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు తీవ్రమయ్యాయని పలు వార్త సంస్థల నివేదికలు సైతం ఇప్పటికే వెల్లడించిన విషయం విదితమే.

అణగారిన వర్గాలు టార్గెట్

ఈ దాడుల్లో అణగారిన వర్గాల సమూహాలు టార్గెట్‌గా ఉన్నాయని యూసీఎఫ్ వివరించింది. గతేడాది డిసెంబర్‌లో నమోదైన 73 ఘటనల్లో, 25 కేసుల్లో ఎస్టీలు, 14 కేసుల్లో ఎస్సీలు బాధితులుగా ఉన్నారని పేర్కొన్నది. ఇక తొమ్మిది ఘటనల్లో మహిళలు బాధితులయ్యారని వివరించింది. క్రైస్తవ సమూహంపై పెరుగుతున్న హింసను కట్టడి చేయాలంటూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోడీలను 400 మందికి పైగా సీనియర్ క్రిస్టియన్ లీడర్లు, 30 చర్చి గ్రూపులు గతేడాది డిసెంబర్ 31న కోరిన విషయం విదితమే. దేశంలో క్రైస్తవులపై పెరుగుతున్న దాడుల విషయంలో ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. క్రైస్తవ సమూహం పట్ల ప్రధాని మోడీ వైఖరిని ప్రశ్నించాయి. ఈ విషయంలో మోడీకి కఠినమైన ప్రశ్నలు సంధించాల్సిన అవసరమున్నదని అహ్మదాబాద్‌లో క్రిస్టియన్ సంస్థలు నిర్వహించిన ఒక కార్యక్రమంలో టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ అన్నారు.

రండి..పెట్టుబడులు పెట్టండి

- అంతర్జాతీయ నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ
- అత్యున్నత వ్యాపారసౌలభ్యం అందిస్తాం
- చైనా తరహా క్లస్టర్ల ఏర్పాటు
- స్కిల్ యూనివర్సిటీకి మద్దతునివ్వాలి: సీఐఐ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో



దేశంలోనే వాణిజ్యానికి అత్యంత అనుకూల రాష్ట్రమైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాపారవేత్తలను కోరారు. ప్రపంచంలోనే అత్యున్నత వ్యాపారసౌలభ్యం అందిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో జరిగిన సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ నినాదంతో వచ్చే యాభై ఏండ్లను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని అన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి నగరాలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీని కాలుష్య రహిత నగరంగా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యతనిస్తున్నామనీ, ఆర్టీసీకి త్వరలో 3200 ఈవీ బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. హైదరాబాద్‌కు ప్రకృతి విపత్తుల బెడదలేదనీ, పూర్తిస్థాయి రోడ్,రైల్, విమాన నెట్‌వర్క్‌తో ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధిలో దూసుకుపోతోందని సీఎం తెలిపారు. 360కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ దానిచుట్టూ రీజనల్ రింగ్ రైల్వే లైను ఏర్పాటు చేస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు అనుసంధానంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామన్నారు. ఓఆర్ఆర్, ట్రిబుల్ ఆర్ మధ్య ఫార్మా, లైఫ్‌సైన్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఇవి, సోలార్ పరిశ్రమలు రాబోతున్నాయని వివరించారు. ఔటర్ వెలుపల ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, కోల్డ్ స్టోరేజీ, గిడ్డంగుల పైన దృష్టి పెడతామన్నారు. హైదరాబాద్ సమీపంలో డ్రైపోర్టు అభివృద్ధి చేసి అక్కడ నుంచి బందర్‌లోని పోర్టు వరకు ప్రత్యేక రహదారి, రైల్వేలైను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తాం

మహిళాభివృద్ధి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందనీ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిఐఐకి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా సీఐఐ గ్రీన్‌బిజినెస్ సెంటర్‌లో సీఐఐ ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ముఖ్యులు చంద్రజిత్ బెనర్జీ, సంజీవ్ పురి, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖను బలోపేతం చేయాలి

- ప్రభుత్వానికి గిరిజన సంఘాల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖను ప్రక్షాళన చేసి, దాన్ని మరింత బలోపేతం చేయాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శరత్‌కు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాల్ నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ రామచంద్రనాయక్ వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో 32 ఆదివాసీ గిరిజన తెగల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ చట్టాల అమలు, విధివిధానాల రూపకల్పన, షెడ్యూల్ ప్రాంత హక్కులను కాపాడాలనే ఉద్దేశంతో 1966 నవంబర్ 16న గిరిజన సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ శాఖకు అనుబంధంగా గిరిజన ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్),గిరిజన సహకార సంస్థ (జీసీసీ), గిరిజన సాంస్కృతిక, పరిశోధన, శిక్షణా సంస్థ (టీసీఆర్‌టీఐ), సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), గిరిజన ఇంజనీరింగ్ విభాగం, మైదాన ప్రాంత గిరిజనాభివృద్ధి సంస్థ (పీటీడీఏ), మాడా, క్లస్టర్ గ్రామాలతోపాటు గిరిజన గురుకుల సొసైటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఉన్నత లక్ష్యాల కోసం ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ శాఖ కొన్నేండ్లుగా నిర్వీర్యం అవుతున్నదని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖను గత ప్రభుత్వం నీరుకార్చగా ఈ ప్రభుత్వం సైతం అదే వైఖరిని కొనసాగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామం గిరిజనులు, గిరిజన సంఘాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదనీ, సంస్థలో ఉన్నత అధికారుల మొదలు సాధారణ ఉద్యోగుల వరకు అలసత్వం, అవినీతి పెరిగిపోయాయని వాపోయారు. ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి కేటాయించిన నిధులను విడుదల చేయడంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల సంక్షేమం కోసం ఖర్చు చేసిన వాటికి మేమెందుకు చెల్లించాలనే ఉద్దేశంతోనే బిల్లులను చెల్లించడం లేదనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు.



సాంస్కృతిక జీవన విధానం రూపకల్పన కావాలి

- గతి తప్పుతున్న ప్రజల జీవన విధానం : పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆందోళన కలిగిస్తున్న కుల, మత విద్వేషం, అసహనం
- ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్
- రవీంద్రభారతిలో "విధ్వంస జీవన విధానం- సాంస్కృతిక చైతన్యం"పై సదస్సు

నవతెలంగాణ-కల్చరల్

కళలు, సాహిత్యం మాత్రమే సంస్కృతి కాదనీ, ప్రజల ఆచార వ్యవహారాలు.. జీవన విధానం అన్నీ కలిపి సమగ్రంగా చూడాలని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ఏర్పాటులో పాట, ఆట, సాహిత్యం ప్రాముఖ్యత విస్మరించలేమని చెప్పారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై శుక్రవారం భాషా సాంస్కృతిక శాఖ సాంస్కృతిక సారథి, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీల నిర్వహణలో "విధ్వంస జీవన విధానం-సాంస్కృతిక చైతన్యం" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తరువాత సాంస్కృతిక జీవన విధానం రూపకల్పన జరగాలనే లక్ష్యంతో కవులు, కళాకారులు, రచయితలతో సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేడు తెలంగాణ సమాజం ముందు పలు సంక్షోభాలు, సవాళ్లు ఉన్నాయని తెలిపారు. యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు, మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవన విధానం గతి తప్పడం వల్ల నేటి సమాజంలో అనేక రుగ్మతలు, పెడధోరణులు, నిత్యం ఎన్నో అకృత్యాలు, సంఘటనలు చోటుచుకుంటున్నాయని చెప్పారు. ఆహారపు అలవాట్లు మారి అనారోగ్యం బారిన పడుతున్నారని, విద్యా వైద్యం, ఆడంబరాలకు పోయి స్థాయికి మించి ఖర్చులు చేస్తూ అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ప్రజల్లో సామాజిక చైతన్యం తెచ్చేందుకు కవులు, కళాకారులు, రచయితలు సంఘటిత శక్తిగా తెలంగాణ సమాజ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ప్రభుత్వానికి తోడ్పడాలని కోరారు. ఇందుకు ప్రభుత్వ సాంస్కృతిక సారథులు ప్రతి గ్రామంలో తమ ప్రదర్శనలతో సామాజిక చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు తగు సూచనలు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో తెలంగాణ సమాజం విచ్ఛిన్నం కాకుండా మానవీయ విలువలుగల సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. సంగీత నాటక అకాడమీ చైర్మెన్ డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ.. ప్రజలను జాగృతం చేసేందుకు దేవాలయాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి భిన్నమైనదని చెప్పారు. సమాజ పునర్నిర్మాణం కళా సారథుల బాధ్యత అని అన్నారు.

ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుల, మత విద్వేషం, అసహనం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కవి సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. కళాకారులు 365 రోజులూ ప్రజల్లో తమ ప్రదర్శనలతో భాగస్వాములు కావాలని, ఇందుకు ప్రభుత్వం తగిన వనరులు అందించాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలని, లేకుంటే సమాజ విధ్వంసం జరుగుతుందని చెప్పారు. జానపద కళాకారులు జయరాజ్ మాస్టర్ జీ, నాట్య గురువు డాక్టర్ పద్మజారెడ్డి, చిత్రకారుడు యక్క యాదగిరి, కళాకృష్ణ రాఘవరాజ్ భట తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కళా సారథులుగా తమని ప్రభుత్వం గుర్తించాలని కొందరు కళాకారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. తప్పకుండా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

కేటీఆర్ మాటలు రాజకీయాలకే తలవంపు

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ మాటలు రాజకీయాలకే తలవంపుగా మారాయని ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా? అని దేశం చర్చించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఫార్ములా ఈ రేస్, డ్రగ్ కేసు, జన్వాడ ఫామ్ హౌస్, ఫోన్ ట్యాపింగ్, ధరణి, ఓఆర్ఆర్ అమ్ముకోవడం లుచ్చా పనా? మెస్‌చార్జీలు పెంచడం, రైతు రుణమాఫీ చేయడం ఏదీ లుచ్చా పనో చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు కాకుండా వచ్చారని కేటీఆర్‌కు మంగళ హారతులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశ సేవ చేశారా? దేవుని సేవ చేశావా? అని ప్రశ్నించారు. అధికార రాజసం లేదనీ, అవినీతి సంపాదన దూరమైందంటూ కేటీఆర్‌లో నైరాశ్యం కనిపిస్తున్నదని చెప్పారు. సీఎం ఒక్క సైగ చేస్తే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బండి సంజయ్ ఓ మెంటల్ కృష్ణ...బీజేపీ మాదిరిగా కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడబోదని స్పష్టం చేశారు.

అధికారికంగా కొమురం భీం జయంతి.. వర్ధంతి



- ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- గోండీ భాషలో బోధనపై సమగ్ర నివేదికకు ఆదేశం
- సాగుకు ఉచితంగా సోలార్ పంపు సెట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి, వర్ధంతిని అధికారికంగా (స్టేట్ ఫంక్షన్‌గా) నిర్వహిస్తామని సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ప్రాంతాల్లో రవాణా, సాగు, తాగునీటి సరఫరా, తమపై నమోదైన, నమోదవుతున్న కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. ప్రతి సమస్యను సావధానంగా విన్న సీఎం రేవంత్ రెడ్డి వారు లేవనెత్తిన పలు సమస్యలకు వెంటనే స్పందించారు. మరి కొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇది తొలి సమావేశం మాత్రమేననీ, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు సీఎం తెలిపారు. ఏడాదికి మూడు సార్లు జరిగే సమావేశాల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రాబోయే కాలంలో పరిష్కరించుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామని వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభయమిచ్చారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు దిగొద్దని సీఎం సూచించారు. ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదైతే భవిష్యత్తులో అవి వారి ఉద్యోగ అవకాశాలకు గండిపెడతాయని సీఎం తెలిపారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామనీ, ఈ విషయంలో అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాను పీసీసీ అధ్యక్షునిగా అయిన తర్వాత తొలి సమావేశం ఇంద్రవెల్లిలోనే పెట్టానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాటి సమావేశంలో తన దృష్టికి వచ్చిన ఇంద్రవెల్లి అమరుల స్మృతివనం ఏర్పాటు, అమరుల కుటుంబాలకు ఇండ్ల మంజూరు వంటి వాటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేశామని సీఎం తెలిపారు. రాజకీయాలపరంగా ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూస్తున్నామనీ, సీతక్కను ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా పెట్టామని ముఖ్యమంత్రి అన్నారు.

కేస్లాపూర్ జాతరకు నిధులు

కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీలకు ఎంతో కీలకమైన రాయి సెంటర్లకు భవనాల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

రాయి సెంటర్ల నిర్మాణం, అందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఎన్ని భవనాలు అవసరమనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆయా భవనాలు ఎలా ఉండాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ నుంచి నమూనాలు తయారు చేయించాలని మంత్రి సీతక్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిపై దృష్టి

ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేల కోటా కింద ఇచ్చే ఇండ్లతో సంబంధం లేకుండా ఆదివాసులకు సీఎం కోటా కింద ప్రత్యేకంగా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఈ ఇండ్లు ఇచ్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. నాన్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ఇండ్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆదివాసీ రైతులకు ఉచితంగా సోలార్ మోటార్లు (వంద శాతం రాయితీ) అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిర జలప్రభ కింద ఉచితంగా బోర్లు వేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం అధికారులకు సూచించారు. ఉచితంగా సోలార్ పంపుసెట్లతో పాటు ఇండ్లకు సోలార్ ద్వారా విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తామని సీఎం చెప్పారు. ఆదివాసీ గూడేల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలనీ, ఇందు కోసం ఐటీడీఏల పరిధిలో వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక స్టడీ సర్కిల్

ఆదివాసీ విద్యార్థుల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టడీ సర్కిల్‌కు అవసరమైన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థులందరికీ ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ దరఖాస్తుల వివరాలను వెంటనే మంత్రి సీతక్కకు అందజేయాలని సీఎం ఆదివాసీ నాయకులకు సూచించారు. విద్యార్థులకు గోండీ భాషలో ప్రాథమిక విద్యను బోధించడానికి అవసరమైన ప్రణాళికపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉట్నూరు, భద్రాచలంలోని ట్రైబల్ బీఈడీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆదేశించారు. ఆదివాసీ విద్యార్థులకు స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామనీ, వారికి వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. ఏజెన్సీలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామనీ, వాటిలో ఆదివాసీ విద్యార్థులు చేరేలా ఆదివాసీ పెద్దలు, విద్యావంతులు ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-మీర్‌పేట్

ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో మాట్లాడి, పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరుతూ మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో కలసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా నాయకులు కవిత మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.18000 వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఈ నెల 20వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో బాలాపూర్ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్, భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మెగాసిటీ హైస్కూల్‌లో సంక్రాంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హయత్‌నగర్‌లోని మెగాసిటీ హైస్కూల్లో సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్టు స్కూల్ చైర్మెన్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ స్వాతి, స్కూల్ ప్రిన్సిపాల్ సంకోజు వాసు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరూ అందమైన ముగ్గులు, గాలిపటాలను ఎగరవేశారని తెలిపారు. పండుగలు అనేవి మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మలని, వీటిని ముందు తరాలకు అందించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు
ఆశించినట్టుగా అందని 'సీఎంఆర్ఎఫ్'



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో చెక్కులను చెల్లించడం లేదన్నారు. నిరుపేదలు సీఎం సహాయ నిధి కోసం చాలా ఇబ్బంది



నవతెలంగాణ- బడంగ్ పేట్

గత ప్రభుత్వం సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో పేదలను ఆదుకోవడం కోసం ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఆశించినట్టుగా అందించడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బడంగ్‌పేట్, మున్సిపల్ కార్పొరేషన్ జల్‌పల్లి మున్సిపాలిటీలలో నివాసముండే అర్హులైన వారికి పడుతున్నారని, ఇప్పటికైన ప్రభుత్వం మార్పు తీసుకొచ్చి వారికి సరైన పద్ధతిలో చెక్కులు అందజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ముత్యాల లలిత కృష్ణ, రోహిణి రమేష్ ముదిరాజ్, బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, జల్ పల్లి మున్సిపల్ కౌన్సిలర్ పల్లపు శంకర్, షేక్ పమీద అఫ్జల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు ఎల్బల మమత సుదర్శన్ రెడ్డి, మంజుల కుమార్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు కె.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారులు రాణించాలి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారులు రాణించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో యూనిక్స్ సన్ రైస్ ఆల్ ఇండియా జూనియర్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ను అండర్-19 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో బాయ్స్ అండర్ 19 విన్నర్ రౌనక్ చౌహాన్, రన్నర్ ప్రణవ్ రామ్, గర్ల్స్ అండర్ 19 విన్నర్ ఆదర్శిని శ్రీ మరియు రన్నర్ రుగ్గుల రాము, బాయ్స్ డబుల్స్ అండర్ 19 విన్నర్ భవ్య చబ్ర అండ్ ప్రణవ్ చౌదరి, రన్నర్ రాహుల్ మురళి అండ్ మితి య స్, గర్ల్స్ డబుల్స్ అండర్ 19 విన్నర్ వెన్నల (తెలంగాణ) అండ్ శేయన్షి (తెలంగాణ) తరని అండ్ రిషిక విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్రీడల పోటీలో 1300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బాబు, అసోసియేషన్ సభ్యులు, శ్యామ్, సూరి, వంశీ, కరుకర్ రెడ్డి, కుమార్, స్పాన్సర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో రెండు చోట్ల గంజాయి పట్టివేత

- 9 మంది అరెస్ట్
- ఇద్దరు పరారీలో
- 6 కేజీల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-హయత్‌నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్, మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్, మీర్‌పేట పోలీసులు సంయుక్తంగా కలిసి గంజాయి స్మగ్లింగ్ నిందితులను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న నాయని శ్యామ్. మహబూబాబాద్‌కు చెందిన కందుకూరి చందు అలియాస్ ప్రేం చంద్. వీరిద్దరూ పాత నేరస్తులు..హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నాయి. అరుట్ల గ్రామం, మంచాల మండలానికి చెందిన బురా రాజేష్ కుమార్ అలియాస్ రాము. బాలాపూర్ మండలానికి చెందిన ఛిద్రం ఉదయ్ కిరణ్. వీరంతా పెడ్లర్, కన్స్యూమర్‌గా వ్యవహరించారు. అరుట్ల గ్రామానికి చెందిన దాసరమోని రాఘవేందర్. అరుట్లకు చెందిన జోగు వరుణ్ కుమార్. గుడిమల్ల మహేష్. హయత్ నగర్‌కు చెందిన మర్రి అఖిల్ రాజ్. వారంతా కన్సుమర్‌గా వ్యవహరించారు. ఒడిశాకు చెందిన అర్జున్. ఇతను సప్లేయర్, కన్సుమర్‌గా ఉన్న ప్రధాన నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. 4.5కేజీల గంజాయి. 3 ద్విచక్ర వాహనాలు, 6సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని శుక్రవారం వారిని రిమాండ్ తరలించినట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు.

మీర్‌పేటలో దొరికిన గంజాయి..

గుర్రంగూడకు చెందిన బుర్సు నరేందర్, శ్రీనివాస్, పెడ్లర్. ఒడిశాకు చెందిన శివదాస్ వారి వద్ద నుండి 1.5కేజీల గంజాయి. ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేస్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మీర్ పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

'శ్రీ చైతన్య'లో సంక్రాంతి సంబరాలు





నవతెలంగాణ - చంపాపేట్

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మాన్ ఘాట్ శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం అత్యంత వైభవంగా సంక్రాంతి సంబురాలను నిర్వహించినట్టు ఏజీఎం సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పద్ధతులపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలన్నారు. ఉజ్వల భవిష్యత్ విద్యతోనే సాధ్యమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఫణి మాధవి, వైస్ ప్రిన్సిపల్ సుందర్ సింగ్, ప్రైమరి ఇంచార్జి లక్ష్మి, ప్రీ ప్రైమరి ఇంచార్జి పద్మావతి, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ

నవతెలంగాణ - మీర్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వికలాంగులకు త్రిచక్ర వాహనాలను మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి : సీఐటీయూ



నవతెలంగాణ - చంపాపేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ పరిధిలోని ఈ ప్రాంతంలో యూనియన్‌లలో కలిసి సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ గ్రేటర్ పరిధిలో సుమారు 20వేల మంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం లాగానే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు రోజు రోజుకూ తీవ్రంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కిషన్, కె. జంగయ్య, ఎం.బాలు నాయక్, రాజ్ కుమార్, ప్రసాద్, లాలమ్మ, కిష్టమ్మ, లక్షయ్య, లక్ష్మమ్మ, హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎం శ్రవణ్ కుమార్, పాలడుగు భాస్కర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. శ్రావణ్, అధ్యక్షులు ఎం. మీనా తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



నవతెలంగాణ-హయత్ నగర్

గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న కాళ్ళ సౌజన్య(30). ఈమె స్వస్థలం శ్రీకాకుళం జిల్లా. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మానసిక స్థితి సరిగా లేనందున శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైకుంఠ ఏకాదశిలో దేప సురేఖ భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణపురం డివిజన్‌లోని అష్టలక్ష్మి దేవాలయం మరియు సౌభాగ్యపురం కాల లోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పురం కంటెస్టెంట్ కార్పొరేటర్ పున్న నిర్మల గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, పిట్ట సుమతి హరినాథ్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి పుష్పలత మధుసూదన్ రావు, ఆలయ కమిటీ చైర్మెన్ సుధాకర్ గుప్తా, సౌభాగ్యపురం కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, సెక్రటరీ నరసింహారెడ్డి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

గడ్డి అన్నారం క్షేత్రంలో వైకుంఠ సేవలు...



వైకుంఠ ఏకాదశి సందర్భంగా గడ్డి అన్నారం క్షేత్రం శ్రీ వీరవేంకట సత్య నారాయణ స్వామి దేవస్థానంలో ఉత్తరద్వార దర్శన ఏర్పట్లు చేశారు. తర్వాత స్వామివారికి ప్రారంభ పూజా కార్యక్రమాలను చైర్మెన్ పూర నరసింహ గుప్త చేతుల మీదుగా



నిర్వహించారు. మాజీ చైర్మెన్ బచ్చు సత్యనారాయణ, వక్కలంక శ్రీనివాస్ రావులు స్వామి వారికి అర్చన, తిరుప్పావై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, మార్గం రమేష్, కుమారస్వామి, సత్యనారాయణ, నాగేందర్, వీరేషం, చకిలం రమణయ్య లింగారెడ్డి, పాల్గొన్నారు.

'కాంటినెంటల్'లో
ట్రాన్స్ ఓరల్ రోబోటిక్ సర్జరీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ హాస్పిటల్స్ ఒక అరుదైన ఘనత సాధించింది. దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా విజయవంతంగా ట్రాన్స్ ఓరల్ రోబోటిక్ సర్జరీ (ఎస్ఎస్ఐ మంత్ర) చేసింది. ఎస్ఎస్ఐ మంత్ర రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగించి, ఓరోఫారింజియల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 62 ఏండ్ల వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స చేసింది. ఈ సర్జరీని ఒక సెంటీమీటర్ మార్జిన్‌తో విజయవంతం చేశారు. డాక్టర్ క్రాంతికుమార్ నేతృత్వంలోని కాంటినెంటల్ హాస్పిటల్స్ హెడ్ అండ్ నెక్ డాక్టర్స్ టీమ్. గతంలో ఈ పేషెంట్ అసదుల్లా.. ఇదే వ్యాధికి ఇతర హాస్పిటల్స్‌లో కీమోథెరపీ, రేడియేషన్ చేయించుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మూడు నెలల తర్వాత తను మళ్ళీ క్యాన్సర్ బారిన పడ్డాడు. కాంటినెంటల్ హాస్పిటల్స్ వైద్యుల సాయంతో, ట్రాన్స్ ఓరల్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఇప్పుడతను పూర్తిగా క్యాన్సర్ నుంచి విముక్తుడయ్యాడు. కాంటినెంటల్ హాస్పిటల్స్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్యరంగంలో వస్తున్న సరికొత్త శాస్త్ర సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ.. పేషెంట్లకు సురక్షితమైన శస్త్రచికిత్సలను అందించడంలో, కాంటినెంటల్ హాస్పిటల్స్ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇదేగాక గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ, గైనకాలజీ, సర్జికల్ అంకాలజీ విభాగాల్లో 150కి పైగా రోబోటిక్ శస్త్రచికిత్సల్ని తమ హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తమ హాస్పిటల్ అత్యాధునిక శస్త్రచికిత్సలకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. కాంటినెంటల్ క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ అధునాతన వైద్య పరికరాలు, సరికొత్త శాస్త్రసాంకేతికత, అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో ఇక్కడ అందించే అత్యున్నత వైద్య సేవలు పేషెంట్లకు వరం అన్నారు.

'పాఠశాలకు' క్రీడా పరికరాలు అందజేత



నవతెలంగాణ-మలక్‌పేట్

సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లకు భాగ్యనగర్ వైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మూడు బీరువాలు, రెండు వాలీబాల్ పోల్స్ మరియు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో దాదాపు 1000 మంది పేద విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఈ పాఠశాలకు ఏదో ఒక సహాయం చేయాలని ప్రేరేపించిందని, పాఠశాలలోని వసతులను గమనించి వారికి అవసరమైన కొన్నింటిని అసోసియేషన్ తరపున ఇవ్వాలని కమిటీ తీర్మానించిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అవసరమైన విలువైన సామాగ్రిని పెద్ద మనసుతో అందించటానికి ముందుకొచ్చిన భాగ్యనగర్ వైశ్య యూత్ అసోసియేషన్ వారికి పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రతిక్ పర్ని, కోశాధికారి అరవింద్, ప్రాజెక్ట్ చైర్మన్ మణిదీప్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామచందర్, కార్యవర్గ సభ్యులు హరి, చందు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని కోటగడ్డ నుండి అంబేద్కర్ నగర్, రఘుహోమ్స్ కాలనీ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారిందని, ఆ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డికి, కమిషనర్ పి.సరస్వతికి మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వల్లపు సుబాన్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారిపై ప్రతి నిత్యం వివిధ వాహనాల రాకపోకలతో ఎంతో రద్దీగా ఉంటుందని, అంతేకాకుండా ఆర్టీసీ, పాఠశాలల బస్సులతో పాటు అనేక ఇతర వాహనాలు రాకపోకలు సాగుతున్నట్లు తెలిపారు. ఆ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందన్నారు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగారి అశోక్, నర్సింగ్, వెంకటేష్, అజయ్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకత ఎంతో అవసరం

ఉన్నత విద్యామండలి చైర్మెన్, ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి





నవాతెలంగాణ-తుర్కయంజాల్

విద్యార్థులకు సృజనాత్మకత ఎంతో అవసరమని ఉన్నత విద్యామండలి చైర్మెన్, పొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్‌లో అనతి కాలంలోనే ఉత్తమ పాఠశాలగా ఎదగడం సంతోష దాయకమన్నారు. భారతదేశం సాంకేతిక రంగంలో ముందుకు దూసుకెళ్తుందని పేర్కొన్నారు. యువత భారత దేశానికి పెద్ద ఆస్తి అని, యువత ఆర్థికంగా నిలదొక్కుకున్నపుడే దేశం ఆర్థికంగా ముందుంటుందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఎదురుచూస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సృజనాత్మకత అవసరమని సూచించారు. సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అలాగే పలు క్రీడల్లో ఇంటర్నేషనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ సుధీర్, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, పరీక్షిత్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రిన్సిపల్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని అన్నమయ్య కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.35 లక్షలతో చేపట్టుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పంగ హరిబాబు, సూర్వి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక నగర్ డివిజన్‌కు చెందన కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా నిరుపేద మైనార్టీ కుటుంబానికి పెండ్లి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వినాయక నగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, అనుచరులు మధ్య కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిట్టల నాగరాజు మాట్లాడుతూ పేదలకు నిత్యం అండగా ఉండే మైనంపల్లి హనుమంతరావు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిష్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ గ్రూప్ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో మాజీ సైనికులకు ప్రాధాన్యత

- మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి





నవతెలంగాణ - చర్లపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ సైనికులకు ప్రాముఖ్యత పెరుగుతుందని మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడిగా గెలుపొందిన మాజీ సైనికుడు గిరి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్‌లతో పాటు తదితరులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబును మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయంలో మాజీ సైనికులకు ప్రాధాన్యత ఇచ్చే వారు కాదని, నేడు సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా మాజీ సైనికుడు గెలవడం హర్షించదగ్గ విషయమన్నారు. మాజీ సైనికుడు అధ్యక్షుడిగా గెలవడం, మాజీ సైనికులకు పార్టీ బాధ్యతలో భాగస్వాములు చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ సైనికులకు పెరుగుతున్న ప్రాముఖ్యతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నవీన్, అయేషా, తబూస్సం, అదనపు కార్యదర్శి భూక్యా, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, నీరజ, వంశీధర్, యామిని, రాజేశ్వర్, కోశాధికారి కైలాసం లు పాల్గొన్నారు.

నెలకు వెయ్యి ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- నిరుద్యోగరహిత మల్కాజిగిరి పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నెలకు వెయ్యి ఉద్యోగాల కల్పనే లక్ష్యమనీ, మల్కాజిగిరిని నిరుద్యోగ రహిత పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని తన నివాసంలో నిరుద్యోగ రహిత మల్కాజిగిరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ చదువుకుంటున్నారు కానీ అందరికీ ఉద్యోగావకాశాలు రావడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.4 లక్షల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. యువతకు పని కల్పించి దేశ నిర్మాణంలో భాగస్వామ్యులను చేయాలని సంకల్పించినట్టు చెప్పారు. తాను మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ స్థానాలతోపాటు హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో ఇంటింటికి సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎవరెవరు నిరుద్యోగులున్నారు..? వారికి ఎలాంటి ఉద్యోగాలు కావాలి..? అనే నివేదిక రూపొందిస్తానని తెలిపారు. ప్రతి నెలా వెయ్యికి తగ్గకుండా ఉద్యోగాలు కలిపించడమే ఈ సంస్థ లక్ష్యం అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక కంపెనీలున్నాయనీ, వాటిల్లో ఉద్యోగాలు కల్పించడమే తమ ఎజెండా అని తెలిపారు. నిరుద్యోగ రహిత పార్లమెంట్ నియోజకవర్గంగా తయారు చేయడమే తమ లక్ష్యం అనీ, దీన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని చెపారు. ఇక్కడే కాదు, విదేశాల్లో కూడా నర్సులు, ఇతర టెక్నికల్ ఉద్యోగాలు కల్పించే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాగా ఉద్యోగాల కల్పనకు నిపుణ ఎన్జీఓ సమన్వయంతో ఎంప్లాయిమెంట్ సెల్‌ను ప్రారంభించారు. (ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, హుజూరాబాద్, గజ్వేల్) 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరుద్యోగ సర్వే మొదలు పెట్టారు.

శానిటేషన్ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మైనంపల్లికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు బాబు, సత్యమూర్తి, బ్రహ్మయ్య, రాము, సోమయ్య వెంకు, రామకృష్ణ, రవి, మధు, వాజిద్, హరికిషన్, మజీద్, రత్న భూషణ్ రావు, ఎస్ఎఫ్ఏ రాములు, సానిటరీ సూపర్వైజర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ సర్వీస్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

హౌసింగ్ బోర్డ్ డివిజన్‌లోని చైతన్య నగర్ డబుల్ బెడ్ రూమ్ అపార్టుమెంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ సర్వీస్‌ను ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డితో ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, అపార్టుమెంట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

- జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ అధికారి పద్మజ
- నాచారం, చర్లపల్లి చెరువుల పరిసరాల శుభ్రత పరిశీలన



నవతెలంగాణ - చర్లపల్లి

చెరువుల పరిసరాల శుభ్రత, నీటి వనరుల శుభ్రత మనందరి బాధ్యత అని జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ అధికారి పద్మజ అన్నారు. శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ ఆదేశాల మేరకు నీటి వనరుల ప్రాంతాలను శుభ్రం చేయడంలో భాగంగా చర్లపల్లి, ఎర్రకుంట, నాచారం, హెచ్‌ఎంటి నగర్, కాప్రా, నాచారం చెరువుల ప్రాంతాలను శానిటేషన్ విభాగం, ఎంటమాలజీ విభాగం సిబ్బంది వారి, వారి విభాగాలకు సంబంధించి న పనులను చేసి, చెరువుల పరిసరాలను శుభ్రం చేశారు. ఆ పనులను పర్యవేక్షించడానికి జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ అధికారి పద్మజ, కాప్రా సర్కిల్ మెడికల్ అధికారి మధుసూదన్ రావు, నాచారం ఎర్రకుంట చెరువు, హెచ్.ఎం.టి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుల పరిసరాల శుభ్రత, నీటి వనరుల శుభ్రత మనందరి బాధ్యత అన్నారు. భూగర్భ జలాలు, పర్యావరణం, నీటి కలుషితం కాకుండా నీటిలో నివసించే చేపలు జలచరాలను కాపాడినవారవుతామన్నారు. చెరువుల శుభ్రత మరింత పెంచాలని స్థానిక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్, డాక్టర్ రజనీకాంత్, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ శ్రీనివాస్ ఎస్.ఎఫ్.ఏ వసంత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం



- పోలీస్ అకాడమీ మాజీ డైరెక్టర్ అరుణ బహుగుణ

నవతెలంగాణ - చర్లపల్లి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పోలీస్ అకాడమీ మాజీ డైరెక్టర్ అరుణ బహుగుణ సూచించారు. శుక్రవారం నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన స్పోర్ట్స్ ఫియస్టా ఒలంపిక్ టోర్ని వార్షిక స్పోర్ట్స్ డే విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి అరుణ బహుగుణ, వ్యాపారవేత్త రాంమోహన్, అర్జున అవార్డు గ్రహీత జీవంజీ దీప్తి, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువులంటే పుస్తకాలతో కుస్తీ పట్టడం కాదని, బాలల సంపూర్ణ ఎదుగుదలకు ఆటలు ఎంతో అవసరం అన్నారు. ఆటలతో చురుకుదనం, ఏకాగ్రత పెంపొందుతా యన్నారు. ఆటలతో పిల్లల్లో శరీరక దారుఢ్యంతో పాటు, మానసిక ధృఢత్వం కలిగి ఉంటారన్నారు. డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ముగిసిన స్పోర్ట్స్ ఫియస్టా ఒలంపిక్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు క్రీడాలు, అథ్లెటిక్ ఈవెంట్లు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంస పత్రాలను వారు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నవనీత రావు, మేనే జింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమారెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులతల్లిదండ్రులు, ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్, రోడ్డులో స్వచ్ఛ ఆటో డ్రైవర్ చెక్క శ్రీను సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను కార్పొరేటర్ ప్రభుదాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రధాన రోడ్డులో కొన్నేండ్లుగా చెత్త కుప్పలు పడుతుండడంతో స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీను సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రధాన రహదారుల పక్కన ఎవరూ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. ప్రజలు అందరూ ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలకే వేయాలని కోరారు. అనంతరం సొంత ఖర్చులతో సీసీ కెమెరా, మైక్‌ను ఏర్పాటు చేసిన శ్రీనును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ శానిటేషన్ సుపర్వైజర్ సుదర్శన్, జవాన్ యాదగిరి, సాయి, గోవర్ధన్‌రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి జన్మదిన వేడుకలు



- పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌బాబు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆనంద్ బాగ్ ఆర్‌కే నగర్‌లోని సినీపోలీస్ వద్ద కాంగ్రెస్ నాయకులు జీఎన్‌వి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య తిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు పాల్గొని కేక్ కటింగ్ చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ..కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మధ్య ఓ పండగ వాతావరణంలో మైనంపల్లి హనుమంతరావు జన్మ దినోత్సవ వేడుకలు జరుపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, కన్నా, రాందాస్ సంతోష్ ముదిరాజ్, శోభన్ ముదిరాజ్, యాదగిరి, శ్రీధర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్ జీత్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, పంజా శ్రీనివాస్, సత్యమూర్తి, బ్రహ్మయ్య, సత్యనారాయణ, రామ్ చందర్, నాగరాజు, నాగరాజు, ఆగమయ్య బాలరాజు యాదవ్, పీవీ సత్యనారాయణ, బాలరాజ్, ఆగమయ్యా, దేవేందర్, పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

- పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి

నవతెలంగాణ - పోచారం



పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్జీపీసీ చౌరస్తా నుంచి మోడీ రోడ్డు వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాధారణ నిధులు రూ.30 లక్షలు, స్పెషల్ డెవలమెంట్ ఫండ్ రూ.30 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు అతి త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ చైతన్య సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయంలో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ ఆర్టీఓ కార్యాలయంలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాశ్, అసోసియేట్ అధ్యక్షులు శమ్యూల్ పాల్ కార్యదర్శి భారత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వం పొందడం వల్ల వచ్చే ప్రయోజనాలపై చర్చించారు. ఉద్యోగుల హక్కులు సాధించుకోవచ్చన్నారు.





వికలాంగులకు ఇస్తున్న పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని ఫిబ్రవరి 10న ఢిల్లీలో చేపట్టే ధర్నాకు సంబంధించిన చలో ఢిల్లీ పోస్టర్‌ను మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకట్ సమక్షంలో కమలానగర్ భాస్కర్ రావు భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, జిల్లా కమిటీ సభ్యులు షైన్ బేగం, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు. -నవతెలంగాణ,కాప్రా

ఉప్పల్ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయండి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే బండారి

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, శాంతి సాయి జెన్ శేఖర్, ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ సాయి జెన్ శేఖర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐల ఆధ్వర్యంలో బస్సుల తనిఖీ



నవతెలంగాణ-ఉప్పల్

సంక్రాతి పండుగ సందర్భంగా ఉప్పల్‌లో పలు బస్సులను ఉప్పల్ ఎంవీఐలు ఉమా, ఏఎంవీఐ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. బస్సులలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా.. లేవా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, డ్రైవర్స్ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. బస్సులను పండుగ రద్దీ దృష్ట్యా వేగంగా నడపొద్దన్నారు.

బస్తీ క్లినిక్‌లకు మందులు సరఫరా చేయాలి

- రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజాగారి ఆంజనేయులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ దవఖానాల్లో రోగులకు సరైన మందులు కల్పించాలని రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజాగారి ఆంజనే యులు అన్నారు. ప్రజలు మందులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడు తూ..దవాఖానాల్లో మందుల కొరత సమస్యను పరిష్కరించాలని ఈనెల 6వ తేదీన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్పందించిన డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథ స్వామి ఆరోతేది సాయంత్రం లోపు మందులను రోగులకు అందు బాటులో ఉంచుతామని హామీ ఇచ్చినా నేటికీ మందులు దవాఖానాల్లో లేవని మండి పడ్డారు. తక్షణమే డీఎంహెచ్‌వో స్పందించి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ క్లినిక్‌లకు మందులు సరఫరా చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి



- చీర్యాల లక్ష్మి నృసింహ్మా స్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మెట్టల్ దంపతులు



నవతెలంగాణ-కీసర

వైకుంఠ ఏకాదశి సందర్భంగా చీర్యాల లక్ష్మీ నృసింహ్మా స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు సప్త ద్వారాల నుండి స్వామి వారిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మెట్టల్ దంపతులు ఆలయానికి విచ్చేయడంతో ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి పుష్పార్చన అనంతరం కల్యాణ మండపంలో స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి చిత్రపటంతో ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో కీసర మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిరా, ఆలయ ధర్మకర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో పట్టపగలే వీధి దీపాల వెలుగులు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ ప్రధాన రహదారిపై ఉన్న ఈసేవ సర్కిల్ వద్ద మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వీధి దీపాల వెలుగుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల మధ్యాహ్నం సమయంలో అనవసరంగా విద్యుత్ వృథా అవుతోందని, విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను విద్యుత్ అధికారులను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ముల్లి పావని జంగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ జన్మదిన సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిళ్ల ముత్యాల్ యాదవ్, మండల అధ్యక్షుడు కర్రి రాజేష్ కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి, మహిపాల్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి, చౌదరిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ ఆంజనేయులు, తదితరులు చైర్ ర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్‌ను శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలి

● ఆర్టీసీ బస్సు డ్రైవర్ల అవగాహన సదస్సులో ఆర్టీవో పురుషోత్తం రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలనీ, ఇతరులనూ జాగృతం చేసి నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశముందని ఖైరతాబాద్ ఆర్టీవో పురుషోత్తం రెడ్డి తెలిపారు. జాతీయ రోడ్ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం బర్కత్‌పూర ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నడపకూడదని ఆయన తెలిపారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలావరకు ప్రమాదాలను నియంత్రించుకునే అవకాశం ఉందన్నారు. అధిక వేగముతో వాహనం నడపవద్దని,



యూటర్న్ దగ్గర, బ్లైండ్ కర్వ్ దగ్గర జాగ్రత్తగా, నెమ్మదిగా వెళ్లాలని ఆర్టీవో పురుషోత్తం రెడ్డి సూచించారు. ప్రయాణికులు, వాహనదారుల పట్ల మర్యాదగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మంజుల, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ధర్నా



● ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తాం
● సీఐటీయు మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ-బాలానగర్

ఆశా వర్కర్ల జీతాల పెంపుపై స్థానిక కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఇంటి ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత కొన్నేండ్లుగా రాష్ట్రంలో పేద ప్రజలకు, గర్భిణీ స్త్రీలను కంటికి రెప్పలా చూసుకుంటూ సేవలందిస్తున్న ఆశాలకు కనీస వేతనాలు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనంగా ఇవ్వాలన్నారు. రానున్న ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీలో సమావేశాల్లో ఆశాల సమస్యపై స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శాసనసభలో ఆశా వర్కర్ల పక్షాన గళం విప్పి తమ వాణిని వినిపించాన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని లేని పక్షంలో ఆశాలను, కార్మికలను ఏకం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని రాజశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా లీడర్లు అనిత, సబియా ఆశాలు వినోద, పుష్ప, భాగ్యలక్ష్మి, ఎం. లలిత, పద్మమ్మ, రేణుక, మంజుల, కవిత, రాజేశ్వరి, స్రవంతి, శ్వేత, అనూష తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

● అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడండి
● తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి విజ్ఞప్తి
● ఉప్పల్ ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డికి వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

తమ సమస్యలు పరిష్కరించాలనీ, అసెంబ్లీ సమావేశాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించేలా చూడాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేవతి కల్యాణి మాట్లాడుతూ ఈ వినతి పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయాలని కోరారు. ఆశాల సమస్యలపైన రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ప్రకటనతో పాటు ఇతర సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలనీ, సమస్యలు పరిష్కరించాలని 2023లో రాష్ట్ర వ్యాప్తంగా 19 రోజులు నిరవధిక సమ్మె చేయడంతో అదే ఏడాది అక్టోబర్‌లో అప్పటి డీహెచ్ తమ యూనియన్‌తో చర్చలు జరిపి.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామనీ, ఈ కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో తాము సమ్మెను విరమించినట్టు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామనీ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందని తెలిపారు. గతేడాది జులై, డిసెంబర్‌లో వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామనీ, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామనీ, టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలిచ్చారనీ, ఇతర సమస్యల పైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. ఇచ్చిన హామీల్లో ప్రింటెడ్ రిజిష్టర్స్ ఇచ్చారనీ, స్ఫూటం డబ్బాలు మోయటం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇతర సమస్యలు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదన్నారు. ఈ విషయమై గడిచిన ఏడాది కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులను కలిసి అనేక విజ్ఞప్తులు చేశామని తెలిపారు. నిరంతరం ఆందోళన-పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆశాలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మేడ్చల్-మల్కారి జిల్లా కోశాధికారి ఉన్ని కష్ణన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ, దేవిక, లలిత, శ్వేత. జుబేద, జ్యోతి, శిరీష్, లత, మమత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



● కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీలో ప్రజా సమస్యలపై కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా పార్క్ వద్ద మంచి నీటి సరఫరా సమస్య గురించి అపార్ట్మెంట్ వాసులు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ లైన్ మెన్ ను పిలిచి సరఫరా సమయంలో వచ్చే సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. సమత నగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మంచి నీటి సరఫరా ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సంతులిత, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వాటర్ లైన్ మెన్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన శుభసందర్భంగా.. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉరుసు అన్నదాన కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్..

అజ్మీర్ ఉన్న ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు సందర్భంగా.. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గాలో రషీద్ ఆధ్వర్యంలో.. అన్నదాన కార్యక్రమానికి నిర్వహింహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈద్గా సెక్రటరీ షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అల్లా బాక్షు, షకీల్ మున్నా, నవాజ్, రసూల్ మైనారిటీ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మన్భూమ్, పరికి చెరువును కాపాడండీ..

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మండల జగద్గిరిగుట్ట, గాజుల రామారం డివిజన్‌లో విస్తరించి ఉన్న పరికిచెరువును కాపాడాలని సీపీఐ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం పరికి చెరువు 45 ఎకరాలుగా ఉందని.. కాని నేడు కనీసం 15 ఎకరాలు కూడా లేదన్నారు. ఇప్పటికైనా హైడ్రా స్పందించి పరికి చెరువును పుడ్చి నిర్మాణాలు చేస్తున్న మన్భూమ్ కన్ స్ట్రక్షన్స్ నిర్మాణాలను ఆపివెయ్యాలని తెలిపారు. అదే విధంగా రాజీవగృహ కల్ప, భూదేవి హిల్స్ పేరుతో చెరువును పూడ్చివేసి లక్షలకు అమ్ముకుంటున్న బాలకృష్ణ వల్ల కూడా చెరువు కబ్జాకు గురైందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకొంటే కనీసం 15 ఎకరాల విస్తీర్ణంను కాపాడుకోగల్గుతామన్నారు. లేకపోతే కొద్ది నెలలో అక్కడ చెరువు ఆనవాళ్లు కూడా కనిపించకుండా మొత్తం అన్యక్రాంతం అవుతుందని అన్నారు. పరికి చెరువు లేకపోతే భవిష్యత్తులో స్థానిక ప్రజలు నీటితో ఇబ్బంది పడాల్సివస్తుందన్నారు. కావున హైడ్రా కమిషనర్ స్పందించి.. వెంటనే పరికి చెరువును సర్వే చెయ్యించి హద్దులు గుర్తించి.. శాశ్వాత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, సీపీఐ నాయకులు, మహేందర్, ప్రభాకర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

భార్యకు విడాకుల నోటీసు..

● రెండు రోజులుగా భర్త ఇంటి ముందే భార్య మౌన పోరాటం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కట్నం తీసుకుని పెండ్లి చేసుకుని.. బిడ్డను కనేందుకు పుట్టింటికి వెళ్లిన భార్యకు భర్త విడాకుల నోటీసులు పంపించారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, సూరారం లక్ష్మీనగర్‌లో చోటు చేసుకుంది. ఇది చూసి షాకైన భార్య.. అతని ఇంటికి వచ్చి నిలదీసింది. అత్తింటి వారు పట్టించు కోకపోవడంతో కాలనీ వాసుల మద్దతుతో భర్త(తేజ) ఇంటి ముందు గత 2 రోజులుగా ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన మైనం భాస్కరరావు, విజయ లక్ష్మి దంపతుల కొడుకుతో రమ్య అనే మహిళకు వివాహం జరిగింది. కొద్ది రోజులు కాపురం సజావుగానే సాగింది. గర్భవతి అయిన తనను అబార్షన్ చేయించుకోవాలని తన భర్త ఒత్తిడి తెచ్చినట్లు బాధితురాలు రమ్య వాపోయారు. దీనికి తాను అంగీ కరించలేదని.. ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లిన తనతో ప్రేమగా ఉంటూనే పథకం ప్రకారం విడాకులకు అప్లై చేసినట్లు తెలిపారు. తన బాబును చూసేందుకు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాను తన 9 నెలల బాబు, తల్లిదండ్రులతో భర్త ఇంటికి రాగా.. అత్త మామలు బయటకు గెంటేసి, ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారని చెప్పారు. దీంతో ఆమె తన గోడును కాలనీ వాసులకు చెప్పి భర్త ఇంటి ముందు మౌన పోరాటానికి దిగారు. తనకు, తన కొడుకుకు న్యాయం చేయాలంటూ మీడియా ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం వికలాంగులపై సవతి ప్రేమ..



● ఎన్.పి.ఆర్.డి.జిల్లా కోశాధికారి జంగిటి మల్లేష్
● చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వికలాంగుల పట్ల కేంద్రప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఎన్.పి.ఆర్.డి మేడ్చల్ జిల్లా కోశాధికారి జంగిటి మల్లేశ్ అన్నారు. ప్రస్తుతం పెన్షన్ రూ.300 ఇస్తుందని వెంటనే రూ. 5000 వేలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్లోని జగద్గిరిగుట్ట ఎన్.పి.ఆర్డీ కార్యాలయంలో పెన్షన్ పెంపు కోసం ఫిబ్రవరి 10 న తలపెట్టిన "ఛలో ఢిల్లీ" పోస్టర్‌ను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీపతి, రాహుల్, టి.అంజురాణి పాల్గొన్నారు.

బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఫ్రీ హెల్త్ క్యాంపు..



● 51 మంది వాహనదారులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో కిష్టయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహించారు. స్మార్ట్ విజన్ ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఐ క్యాంపులో సుమారు 51 మంది వాహనదారులు, దరఖాస్తుదారులతో పాటు సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు పర్వీందర్ రాజు, ఘంటా రవీందర్, ప్రవీణ్ కుమార్, సురేష్, అడ్మిన్ ఆఫీసర్లు హరిప్రసాద్, సునీత తదితరుల పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలి



● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట అంతములో రోజురోజుకు పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని ఐ.ఎన్ టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కోరారు. జగద్గిరిగుట్టలో మంజూరైన ప్రభుత్వ ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆయన నివాస కార్యాలయంలో కాంగ్రెస్, ఐ.ఎన్.టి.యు.సి శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలు మైనార్టీలు నిరుపేదలు నివసించే ప్రాంతమని ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రి మంజూరైనదని దానిని వెంటనే నిర్మించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాల, ఆస్పత్రి మంజూరైన నిర్మించలేదని మంత్రికి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని వినతిలో కోరారు. స్పందించిన మంత్రి వెంటనే అధికారులకు ఆదేశాలు ఇస్తానని పరిశీలిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిపల్లి జనార్దన్, నాయకులు హుస్సేన్, పటేల్, కమల్ కిషోర్ తదితరులున్నారు.

సీపీఎస్ మోడల్ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గ్రీన్ హిల్స్ కాలనీలోని "సీపీఎస్ మోడల్ స్కూల్"లో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. విద్యార్థులు ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి ముందే వచ్చిందా అనేలా సందడి నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రంగ వల్లులను పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడమే కాకుండా పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వీరన్న మాట్లాడుతూ...మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్



ఏ.నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రి శక్తిపీఠంలో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ముక్కోటి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన ప్రముఖ సంఘసేవకులు, రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అదినేత లయన్స్ క్లబ్ ఆఫ్ గాంధీనగర్ ఆర్య వ్యవస్థాపకులు డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి శుక్రవారం కూకట్‌పల్లిలోని శ్రీ అష్టలక్ష్మి సహిత గాయత్రి మహాపీఠంలో పీఠాధిపతి శ్రీ వి.వి.వి రామాచార్యులు స్వర్ణార్చనతో నిండు ఆశీర్వచనం అందుకొని, గాయత్రి దేవి దీవెనలతో అందరు బాగుండాలని వేద మంత్రాలతో నిర్వహించిన అర్చనలో మిత్రులతో పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ అభినవ కవి, ఆత్మీయ భారతి సాహిత్య సేవ సంస్థ అధ్యక్షులు, పుడమి రత్న అవార్డు గ్రహీత, మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్ రెడ్డి మాట్లాడుతూ డా.రాజశేఖర్ రెడ్డి సాహిత్య పోషకులుగా, నిండైన భక్తిభావంతో సంఘసేవకులుగా విశేషమైన అనుభవాలతో ఎందరికో ఆదర్శముగా నిలుస్తూన్నారన్నారు. నేటి యువతకు స్ఫూర్తినిస్తూ.. వైకుంట ఏకాదశి సందర్భంగా ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమములో రామరావు, ప్రముఖ వెంగలాస్ క్యాటర్స్ అదినేత లయన్ ఎల్లా సుబ్బారెడ్డి,బిల్డర్ హేమాద్రి నాయుడు, విశ్రాంతి అయుర్వేధ వైద్యులు జయ రామ్, ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
10
శనివారం | జనవరి 11, 2025 | www.navatelangana.com

'ప్లేస్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డ్స్-2025' ప్రదానం



నవతెలంగాణ-అంబర్‌పేట:

తెలంగాణ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ లీడర్స్ అసోసియేషన్ (టీపీఓ) సమ్మిట్-2025 శుక్రవా రం ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీపీఓలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన టీపీఓలను 'ప్లేస్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డ్స్-2025' తో ఘనంగా సత్కరిం చారు. ఈకార్యక్రమంలో సౌతార్ ల్యాండ్, మెట్ మార్క్స్, ఐరిస్ తదితర బహుళ జాతీయ కంపెనీల నుండి హాజరైన ప్రముఖ హెచ్ఆర్‌లతో ప్యానెల్ చర్చ ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్లేస్‌మెంట్స్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీంముద్దీన్, వైస్ ప్రెసిడెంట్ వి.సంయుక్త, వైస్ ప్రెసిడెంట్ టి. మురళీ ప్రసాద్, ట్రెజరర్ అండ్ వైస్‌ప్రెసిడెంట్ చైతన్య, సలహాదారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరగడంతో నిర్వాహకులు వర్షం వ్యక్తం చేశారు.

'ప్రభుత్వం మాట మార్చడం వెనక మతలబు ఏంటి'

- గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ ధరలను తగ్గించాలి : ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా బాలీవుడ్ స్థాయిలో రిలీజ్ అయిన 'గేమ్ ఛేంజర్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పెంచిన సినిమా టిక్కెట్ల ధరలను తగ్గించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కె.ధర్మేంద్ర విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.సీఎం ఎ.రేవంత్ రెడ్డి సినిమా టిక్కెట్ల ధరలను పెంచేది లేదంటూ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ సినీ పరిశ్రమ వారితో భేటి తర్వాత సీఎం మాట తప్పి గేమ్ చేంజర్ సినిమాకు అనుమతి ఇవ్వడం వెనక ఉన్న మతలబు ఏంటని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పూటకో నిర్ణయం తీసుకోవడం సరికాదని హితవు పలికారు. సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. సినిమా టిక్కెట్ల ధరలను పెంచొద్దని బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ప్రేక్షకులపై భారం పడుతుందని వినోదాన్ని పేదలకు దూరం చేయడమేనని వారు తెలిపారు.

డబుల్ బెడ్‌రూం పట్టాలు, కరెంటు, మంచి నీళ్లు ఇవ్వాలి

సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ. కృష్ణ నాయక్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

జంగంమెంట్ డివిజన్ ప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలతో పాటు కరెంటు, మంచి నీటి సౌకర్యం వెంటనే కల్పించాలని సీపీఐ(ఎం) జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ. కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో హైదరాబాద్ డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ జంగంమెంట్ డివిజన్ ప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. గత 16నెలల్లో డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని, ఇప్పటికే 9 సంవత్సరాలైన గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో 72 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇచ్చిన ఇప్పటికి ఏండ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టాలు జారీ చేయడం లేదన్నారు. పట్టా సర్టిఫికెట్ ఇవ్వాలని పలుమార్లు హైదరాబాద్ జిల్లా రెవిన్యూ అధికారి(డిఆర్ఓ) విన్నపించామన్నారు. ఈ 72 కుటుంబాలు వారి వారి ఇండ్లలో ఉంటున్నారని, వారికి కరెంటు, మంచినీళ్ల సౌకర్యాలు కల్పించాలని రెవిన్యూ అధికారుల కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చొరవ చేసుకొని పట్టాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాం కుమార్, యువజన రాష్ట్ర నాయకులు అనగంటి వెంకటేష్, కోట రమేష్, భజరంగ్ తదితరులున్నారు.

మరోసారి కుంగిన నాలా

గోషామహల్‌లో నాలాలో కుంగిన మిక్చర్ లారీ.. తృటిలో తప్పిన ప్రమాదం..

- పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

గోషామహల్‌లో భారీ ప్రమాదం జరిగింది. స్థానికంగా ఉన్న ఫ్లైవుడ్ దుకాణాల ముందు ఉన్న గోషామహల్ నాలా మరోసారి కుంగిపోయింది. దీంతో క్రషర్ లారీ నాలాలో కూరుకుపోయింది. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బయటకు దుకాడు. గతంలో ఇదే ప్రాంతంలో నాలా కుంగిపోయింది. ఆ నాలా పనులు చేస్తుండగా.. ఇప్పుడు మరోసారి నాలా కుంగింది. నాలా పనుల నిమిత్తం క్రషర్‌ను తీసుకొచ్చిన లారీ కూరుకుపోయింది. ఈ దారి గుండా రెండు నాలాలున్నాయి. ఓ పక్క కుంగిన నిర్మాణం అవుతుండగా పక్కన నాలా మిక్చర్ లారీతో కుంగిపోయింది. సమాచారం అందుకున్న సర్కిల్ 14 డిప్యూటీ కమిషనర్ విద్యాధర, డీఈ మహేందర్, ఏఎంహెచ్ఓ వెంకట్ ఎస్.రమణ, అధికారులు, గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్, అల పురుషోత్తం, కాంగ్రెస్ నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లాల్ సింగ్ మాట్లాడుతూ.. చాలా కాలంగా ఉన్న నాలాలు, మాసాబ్ ట్యాంక్, దారుల సాలం మీదుగా వస్తాయన్నారు. ఈ ఒక్క రోడ్డులోని మధ్యలో గోడ నిర్మించి పైన స్లాబ్ వేశారన్నారు. ఈ మార్గం గుండా అన్ని రకాల వాహనాలు కొనసాగుతాయని, ప్రభుత్వం దృష్టి ఉంచి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేల ఇవ్వాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షురాలు టి. యాదమ్మ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను తన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఆశాల సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని కోరారు. అనంతరం టి.యాదమ్మ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందని తెలిపారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిసెంబర్ 10న ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు ఆశాల ధర్నా చర్చల సందర్భంగా కమీషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఫిబ్ర వరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏఎన్ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు, ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలన్నారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజు వల్ సెలవులు ఇవ్వాలని, 6 నెలలు మెడికల్ సెలవులు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. ఆశాలు చేస్తున్న పారితోషికం లేని పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెల వులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆశాలకు పని భారం తగ్గించాలని పారితోషికం లేని పనులు చేయించ కూడదని కోరారు. ఆశా వర్కర్ల డిమాండ్ల పరిష్కారానికి అసెంబ్లీ సమావేశాలలో ప్రత్యేకంగా చర్చించి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే ముటాగోపాల్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుక, కృష్ణవేణి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ పదార్థాలు ఆరోగ్యవంతమైనవి..

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి..
- పేట్లబుర్జ్ ప్రసూతి ఆస్పత్రిలో విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం



నవతెలంగాణ-ధూల్‌పేట్

విజయ డెయిరీ పదార్థాలు ఆరోగ్యవంతమైనవని పేట్లబుర్జ్ ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా తెలంగాణ విజయ డెయిరీ చైర్మెన్ గుత్తా అమిత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ డెయిరీ పార్లర్‌ను డైరీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, జనరల్ మేనేజర్ మల్లికార్జున రావులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయ డెయిరీ పాలు, పాల పదార్థాలు నాణ్యమైనవి, పోషకాలతో కూడినవన్నారు. ఇక్కడ వచ్చే గర్భిణీ మహిళలకు, రోగుల సహాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించిన విజయ డెయిరీ యాజమన్యానికి రాధాకృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ అమృత లక్ష్మి, డైరీ ఆర్ఎస్ఎం అరుణ్ కుమార్, అర్ఎస్ఎం ప్రభాకర్, ఆపరేటర్ రాధాకృష్ణ, నవీన్, శ్రీను ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని తెలంగాణ బీసీ విద్యార్థి విభాగం నాయకుడు గంగపుత్ర రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో శ్రీ వీర అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆచార్య ఆత్రేయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ శ్రీనివాసుకి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవదేవుని వేడుకున్నానని, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అయ్యప్ప దర్శనానికి వెళ్లే అయ్యప్ప స్వాములకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంతోష్, సాయి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ..



నవతెలంగాణ-చాంద్రాయణ గుట్ట

జల్ పల్లి మున్సిపాలిటి పరిధిలోని జల్ పల్లి, శ్రీరామ్ కాలానికి చెందిన వారికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, కౌన్సిలర్లు షైక్ అఫ్జల్, పల్లప్పు శంకర్, తదితరులు

పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ



నవతెలంగాణ- సిటీబ్యూరో

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జేటీసీ రమేష్ ఆదేశాల మేరకు డీటీటీ నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీవో కె. అమర్‌నాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాగోల్ రాజీవ్ గాంధీ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీధర్, శీతల్ చౌహన్, అనిత, విష్ణు దీపక్‌రెడ్డి, కమల్‌కాంత్, జ్ఞానేశ్వర్, వేణు, ప్రసాద్, అభిలాష్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ' జాబితాలో చేర్చాలి

తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రంలోని ముదిరాజులను బీసీ డి నుంచి బీసీ ఏ జాబితాలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రామ ముదిరాజ్, రాష్ట్ర మహిళ కార్యదర్శి దివ్య ముదిరాజ్, గ్రేటర్ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్, మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపల్లి శ్రీదేవి ముదిరాజ్, బిచాల తులసి ముదిరాజ్ మహిళా ప్రధాన కార్యదర్శితో కలిసి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబర్‌పేటలోని తెలంగాణ ముదిరాజ్ సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి మహిళా అధ్యక్షురాలు రామా ముదిరాజ్ చేతుల మీదుగా నాగోల్‌కు చెందిన చిక్కుడు రజిత, గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నాగోల్‌కు చెందిన చిలుముల సుప్రియ, గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బాకరంకు చెందిన గొడుగు లక్ష్మీని గ్రేటర్ హైదరాబాద్ ప్రచార కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా పుట్టి యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ సాక్షాత్తు మహాభారత మహాకావ్యంలోనే ముదిరాజు వంశస్తుల ప్రస్తావన ఉందని చరిత్ర తెలియజేస్తున్నదని, ముదిరాజ్ కులస్తుల ఆర్థిక పరిస్థితులు ఎంత మాత్రం ప్రోత్సాహకరంగా లేవని, ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలో చేర్చాలని, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడిన మాటలు రాష్ట్రంలో అత్యధికులు ముదిరాజ్ కులస్తుల ఉన్నారని ఓ సందర్భంగా మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా సీఎం చొరవ తీసుకొని ముదిరాజ్ కులస్తులను బీసీ ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా సంక్రాంతి సంబరాలు..



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్‌లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా రంగోలి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా బాలురలతో రంగవల్లీ, ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగింది. స్కూల్ విద్యార్థులు ఒకదానికి మించి ఒకటిగా ముగ్గులు వేసి బాలిక విద్యార్థులకంటే బాలుర విద్యార్థులే మిన్నగా ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పులి గారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా గాలిపటాలకు వాడే ప్రత్యేక చైనా మాంజాను వాడకూడదని వాటి వల్ల పక్షులకే కాకుండా ద్విచక్ర వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతూ ప్రాణాలను సైతం హరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత, అధ్యాపక బృందం ప్రసన్న, నర్మదా, జషింత, స్వప్న, మాధవి, భాస్కర్, విజయ్, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్

యూనియన్ హెచ్-1 డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డి(హెచ్) డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ - 1(న్యూ ఐఎన్‌టీయుసీ) రాష్ట్ర కమిటీ 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డిహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని కర్నాటి సాయి రెడ్డితో కలిసి డైరీ-2025ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఉద్యోగుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. సాయి రెడ్డి అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న అన్ని క్యాడర్లను కలుపుకొని అందరి సమస్యలు పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. కాంటిజెంట్ వర్కర్స్ లకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్స్‌కు రూ.18వేలు జీతం పెంచాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వం చేపట్టబోతున్న సంస్కరణలలో ఉద్యోగ సం ఘాలను భాగస్వామ్యం చేయాలని, భవిష్య త్తులో సర్వీస్ విషయాలలో స్పష్టత ఉంటుం దని చెప్పార్కు ర్కింగ్ ప్రెసిడెంట్ జి. రాజ శేఖర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వ పాలనలో 317 బాధిత ఉద్యోగులకు సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు, టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేం దర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాగేశ్వర రావు, నిజాంబాద్ అధ్యక్షులు రవిచందర్, కార్యదర్శి కరిపి రవీందర్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు వి.కృష్ణారావు, కార్యదర్శి ఎస్. సందీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ గిరి, అశోక్, పెద్ద ఎత్తున వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన యూనియన్ నాయకులు, వివిధ క్యాడర్లకు చెందిన నాయకులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులున్నారు.

ఘనంగా రెడ్డి ఉమెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-అంబర్‌పేట

కాచిగూడ డివిజన్ పరిధిలోని బర్కత్‌పూరలో రెడ్డి ఉమెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలకృష్ణ రెడ్డి, చైర్మెన్ తెలంగాణ ఉన్నత విద్య మండలి, ప్రొ. శశికాంత్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విచ్చేశారు. బాలకృష్ణారెడ్డి వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలకృష్టారెడ్డి ఆడపిల్లలు ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని, తమకు వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని నవ భారత నిర్మాణంలో తమదైన శైలిలో ఎన్నో అంశాల మీద వారి ఏకాగ్రత కేంద్రీకరించి బంగారు తెలంగాణను సాధించడానికి దోహద పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రెడ్డీ ఉమెన్స్ కళాశాల సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అచ్యుత దేవి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా క్యాలెండర్‌ను ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం ఆవిష్కరించారు. రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.విజయ భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనిపాఠశాలల్లో, విద్యాల యాలలో, డైట్ కళాశాలల్లో, ఉపాధ్యాయ శిక్షణ కళా శాలల్లో విశ్వ విద్యాలయాలలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్ఎంఓ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆగాపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్, ఎన్‌సీడీ,హెచ్ఐవీ, కుష్టు వ్యాధులపై హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ఆయన మాట్లాడుతూ.. లెప్రసీ (చర్మవ్యాధులు)పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒంటి పైన పాలిపోయిన, రాగి రంగులో స్పర్శ జ్ఞానం లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి చూపించాలని చెవి వెనక, కాళ్లు, చెవివెలుపల నూనె రాసినట్లు బొడిపెలు ఉన్నచో, పరీక్షలు చేయించుకొని డాక్టర్ సలహా మేరకు తగిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్ అనే బ్యాక్టీరియా వలన వస్తుందని ఇది అన్ని రోగముల వలనే నయమవుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రీన్, డీపీహెచ్ఓ మజారుద్దీన్, ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఓఆర్ డబ్ల్యూ లలిత, భాగ్య, ఏ.మతినా, ఎంపీహెచ్ఏ (ఎఫ్) జ్యోత్స్న వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరీ బాధ్యత..

రోడ్డు భద్రత వారోత్సవాల్లో అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రవి కుమార్ అన్నారు. శుక్రవారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పలు స్కూల్స్ వద్ద ఆటోడ్రైవర్లతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ రక్షణ సూత్రాలను పాటించాలని సూచించారు. స్కూల్ పిల్లలను జాగ్రత్తగా తీసుకువెళ్లాలని ఆటోలలో పరిమితికి మించి స్కూలు పిల్లలను ఆటోలలో తీసుకు వెళ్ళవద్దని, వారిని క్షేమంగా స్కూలుకు, ఇంటికి తీసుకువెళ్లాలని సూచించారు. వాహనాల్లో ప్రయాణించే ప్రజల ప్రాణాలు సైతం డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని వారిని గమ్యానికి క్షేమంగా చేర్చే బాధ్యత డ్రైవర్లదేనన్నారు. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు. ప్రధానంగా వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు,ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ నగర నాయకులు దినేష్ అంబారి

నవతెలంగాణ-అంబర్‌పేట



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్
HMDA

11

శనివారం | జనవరి 11, 2025 | www.navatelangana.com



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నవతెలంగాణ సిటీబ్యూరో

డయాలసిస్ రోగులకు రగ్గుల వితరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్‌లోని డయాలసిస్ రోగులకు, నిమ్స్ కిడ్నీ రోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివ కుమార్, అల్తాఫ్, కె.ఎస్. రావు, ప్రభాకర్, పాషామియా అభ్యర్థన మేరకు 'హెల్ప్ నీడీ ట్రస్ట్' సభ్యులు మనోహర్ బాబు, రాఘవులు, రఘునాథ రావు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ భూషణ్ రాజ్, డాక్టర్ స్వర్ణలత, పీఆర్‌వో సత్యగౌడ్ సమక్షంలో రగ్గులను పంచి పెట్టారు. చలి తీవ్రత పెరుగుతున్న సమయంలో అవసరానికి రగ్గులను అందజేసిన దాతలకు రోగులు, వారి బంధువులు కతజ్ఞతలు తెలిపారు.

అంకితభావం, క్రమ శిక్షణతో విజయం



- విజయవంతంగా పూర్తయిన జూనియర్ అసిస్టెంట్ల శిక్షణ
- ధ్రువ పత్రాలు అందజేసిన ఈడీ మయాంక్ మిట్టల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలికి కొత్తగా కేటాయించిన 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ (పీ అండ్ ఏ, ఎఫ్ అండ్ ఏ) శిక్షణ పూర్తైంది. గచ్చిబౌలిలోని ఈస్కి క్యాంపస్‌లో గురువారం ప్రారంభమైన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈడీ మయాంక్ మిట్టల్ వారికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. జలమండలిలోని వివిధ విభాగాలపై అవగాహన కల్పించారు. ఓ అండ్ ఎం, ట్రాన్స్మిషన్, అడ్మినిస్ట్రేషన్, ఐటీ, రెవెన్యూ తదితర అంశాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, పనిలో దానిని వినియోగించాలన్నారు. అంకితభావం, క్రమ శిక్షణతో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. 141 మందిని 3 బ్యాచులుగా చేసి ట్రైనింగ్ ఇస్తున్నామని, ఇప్పటికే 2 బ్యాచులకు శిక్షణ పూర్తైదన్నారు. మిగిలిన బ్యాచ్‌కి సంక్రాంతి సెలవుల అనంతరం శిక్షణ ఉంటుందని, తర్వాత వీరిని వివిధ శాఖలకు కేటాయించనున్నారని తెలిపారు. త్వరలోనే వీరు విధుల్లో చేరనున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షల్లో ఉద్యోగం సాధించిన వీరిని ప్రభుత్వం జలమండలికి కేటాయించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఇస్కీ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావుతోపాటు జలమండలి పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ఆర్టీవో ఆఫీసులో

ఉచిత వైద్య శిబిరం..



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్టీవో యర్రి స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మలక్‌పేట్ యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ హెల్త్ క్యాంపులో పలువురు వాహనదారులు, దరఖాస్తుదారులతో పాటు సిబ్బందికి ఉచితంగా పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి.. మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు జయచందర్, అవినాష్ బెన్నిరాజ్, నర్సింహ్మా స్వామి, కానిస్టేబుల్ శ్రీహరి, ఆటో యూనియన్ నాయకులు సత్తిరెడ్డి, తదితరుల పాల్గొన్నారు.

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు

శాశ్వత పరిష్కారం చూపుతాం



- అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్న హైడ్రా కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా 4 నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో సంబంధిత ప్రభుత్వ శాఖలతో పాటు ఐఐటీ, బిట్స్‌పిలానీ, జేఎన్‌టీయూ వంటి విద్యా సంస్థల ఇంజినీర్లను కూడా దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో భాగస్వామ్యం చేస్తామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ ఆర్ ఎస్‌సీ), సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ, హెచ్ ఎండీఏ ఇలా అన్ని శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎన్.ఆర్.ఎస్.సీ శాటిలైట్ ఇమేజీలను, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను శాస్త్రీయ పద్ధతుల్లో అధ్యయనం చేసిన తర్వాత తుది నివేదికను రూపొందిస్తామన్నారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి గతంలో హెచ్.ఎం.డీఏ ఇచ్చిన ప్రిలిమనరీ నోటిఫికేషన్‌పై పరిసరప్రాంతాల నివాసితుల అభ్యంతరాలను హై కోర్టు ఆదేశాలమేరకు లేక్‌ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌గారు శుక్రవారం హైడ్రా కార్యాలయంలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 6 కాలనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వారి వద్ద ఉన్న సమాచారాన్ని అందజేశారు. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి అభ్యంతరాలను వినిపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి 25 ఏండ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపాలని నివాసితులు అభ్యర్థించారు. 25 ఏండ్ల కాలంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఏనాడూ మా వాదనలు ఇలా బహిరంగంగా వినలేదని, తమను హైడ్రా ప్రధాన కార్యాలయానికి పిలిపించి ఎఫ్‌టీఎల్ అంశంలో తమ అభ్యంతరాలను విని పరిష్కార మార్గాలు కనుక్కొంటామని కమిషనర్ రంగనాథ్ హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. దశాబ్దాల కాలంలో ఎఫ్‌టీఎల్ పైన ఒక్కో విభాగం ఒక్కో లెక్క చెబుతోందని, మిగతా చోట్ల చెరువులు మాయం అయితే ఇక్కడ ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పెరుగుతూ వస్తోందని స్థానికులు తెలిపారు. వాస్తవానికి 65.12 ఎకరాలు కాగా ఇప్పుడు ఒక్కో శాఖ ఒక్కో లెక్క చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2000 సంవత్సరంలో భారీ వర్షాలకు చెరువు నిండి, చుట్టు పరిసర ప్రాంతాల్లో వరద నిలిస్తే దానిని ఎఫ్‌టీఎల్ అంటున్నారన్నారు. అందరి వాదనలను పరిగణనలోకి తీసుకుంటామని, శాస్త్రీయ పద్ధతులు పాటించి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారిస్తామన్నారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొంటామన్నారు. లేక్ మేమోయిాస్, గ్రామ రికార్డులు సర్వే నంబర్ల ఆధారంగా ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్వహించిన ప్రజాభిప్రాయ కార్యక్రమంలో వీ. గోపాల కష్ణ, ఎల్. ఊర్మిలాదేవి, బీ. ప్రియతమరెడ్డి, బీ. నలిని, జేవీ చౌదరి, రవీందర్ రెడ్డి, బాషా మొహియుద్దీన్ తదితరులు దాదాపు వందమంది వరకూ హాజరయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

వైస్ ప్రిన్సిపాల్‌గా డా. సీమ అరవింద్



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్సు సైఫాబాద్ వైస్ ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ విభాగానికి చెందిన డా.ఎస్.అరవింద్ నియమితులయ్యారు. శుక్రవారం ఓయూ వీసీ ప్రొ. ఎం.కుమార్ నియామక పత్రం అందజేశారు. సీమ అరవింద్‌కు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కె.శైలజ అభినందనలు తెలిపారు. అలాగే జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ సునీత మంజరి, లెఫ్టినెంట్ నరేష్,అసిస్టెంట్ రిజిస్టర్ షానవాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు డివిజన్ నాయకుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు బీఆర్ఎస్ బోరబండ డివిజన్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ విజయకుమార్, సర్దార్, దేవమని, ధర్మ ,రమేష్ యాదవ్ , యుసుఫ్ భాయ్, లడ్డు ,జీవన్ ,రాబర్ట్ , శ్రీ లక్ష్మీ మేరీ, రజియా , అజయా లత ,డేవిడ్ వసంతరావు, సంతోషి,ఆబ్బు, షాకీర్, కలీల్, తదితరులు పాల్గొన్నారు. బోరబండ డివిజన్ బస్టాండ్ లో గల తోపుడు బండ్ల వ్యాపారులు అందరూ వారి ఇబ్బందులను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్థానిక ఏసీపీకి ఫోన్ చేసి మాట్లాడారు. చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే వారికి ఇబ్బంది కలిగించవద్దని చెప్పారు. స్పందించిన ఏసీపీ చిరు వ్యాపారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



శబరిమలలో ఎమ్మెల్యే శ్రీ గణేష్..

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మెల్యే శ్రీ గణేష్ శుక్రవారం శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. 41 అయ్యప్ప స్వామి దీక్ష అనంతరం శబరిమలలోని అయ్యప్ప దేవాలయంలో ఇరుముడి సమర్పించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.



మమత హైస్కూల్‌లో పౌష్టికాహారంపై అవగాహన

నవతెలంగాణ-బేగంపేట్

పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిదని సికింద్రాబాద్ మండల్ 2వ విద్యాశాఖ అధికారి గుండప్ప అన్నారు. శుక్రవారం మమత హైస్కూల్‌లో విద్యార్థులు చేసిన వంటకాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య తో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారని, ముఖ్యంగా పౌష్టికాహారంతో చేసిన ఆహారపు వంటకాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. మమత హై స్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్ర రాణి మాట్లాడుతూ.. విద్యార్థులు చేసిన వంటకాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నోడల్ ఆఫీసర్ యాదగిరి, కాలనీ అధ్యక్షుడు రాజేశం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో ముగ్గుల పోటీ

నవతెలంగాణ-బేగంపేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో శుక్రవారం రంగురంగుల ముగ్గులపోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు ప్రజల సాంప్రదాయ పండుగ అయిన సంక్రాంతి వివిధ రకాల ఇతివృత్తాలను రంగోలిలు ప్రదర్శించారు. ఈ పోటీ విద్యార్థులు పండుగ ప్రాముఖ్యత, వారి జీవితాలలో దాని ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడానికి సహాయపడింది. పోటీని కరస్పాండెంట్, ఫాదర్ డి. రవిశేఖర్, ప్రిన్సిపాల్ ఫాదర్ ఎ. ఇలాంగో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సెయింట్ పాట్రిక్స్ పాఠశాల ఎల్లప్పుడూ విద్యార్థులకు వారి ప్రతిభను ప్రదర్శించడానికి వేదికలను అందించిందని, మన సాంస్కృతిక వారసత్వం, గొప్పతనాన్ని అభినందించడానికి అవకాశాలను సృష్టించిందని అన్నారు. ఈ పంట పండుగ సందర్భంగా రైతులను, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని కరస్పాండెంట్ అన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితుడైన ఎం.డి. సందీప్, విద్యార్థుల సృజనాత్మక రంగోలి ప్రదర్శనలను అభినందించారు.



కేటీఆర్ జీవితాంతం తీహార్ జైలుకు పోక తప్పదు

- కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల కాంతం

నవతెలంగాణ-బంజారాహిల్స్

అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డదిడ్డంగా తెలంగాణ సొమ్ము దోచుకున్న కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తీహార్ జైలు తప్పదని ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల కాంతం అన్నారు. బంజారాహిల్స్ లోని హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెయన మాట్లాడారు. రాష్ట్రాన్ని కుటుంబ సమేతంగా దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉండగా క్యాబినెట్ ఆమోదం లేకుండా ఫార్ములా ఈ రేస్ కేసులో రూ. 55 కోట్ల అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. అక్రమాలకు నిలయంగా గత ప్రభుత్వం పాలన సాగిందని విమర్శించారు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.తెలంగాణ ఉద్యమంలో ఆ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తెలంగాణ కోసం చనిపోతా అంటున్న కేటీఆర్ ఉద్యమ సమయంలో ఎందుకు చావలేదని ప్రశ్నించారు. సెంటిమెంట్‌ను ఉపయోగించి లబ్ధి పొందాలని చూడటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే రాష్ట్ర విచారణ సంస్థలు ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరుగుతుండగా కేంద్రం సైతం రంగంలో దిగినందున ఆ కుటుంబసభ్యులందరూ తిహార్ జైలుకు వెళ్లటం ఖాయమని అన్నారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి అక్రమాలతో పాటు ఉద్యమకారులకు చేసిన ద్రోహాన్ని ప్రజల ముందు ఉంచేందుకు ఈనెల 29న తెలంగాణ ఉద్యమకారుల సభను ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- ఓయూ జేఏసీ డిమాండ్.

నవతెలంగాణ-ఓయూ



మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు జోగు నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా ప్రజలకు వారి సమస్యలు, విజ్ఞప్తులు తెలియజేయటానికి మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న రంగారెడ్డి కి రాబోయే మంత్రి వర్గ విస్తీర్ణం లో ఎడ్యుకేషన్ మినిస్టర్ గాని హెూమ్ మినిస్టర్‌గా కానీ నియమించాలని కోరారు.

ముగిసిన అంతర్జాతీయ హిందీ సదస్సు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ భారత ప్రభుత్వ హిందీ విభాగం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హిందీ విభాగం, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతాఫల్మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నటువంటి అంతర్జాతీయ హిందీ సదస్సు శుక్రవారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. సదస్సులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వక్తలు పరిశోధకులు, పత్ర సమర్పకులు పాల్గొని ప్రత్యక్షంగా, వర్చువల్ గా తమ ప్రసంగాలను అందించారు. హిందీ సాహిత్యం గురించిన వివిధ ప్రాయోజిత అంశాలను గురించి, అనువాద సాహిత్యంలోని విభిన్న కోణాలను గురించి ఈ సదస్సులో వక్తలు విస్తత స్థాయిలో చర్చించారు. పత్ర సమర్పకులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం పట్ల కళాశాలల ప్రిన్సిపాళ్ళు డా. ప్రభు డా.రామచంద్రం, ఓయు హిందీ విభాగ అధ్యక్షులు ప్రో.మాయాదేవి , డా.అనుపమ,డా. సంగీతా వ్యాస్ లు సంతోషన్ని వ్యక్తం చేశారు. నగరంలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు తమ విద్యార్థులను ఈ సదస్సుకు తీసుకొచ్చి అనువాద సాహిత్యం గురించిన విశేషమైన సమాచా రాన్ని వారికి అందించేందుకు దోహదపడ్డారని సదస్సులో ప్రసంగకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సదస్సులో ప్రసంగించిన పత్ర సమర్పకులకు సదస్సు నిర్వాహకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆర్ట్స్ కళాశాలలో ఇంత గొప్ప సదస్సు నిర్వహించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం ఆనందం వ్యక్తం చేశారు. సదస్సు పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఓయూ వీసీ ప్రొ. కుమార్ కు సదస్సు నిర్వాహకులు కతజ్ఞతలు తెలిపారు.ఈ సదస్సులో కళాశాలల అధ్యాపకులు డా.సుధ, డా.యాదవ్, వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు ,విద్యార్థులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

గ్రోయింగ్ రూట్స్ పాఠశాలలో సంక్రాంతి శోభ



నవతెలంగాణ-బంజారా హిల్స్

సంస్కతి సాంప్రదాయా పండుగాల ఆచారాలు భావితరాలకు తెలపాలన్న సంకల్పంతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల వ్యవస్థాపకురాలు ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. హరిదాసుల కీర్తనలు, భోగి మంటలు, రకరకాల పిండి వంటల ఘుమఘుమలు, సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు ఆటపాటలతో పాఠశాలల్లో సంక్రాంతి శోభనెలకొంది. నగరంలోని అన్ని పాఠశాలలో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. కమలాపురి కాలనీలోని గ్రోయింగ్ రూట్స్ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరు కాగా పాఠశాల ఆవరణలో హరిదాసుల కీర్తనలు అలరించాయి. సంక్రాంతి విశిష్టతను వివరిస్తూ విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలో నిర్వహిం చారు. ముగ్గుల పోటీల్లో రంగు రంగుల హరివిల్లులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు సాంప్రదాయ పండుగలపై అవగాహన, అప్పటి ఆటల వల్ల కలిగే ఆనందాన్ని వివరించేందుకు వేడుకలను నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. చిన్నారులకు ఇలాంటి తరహా వేడుకలు ఎంతగానో అవసరమని పేరెంట్ పల్లవి అన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన డీఈవో రోహిణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ తెలుగు దినపత్రిక నూతన డైరీ, క్యాలెండర్‌ను హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి, కార్యాలయ ఏడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరీక్షల విభాగం కమిషనర్ జూపల్లి నర్సింగ్ రావు, టీఎస్జీవోస్ జిల్లా సహాధ్యక్షులు, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, సెక్రటరీ ఎం.భాస్కర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రజాసమస్యలను వెలికితీసి ప్రజలకు న్యాయం జరిగే వరకు నవతెలంగాణ దినపత్రిక నిరంతరం పనిచేయడం అభినందనీయమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ కోశాధికారి ప్రేమ్ కమార్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, పబ్లిక్ సెక్రటరీ ఫెరోస్ అహ్మద్, ఈసీ మెంబర్లు ప్రియాదేవ్ ఠాకూర్, ముజాహిద్, ప్రాథమిక సభ్యులు సుదర్శన్, జి. రాజ్ కుమార్, సచ్చిదానంద చారి, కె.పీ అనురాధ, విజయలక్ష్మి, సుగుణారెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, రాజేందర్, అర్చన, యుగేందర్, మంజు, హేమావతి, శ్రీకాంత్, వెంకటేష్, రమేష్, లావణ్య, మీర్జా, సూర్య, జంబయ్య, లక్ష్మిపతి, అక్బర్ హుస్సేన్, పి.అనిల్, పరమేష్, శంకర్, దామోదర్, కులకర్ణి, పూర్ణిమ, అనిల్, ఇస్మాయిల్ ఐజాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

- స్వాగతం పలికిన మానేపల్లి జువెలర్స్ అధినేత రామారావు, చైర్మెన్ మురళీకృష్ణ గోపికృష్ణ



నవతెలంగాణ-బేగంపేట్..

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ భువనగిరిలోని స్వర్ణగిరిలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మానేపల్లి జువెలర్స్ అధినేత రామారావు, చైర్మెన్‌లు మానేపల్లి మురళీకష్ణ,గోపి కష్ణ, ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. తదనంతరం ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపం, డైనింగ్ హాల్, ఆలయ పరిసరాలలోని ఇతర ప్రాంతాలను తిరిగి పరిశీలించారు. ఆలయ నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని చైర్మెన్ గోపి కష్ణ తెలిపారు. రాబోయే రోజుల్లో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా అభివద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే, వెంట యాదాద్రి జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు అయోధ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కంటోన్మెంట్



ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ కార్పొరేటర్ ముద్యం నరసింహా యాదవ్ శుక్రవారం డివిజన్‌లోని స్వర్ణదామ నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం బోయిన్‌పల్లి మార్కెట్‌లో వినాయకున్ని, భవాని నగర్‌లో వీరాంజనేయ స్వామిని, ఓల్డ్ బోయిన్‌పల్లిలో హనుమాన్‌ను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, మన్నె వెంకట్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడి పదవి పొడిగింపు

- గెజిట్ విడుదల చేసిన కేంద్ర రక్షణ శాఖ



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు (సీఎన్ఎమ్) రామకష్ణ పదవీ కాలాన్ని కేంద్రం మరో ఏడాదిపాటు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ గురువారం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న రామకష్ణ పదవి కాలం ఫిబ్రవరి 3వ తారీఖున ముగుస్తుండగా, ఇప్పట్లో కంటోన్మెంట్‌కు ఎన్నికలు కానీ, విలీనం కానీ ముందుకు సాగపోవడంతో కేంద్ర రక్షణ శాఖ నామినేటెడ్ పదవిని పొడిగించారు.

2020 నుంచి రామకష్ణనే నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఈసారి తమకు ఆ పదవినియ్యాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు నర్మదా మల్లికార్జున్, మల్లికార్జున్‌లు బీజేపీ అగ్రనాయకులను కలిసినప్పటికీ నూతన వ్యక్తులకు ఇవ్వకుండా రామకష్ణకే పట్టం కట్టారు. అయితే రామకష్ణ పదవి పొడిగించడం పట్ల బీజేపీలోనే కొందరు నాయకులు నిరుత్సాహంగా ఉన్నారు. ఇదిలా ఉంటే కంటోన్మెంట్‌లో ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులు రెండు రోజుల క్రితమ హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విలీనం విషయంపై జాప్యం చేస్తుండడంతో నియోజకవర్గ పరిధిలో అభివద్ధి కుంటుపడుతోందని పలు పార్టీల నాయకులు జేఏసీగా ఏర్పడి ఢిల్లీలో ధర్నా ప్రయత్నాలకూ సంసిద్ధమవుతున్నారు. అయితే కొంతమంది విలీనంపై మొగ్గు చూపిస్తుంటే మరి కొందరు ఎన్నికలు నిర్వహించాలని ఆశిస్తున్నారు. విలీనం వల్ల కంటోన్మెంట్‌కు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఒక వర్గం నాయకులు భావిస్తుంటే మరొక వర్గం నాయకులు చేస్తేనే బాగుంటుందని వాదనలు వినిపిస్తున్నారు. ఏదేమైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విషయం తేల్చకుండా కాలయాపన చేస్తుండడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

మాలలను ఎదుర్కోలేకనే మందకృష్ణ లక్ష డప్పుల కార్యక్రమం

- డాక్టర్ పిడమర్తి రవి



నవతెలంగాణ-ఓయూ

మాలలను ఎదుర్కొనే శక్తి లేకనే మందకష్ణ మాదిగ లక్ష డప్పులు వేలగొంతుల కార్యక్రమం చేపట్టారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో నిర్వహించిన విద్యార్థి యువగర్జన సభ సన్నాహక సమావేశం తాళ్ల అజయ్, పాల్వాయి నగేష్, బోరెల్లి సురేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వర్గీకరణ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని, అలాంటి ముఖ్యమంత్రిని బీజేపీ మాయలో పడి విమర్శించడం మందకష్ణ మాదిగకు సమంజసం కాదన్నారు. వర్గీకరణ గురించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఒక్క స్టేట్మెంట్ కూడా ఇవ్వలేదని అన్నారు. వర్గీకరణ కోసం కార్యచరణ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ మీద మందకష్ణ మాదిగ బీజేపీ ముసుగులో విషం కక్కుతున్నారన్నారు. మాలలకు మందకష్ణ మాదిగ భయపడుతున్నాడని అన్నారు. వర్గీకరణ ఉద్యమం చేసిన మాదిగలు చాలామంది వద్దులుగా మారారని, వారి సంక్షేమం కోసం ఏ ఒక్కరోజు మందకష్ణ మాదిగ ప్రభుత్వంతో కలిసి వాదనలు వినిపించలేదని తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. మాదిగ వర్గీకరణ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఎంతైనా అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మల్లేశం, ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, ప్రొఫెసర్ డాక్టర్ కొమ్ము కిరణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య,మాదిగ జెఏసీ యూత్ కోఆర్డినేటర్ వడ్డె ఎల్లయ్య, మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రామగల్ల సుందర్, మాదిగ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ జాన్,ఎమ్మార్పీఎస్ నాయకులు బోయిని ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్‌లో ఘనంగా 'క్రీడా దినోత్సవ వేడుకలు..

క్రీడలు మన నిత్య దినచర్యలో భాగం కావాలి : చైర్మెన్ డా.కె.సదానంద్





నవతెలంగాణ-ఓయూ

లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థలు ఓల్డ్ అల్వాల్, వెంకటాపురం విద్యా సంస్థ ప్రారంభమై 20వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం 'క్రీడా దినోత్సవ వేడుకను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. వేడుకను వెంకటాపురం హెడ్ మిస్ట్రెస్ నాగజ్యోతి ప్రారంభిస్తూ విశిష్ట అతిథులను స్వాగతించారు.అనంతరం లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ కె. సదానంద్ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా దినోత్సవ వేడుకను ప్రారంభించారు. అనంతరం లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల డైరెక్టర్ శరత్ చంద్ర భార్గవ్ గాలిలో బెలూన్లు వదిలి విద్యార్థులలో క్రీడోత్సవ ఉత్సాహాన్ని నింపారు. లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జ్యోతి సదానంద్ వివిధ క్రీడల్లో క్రీడా నైపుణ్యాన్ని దాటి, విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేసి, వారిని అభినందించారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కె. సదానంద్ విద్యార్థులను,అతిథులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు మన దినచర్యలో ముఖ్యపాత్ర వహించాలని, క్రీడలతోనే విద్యార్థులకు పోటీ తత్వం అలవడుతుందని తెలిపారు. క్రీడలు మానసిక ఆనందానికి, శారీరక దఢత్వానికి దోహదపడతాయని, విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే క్రీడా నైపుణ్యాన్ని దాటడానికి ఒక మంచి వేదిక అవుతుందని, తమ పాఠశాల విద్యార్థులు జిల్లా, మండల, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని, అనేక పతకాలను, అవార్డులను అందుకున్నారని చెప్పారు. విద్యార్థులు బాల్యం నుండే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, పోటీల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు క్రీడలలో విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇస్తున్నారని వారిని అభినందించారు.

అనంతరం లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల వైస్ ప్రిన్సిపాల్ శివలిరాయా వార్షికోత్సవ నివేదికలో తమ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, శారీరక మానసిక దఢత్వానికి దోహదపడే క్రీడలలో ప్రతి రోజు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కూడా పోటీ తత్వంతో తమ సత్తాను చాటుతూ అనేక అవా ర్డులను అందుకుంటున్నారన్నారు. విద్యా విధానంలో నూతన విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నాణ్య మైన విద్యను బోధించడంలో ఉపాధ్యాయులు కషి, పట్టు దల గొప్పదని ప్రశంసించారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థలో చదువుకున్న విద్యార్థులు ఈనాడు పలు రంగాలలో ఉన్నత స్థాయిలో ఉంటూ దేశానికి ఎంతో కషి చేస్తున్నారని పూర్వ విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఆల్వాల్, ఓల్డ్ అల్వాల్, వెంకటాపురం విద్యార్థులు సంగీతానికి అనుగుణంగా లయబద్ధంగా అతిథులను మైమరిపిస్తూ వివిధ భంగిమలతో కూడిన విన్యాసాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ చేస్తూ, దేశభక్తితో కూడిన అనేక పిరమిడ్లను ప్రదర్శించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. హెడ్ మాస్టర్ లక్ష్మీ శామ్యూల్ వందన సమర్పణ చేయగా జాతీయగీతంతో క్రీడా దినోత్సవం ఘనంగా ముగిసింది.

డాక్టర్ పద్మజకు ఘనంగా సన్మానం

ప్రశంసా పత్రాన్ని అందజేసిన అధికారులు | పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజను ఘనంగా సన్మానించారు. అనాథశ్రమంలో ఉంటున్న పిల్లలకు బర్త్ సర్టిఫికెట్స్ జారీ చేసినందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందించారు. అనాథశ్రమంలో ఉంటున్న పిల్లలకు సుమారు 7 క్యాంపులు నిర్వహించి 1642 మంది విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్స్‌ను జారీ చేశారు. 2024లో 1287 మందికి, 2025లో 355 మంది పిల్లలకు బర్త్ సర్టిఫికెట్స్‌ను జారీ చేశారు. దాంతో గుర్తించిన ప్రభుత్వం డాక్టర్ పద్మజను ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానినంచారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, యూనిసెఫ్ అధికారులు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



స్నేహితులుగానే ఉంటాము..



స్నేహ బంధం ఎంతో మధురమైనది. చిన్నా-పెద్దా, ధనికా-పేద, ఆడా-మగా అనే తేడా స్నేహానికి ఉండదు. ఎలాంటి స్వార్థం లేని బంధం ఏదైనా ఉంది అంటే అది స్నేహమే అని చెప్పొచ్చు. అలాంటి స్వచ్ఛమైన స్నేహంలో లోపం ఉంది అని తెలిస్తే ఆ స్నేహితులు పడే బాధ వర్ణనాతీతం. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో మీ కోసం...

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

మాధవికి 27 ఏండ్లు ఉంటాయి. ఆమెకు రంజిత్‌తో పెండ్లి జరిగి మూడేండ్లు అవుతుంది. ఇద్దరూ కలిసి మెలిసి అన్యోన్యంగానే ఉంటున్నారు. కానీ ఈ మధ్య కాలంలో మాధవికి రంజిత్‌పై అనుమానం వచ్చింది. వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడేమో అనిపిస్తుంది. ఆ అమ్మాయి ఇంకెవరో కాదు మాధవి స్నేహితురాలు లత. కానీ ఈ విషయం గురించి ఆమె లతను నేరుగా అడగలేకపోతుంది. అలా నేరుగా అడిగితే ఆమె ఏమనుకుంటుందో, ఇద్దరి మధ్య స్నేహం చెడిపోతుందేమో అనే భయంతో ఆమెను అడగలేక పోయింది. అలాగే భర్త రంజిత్‌ను కూడా అడగలేక పోయింది. ఎందుకంటే అతను ఆమెను బాగా చూసుకుంటాడు. ఎలాంటి లోటు లేకుండా, చిన్న కష్టం కూడా రాకుండా, ఆమె అడగక ముందే కావల్సినవన్నీ తెచ్చిపెడతాడు. అప్పుడప్పుడు బయటకు కూడా తీసుకెళుతుంటాడు. అలాంటి వ్యక్తికి తన భార్య అనుమానిస్తుంది అని తెలిస్తే ఆ ప్రేమ ఎక్కడ దూరం అవుతుందో అని భయంతో ఎటూ తేల్చుకోలేక పోయింది.

లత, మాధవికి మంచి స్నేహితురాలు. ఆమే వీరిద్దరికీ దగ్గరుండి పెండ్లి కూడా చేసింది. ముగ్గురూ మంచి స్నేహితులు. ఫంక్షన్లకి, పండగలకీ ఒకరి ఇంటికి ఒకరు వెళుతూ ఒక కుటుంబంలా కలిసి ఉండేవారు. అలాంటి వారిని అనుమానించడం సరైన పద్ధతి కాదనే ఆలోచన వచ్చింది. మా దగ్గరకు వచ్చి ఈ విషయం చెప్పుకొని ఎంతో బాధపడింది. ఆమె చెప్పింది మొత్తం విన్న తర్వాత మేము లతను పిలిచి మాట్లాడాము.

'మేము కేవలం మంచి స్నేహితులం. అంతకు మించి మా మధ్య ఎలాంటి సంబంధం లేదు. అయినా మా మీద మాధవికి అనుమానం ఎందుకు వచ్చింది' అన్నది. దానికి మేము 'అలాంటప్పుడు రంజిత్ చేతిపై మీ పేరు ఎందుకు ఉంది. మీరిద్దరూ చాట్ చేసుకోవడం, ఫోన్‌లు మాట్లాడుకోవడం ఎందుకు' అని అడిగాము. 'మేమిద్దరం కాలేజీలో స్నేహితులం. ఆ విషయం మాధవికి కూడా తెలుసు. ఆ స్నేహంతో నేనే వారిద్దరికి పెండ్లి చేశాను. మాధవి, రంజిత్ బాగుండాలనే ఉద్దేశంతోనే వారిద్దరికి దగ్గరుండి మరీ పెండ్లి చేశాను. రంజిత్ కూడా మాధవిని ఎంతో ప్రేమగా చూసుకుంటాడు. ఈ విషయం మీరు ఆమెనే అడగండి' అంది.

'మాధవికి రంజిత్‌తో ఎలాంటి సమస్యాలేదు. మీ వల్లనే ఆమె ఇబ్బంది పడుతుంది. మీకూ రంజిత్‌కి మధ్య స్నేహం మాత్రమే కాకుండా సంబంధం ఉందనుకుంటుంది. ఈ విషయం మిమ్మల్ని అడగటానికి ఇబ్బంది పడుతుంది. అందుకే మా దగ్గరికి వచ్చింది. మీరు నిజంగా మీ స్నేహితురాలి మంచి కోరుకుంటే నిజం చెప్పండి. ఆమెను మోసం చేయడం కరెక్టు కాదు' అన్నాము.

'మేము కాలేజీ రోజుల్లోనే రెండేండ్లు రిలేషన్‌లో ఉన్నాము. జాబ్ వచ్చిన తర్వాత ఇద్దరం పెండ్లి చేసుకోవాలనుకున్నాం. కానీ మా ఇంట్లో పెండ్లికి ఒప్పుకోకపోవడంతో వేరే వ్యక్తిని పెండ్లి చేసుకోవల్సి వచ్చింది. నాకు ఇష్టం లేకపోయినా బలవంతంగా ఆ పెండ్లి చేసుకున్నాను. మా ఇంట్లో ఒప్పుకోవడం లేదని చెబితే రంజిత్ కూడా 'మీ ఇంట్లో వాళ్లకు నచ్చినట్టే చెయ్యి, నువ్వు ఎక్కడున్నా సంతోషంగా ఉంటే చాలు' అంటూ నా జీవితంలో నుండి వెళ్లిపోయాడు. అయితే తర్వాత రంజిత్ మానసికంగా చాలా నలిగిపోయాడు. అతన్ని అలా చూడలేక పోయాను. నేను రంజిత్ నుండి దూరంగా వచ్చి మూడేండ్లు అయినా పెండ్లి చేసుకోకుండా నా గురించి ఆలోచిస్తూ దిగులుగా ఉండేవాడు. ఎలాగైనా రంజిత్‌ను మళ్లీ మామూలు మనిషిని చేయాలనుకున్నాను. నా స్నేహితురాలైన మాధవితో రంజిత్‌కి పెండ్లి అయ్యేలా చేశాను. ఇద్దరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ ఇన్నేండ్ల తర్వాత రంజిత్ నా ముందుకు రావడం, అతనితో తిరిగి క్లోజ్‌గా మాట్లాడడం, నా పర్సనల్ జీవితంలో ఉన్న లోటు నన్ను అతని వైపు ఆకర్షించేలా చేశాయి. అయితే రంజిత్‌కు మాత్రం నాపై ఎలాంటి ఫీలింగ్స్ లేవు. నా పెండ్లి అయినప్పటి నుండి నన్ను ఎప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. కేవలం ఓ స్నేహితురాలిగానే చూస్తున్నాడు. ఇందులో రంజిత్ తప్పేమీ లేదు. నా భర్త నన్ను సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల నేనే రంజిత్‌కు దగ్గరయ్యే ప్రయత్నం చేశాను' అని చెప్పింది.

'లత మీరు చాలా పెద్ద తప్పు చేస్తున్నారు. స్నేహం పేరుతో మాధవిని మోసం చేయాలని చూస్తున్నారు. మీకు భర్తతో రిలేషన్ సరిగా లేకపోతే అతనితో మాట్లాడి మీ సమస్య పరిష్కరించుకోవాలి. అలా కాకుండా మీరు రంజిత్‌కి దగ్గరవ్వాలని చూడడం సరైనది కాదు. అతను నిరాకరించాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే మీ రెండు కుటుంబాలు ఎంత ఇబ్బంది పడేవి. ఇప్పటికైనా మాధవి మా దగ్గరకు వచ్చింది కాబట్టి మీరు ఒప్పుకున్నారు. కానీ మీరు చేస్తుంది తప్పు అనే విషయం మీకు తెలియడం లేదు. మీ వల్ల మాధవి ఎంత బాధపడిందో ఒక్కసారి ఊహించుకోండి. మీరే పెండ్లి చేసి మీరే ఆమె బాధకు కారణం అవుతున్నారు' అన్నాము.

'మాధవి బాధపడితే నేను చూడలేను. రంజిత్ బాధపడినా చూస్తూ ఉండలేను. ఇకపై రంజిత్‌తో మాట్లాడడం తగ్గిస్తాను. అంతకు ముందులా స్నేహితురాలిగానే ఉంటాను. వాళ్లిద్దరూ సంతోషంగా ఉంటే చాలు' అన్నది. మేము మాధవిని పిలిచి 'మీరు ఇక్కడి నుండి వేరే ఇంటికి మారండి. రంజిత్ ఆఫీసుకు దగ్గరలో ఇల్లు చూసుకోండి. నీ భర్త మంచివాడు. గడిచిపోయిన జీవితం గురించి అతను ఆలోచించడం లేదు. మీతో సంతోషంగా ఉంటున్నాడు. అతని దృష్టిలో లత కేవలం ఓ స్నేహితురాలు మాత్రమే. కాబట్టి మీరు లేని పోని అనుమానం పెట్టుకొని బాధపడకండి. మీ భర్తను బాధపెట్టకండి' అని చెప్పి పంపించాము.

లతతో 'మీరు మీ భర్తను తీసుకొని మా దగ్గరకు రండి. ఒకసారి అతనితో మాట్లాడతాము. మీ ఇద్దరి మధ్య ఎలాంటి సమస్య ఉన్నా మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. అంతే గానీ మీ జీవితంలోకి మరో వ్యక్తికి అవకాశం ఇచ్చి లేనిపోని సమస్యలు తెచ్చుకోవద్దు' అని సర్దిచెప్పాము.

మేము కాలేజీ రోజుల్లోనే రెండేండ్లు రిలేషన్‌లో ఉన్నాము. జాబ్ వచ్చిన తర్వాత ఇద్దరం పెండ్లి చేసుకోవాలనుకున్నాం. కానీ మా ఇంట్లో పెండ్లికి ఒప్పుకోక పోవడంతో వేరే వ్యక్తిని పెండ్లి చేసుకోవల్సి వచ్చింది. నాకు ఇష్టం లేకపోయినా బలవంతంగా ఆ పెండ్లి చేసుకున్నాను. మా ఇంట్లో ఒప్పుకోవడం లేదని చెబితే రంజిత్ కూడా 'మీ ఇంట్లో వాళ్లకు నచ్చినట్టే చెయ్యి, నువ్వు ఎక్కడున్నా సంతోషంగా ఉంటే చాలు' అంటూ నా జీవితంలో నుండి వెళ్లి పోయాడు.

- వై వరలక్ష్మి
9948794051

సముద్రంలో సాహస యాత్ర

గోలి శ్యామల... కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఈ 52 ఏండ్ల మహిళ ఇటీవలె అరుదైన ఘనతను సాధించారు. వైజాగ్ నుండి కాకినాడ వరకు బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈది చరిత్రకెక్కారు. ఐదు రోజుల పాటు ఆమె సాహస యాత్ర సాగింది. డిసెంబర్ 28న వైజాగ్ ఆర్.కె బీచ్ నుండి మొదలై కాకినాడలోని ఎన్టీఆర్ బీచ్‌లో జనవరి 1న ముగిసింది. ఇలాంటి విజయాలను అలవోకగా అందుకోవడం ఆమెకు కొత్తేమీ కాదు.



ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న శ్యామలకు సముద్రాలు ఈదడం హాబీ. ఈ ఐదు రోజుల పాటు ఆమె భద్రత, విజయాన్ని నిర్థారించేందుకు ఒక డాక్టర్, ఫిజియోథెరపిస్ట్, ఫీడర్‌లు, స్క్యూబా డైవర్లు, కయాకర్‌లతో సహా 12 మంది సభ్యులు, రెండు పెద్ద పడవలు, ఒక చిన్న నౌక ఆమె వెంట సాగాయి. అంతకు ముందు తమిళనాడు-శ్రీలంక నార్త్ ప్రావిన్స్‌ను అనుసంధానించే పాల్క్ స్ట్రెయిట్‌ను 13 గంటల 43 నిమిషాల్లో అధిగమించి ఈ ఘనతను సాధించిన రెండో మహిళగా శ్యామల నిలిచారు. గతంలో రామసేతు సమీపంలో అలవోకగా ఈ సాహసాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అమెరికాలోని కాటలినా ఐలండ్ నుంచి లాస్ ఏంజిలిస్ వరకు ఇలాంటి సాహసాన్ని పూర్తి చేశారు. కాటలినా ఐలండ్ నుంచి లాస్ ఏంజిలిస్ వరకు గల 36 కిలోమీటర్ల దూరాన్ని 12 డిగ్రీల టెంపరేచర్‌లో 19 గంటల్లో అధిగమించారు. లక్ష ద్వీపంలో కీల్టన్ ఐలండ్-కద్మట్ ఐలండ్, హుగ్లీ,గంగ, భాగీరథీ నదుల్లో ఈది రికార్డు సృష్టించిన చరిత్ర శ్యామలది.



శ్యామల కేవలం స్విమ్మర్ మాత్రమే కాదు సృజనాత్మక కలిగిన దర్శకురాలు, రచయిత కూడా. అయితే తన యానిమేషన్ స్టూడియో సక్సెస్ కాకపోవడంతో ఆమె స్విమ్మింగ్‌లోకి ఎంట్రా ఇచ్చారు. వేసవి ఈత శిబిరాల్లో పాల్గొనడం ద్వారా మరింత ఆసక్తి పెరిగింది. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ గురించి అవగాహన కల్పించడం, ప్రజలను ప్రోత్సహించడం ఆమె లక్ష్యంగా మారింది.

స్విమ్మింగ్ విజయాలు

పాక్ స్ట్రెయిట్: 13 గంటల 43 నిమిషాల్లో 30 కిలోమీటర్లు ఈదుతూ, ఈ ఘనత సాధించిన రెండో మహిళగా నిలిచారు.

కాటాలినా ఛానల్: కాటాలినా ద్వీపం నుండి లాస్ ఏంజిల్స్ వరకు 36 కిలోమీటర్లు 19 గంటల్లో గడ్డకట్టే 13డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య స్విమ్మింగ్ చేశారు.

లక్షద్వీప్: లక్షద్వీప్ టూరిజంను ప్రోత్సహించాలని ప్రధాని ఇచ్చిన పిలుపుతో స్ఫూర్తి పొంది కిల్టన్ ద్వీపం నుండి కద్మత్ ద్వీపానికి 18 గంటల్లో 48 కిలోమీటర్లు ఈదారు.

స్విమ్మింగ్ చేసిన నదులు

- కృష్ణానది - 1.5 కి.మీ
- హుగ్లీ నది - 14 కి.మీ
- గంగానది - 13 కి.మీ
- భాగీరథి నది - 81 కి.మీ

తప్పులు చేసి ఉండొచ్చు

(మొదటిపేజీ తరువాయి)


తన పదవీకాలం, అంతర్జాతీయ వ్యవహారాలు, రాజకీయాలపై ఈ ఎపిసోడ్‌లో కామత్‌తో ప్రధాని మోడీ ముచ్చటించడం కన్పించింది. 'ప్రధానితో ప్రజలు' శీర్షికన రూపొందించిన పాడ్కాస్ట్‌లో మోడీతో కామత్ అరుదైన సంభాషణ జరిపారు. 'పాడ్కాస్ట్‌లో పాల్గొనడం నాకు ఇదే మొదటిసారి' అని మోడీ అంగీకరించారు.అంతర్జాతీయ ఉద్రిక్తతలు, జరుగుతున్న యుద్ధాలపై భారత్ వైఖరి వంటి అంశాలను మోడీ ప్రస్తావించారు. 'ఈ సంక్షోభంలో మేము తటస్థులం కాదని పదేపదే చెప్పాము. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను. నేను శాంతి వైపే ఉంటాను' అని ఆయన అన్నారు. ఎపిసోడ్‌కు సంబంధించిన పూర్తి ఇంటర్వ్యూ త్వరలోనే కామత్ ఛానల్‌లో కన్పిస్తుంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను చేసిన ఓ ప్రసంగాన్ని మోడీ పాడ్కాస్ట్‌లో ప్రస్తావించారు. 'తప్పులు అనేవి అనివార్యం. నేను కూడా తప్పులు చేసి ఉండవచ్చు. నేను మానవ మాత్రుడిని. దేవుడిని కాను' అని వ్యాఖ్యానించారు. మోడీ 2.0 కంటే మోడీ 1.0 ఎలా భిన్నమైనదని కామత్ ప్రశ్నించగా 'మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు నన్ను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు. నేను కూడా ఢిల్లీని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించా' అని మోడీ అన్నారు. రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటున్న వారికి సలహా ఇస్తూ 'ప్రజలు ఒక సంకల్పంతో ముందుకు రావాలే తప్ప కోరికతో కాదు' అని చెప్పారు. మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తూనే ఉండాలని మోడీ సలహా ఇచ్చారు.

కుల-మత వివక్షే ప్రధాన సమస్య

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించడం జరిగింది.

కుల, జాతి వివక్షలే కారణం




బంగ్లాదేశ్, ఫ్రాన్స్, భారత్, నైజీరియా, శ్రీలంక దేశాల్లోని సగం మంది లేదా అంతకంటే ఎక్కువ మంది మత వివక్ష పెద్ద సమస్యేనని అభిప్రాయపడ్డారు. మన దేశంలో 57 శాతం మంది మత వివక్ష పెద్ద సమస్య అని చెబుతుంటే 14 శాతం మంది ఓ మాదిరి సమస్య అని అన్నారు. కాగా తాము నివసిస్తున్న దేశాల్లో జాతి వివక్ష అధికంగా ఉన్నదని 34 శాతం మంది చెప్పగా 34 శాతం మంది ఆ సమస్య మధ్యస్థంగా ఉన్నదని తెలిపారు. కుల, జాతి వివక్షల కారణంగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయని 28 శాతం మంది భారతీయులు చెప్పారు. మరో 28 శాతం మంది ఈ అసమానతలు మధ్యస్థ స్థాయిలో ఉన్నాయని అన్నారు. అసమానతలకు సంపన్నుల రాజకీయ ప్రభావమే కారణమని భారతీయుల్లో 79 శాతం మంది స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను 72 శాతం మంది తప్పుపట్టారు. దేశంలో కొందరు బాగా కష్టించి పనిచేయడం, మరికొందరు చేయకపోవడం ఆర్థిక అసమానతలకు దారి తీస్తోందని 32 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఊసరవెల్లి సిగ్గుపడేలా మాటమార్చిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

టికెట్ రేట్లు, అదనపు షోలకు అనుమతివ్వడం సభను అవమానించడమేనని తెలిపారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతామని వెల్లడించారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? అని ప్రశ్నించారు. గతంలో సీఎం బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతిచ్చినందునే ఒక మహిళ మరణించి, మరో పసివాడు ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని గుర్తుచేశారు. ఈ పాపం రేవంత్ సర్కారుదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్? దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి? అని నిలదీశారు.

డాలర్@86



ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రోజు రోజుకు రూపాయికి విలువ లేకుండా పోతోంది. తాజాగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 86కు క్షీణించి.. దేశ చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయిని చవి చూసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో తడబడుతున్న రూపాయిని నిలబెడుతామని 2014 ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ఇచ్చిన వాగ్దానాలకు.. ప్రస్తుత వాస్తవ పరిస్థితులు తీవ్ర భిన్నంగా ఉన్నాయి. పదేండ్ల క్రితం డాలర్‌తో రూపాయి మారకం విలువ 64 దిగువన ఉండగా.. ప్రస్తుతం ఈ విలువ అమాంతం పడిపోవడం తీవ్ర ఆందోళనకరం. శుక్రవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పతనమై 86కు పరిమితమయ్యింది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.88 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో స్వల్పంగా పుంజుకుని 85.85 వద్ద ట్రేడింగ్ కాగా.. తుదకు 14 పైసలు కోల్పోయి 86 వద్ద ముగిసింది. గురువారం సెషన్‌లోనూ 17 పైసలు తగ్గి 85.86 వద్ద నమోదయ్యింది. భవిష్యత్తు సమీపంలో మరింత పతనమయ్యే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో దిగుమతులు, విదేశీ అప్పు చెల్లింపులు, వాణిజ్య చెల్లింపులు తీవ్ర భారం కానున్నాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగనుంది.

స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 1.96 శాతం పెరిగి 78.43 డాలర్ల వద్ద ట్రేడింగ్ అయ్యింది. వారాంతం సెషన్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 241.30 పాయింట్లు లేదా 0.31 శాతం నష్టంతో 77,378.91కి పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95 పాయింట్లు లేదా 0.40 శాతం తగ్గి 23,431 వద్ద ముగిసింది. దీంతో వరుసగా మూడు రోజులు నష్టాలు చవి చూసినట్లయ్యింది.

ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడానికి తోడు భారత విదేశీ మారకం నిల్వలు వరుసగా ఐదో వారంలోనూ కరిగిపోయాయి. జనవరి 3తో ముగిసిన వారంలో 5.7 బిలియన్ డాలర్లు తరిగిపోయి 634.58 బిలియన్ డాలర్లకు పరిమితమయినట్లు ఆర్బీఐ వెల్లడించింది. ఇది 10 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఇంతక్రితం నాలుగు వారాల్లో 17.8 బిలియన్ డాలర్లు క్షీణించాయి. 2024 సెప్టెంబర్‌లో ఆల్‌టైం గరిష్ట స్థాయి 704.89 బిలియన్ డాలర్లుగా ఉన్న మారకం నిల్వలు.. అప్పటి నుంచి దాదాపు 70 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6 లక్షల కోట్లు) విలువ చేసే విదేశీ మారకం నిల్వలు తగ్గిపోయాయంటే పరిస్థితి తీవ్రత స్పష్టమవుతోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో చిక్కుకోనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత జీడీపీ 6.6 శాతానికి మందగింపు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది 2025లో భారత జీడీపీ 6.6 శాతానికి మందగించే అవకాశాలున్నాయని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. 2024లో 6.9 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. వచ్చే 2026లోనూ 6.7 శాతానికే పరిమితం కావొచ్చని తన 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి మరియు అంచనా రిపోర్ట్'లో విశ్లేషించింది. అదే జరిగితే వరుసగా మూడేండ్లలో ఏడు శాతం లోపే వృద్ధి చోటు చేసుకోనుంది. కరోనా తర్వాత 2023లో 8 శాతం వృద్ధి నమోదయ్యింది. 'కోవిడ్ సంక్షోభం తర్వాత తగ్గిన డిమాండ్ కారణంగా గత మూడు సంవత్సరాలలో భారత్ అధిక జీడీపీ వృద్ధిని నమోదు చేసిందని ఐక్యరాజ్యసమితి ఆసియా, పసిఫిక్ ఆర్థిక, సామాజిక కమిషన్ (యూఎస్ఈఎస్సీఏపీ) మాజీ డైరెక్టర్ నగేష్ కుమార్ అన్నారు. తాజాగా తిరిగి కోవిడ్ పూర్వ ధోరణికి తిరిగి వచ్చామన్నారు. ఇటీవల కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం.. జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జీడీపీ 5.4 శాతానికి క్షీణించింది. ఇది దాదాపు రెండేళ్ల కనిష్ట స్థాయి.

తయారీ కార్యకలాపాలు పేలవంగా ఉండటం వల్ల జీడీపీ భారీగా తగ్గింది. ఈ స్థాయి వృద్ధి తగ్గుదలను అంచనా వేయలేదని ఆర్బీఐ ఎంపీసీ సభ్యుడు అయినా నగేష్ కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆర్థిక వృద్ధి మందగించడానికి ప్రయివేటు పెట్టుబడి నెమ్మదించడమే ప్రధాన కారణమన్నారు. అధిక వడ్డీ రేట్లు కూడా ఓ కారణం కావొచ్చన్నారు. ద్వితీయార్థంలో జీడీపీ పుంజుకునే అవకాశాలున్నాయన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

ప్రపంచ వృద్ధి రేటులోనూ స్తబ్దత చోటు చేసుకోవచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ప్రస్తుత ఏడాది 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.8 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2024లోనూ ఇదే స్థాయిలో చోటు చేసుకుందని ముందస్తు అంచనా వేసింది. ఇప్పటికీ అనిశ్చితి పెద్ద ఎత్తున ఉందని తెలిపింది. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, పెరిగిన రుణ వ్యయాల నుండి వచ్చే ప్రమాదాలు పొంచి ఉన్నాయని విశ్లేషించింది. ఈ సవాళ్లు ముఖ్యంగా తక్కువ ఆదాయం, దుర్బల దేశాలపై తీవ్ర ప్రతికూలతను చూపనున్నాయని విశ్లేషించింది. ఈ పరిణామాలు ప్రపంచ అభివృద్ధి పురోగతిని దెబ్బతీయనున్నాయని హెచ్చరించింది.

త్వరలో స్పౌజ్ టీచర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించారు. వివిధ రూపాల్లో ఉద్యమాలు జరిగాయి. అధికారంలోకి వస్తే 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. అందుకనగుణంగా 317 జీవో బాధితుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రి దామోదర రాజనర్సింహ చైర్మెన్‌గా మంత్రులు పొన్నం ప్రభాకర్, డి శ్రీధర్‌బాబులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ కమిటీ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చించింది. బాధిత ఉద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. న్యాయ నిపుణులతో పలు అంశాలపై చర్చించి గతేడాది అక్టోబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను సమర్పించింది. దానిపై మంత్రివర్గంలో చర్చించి గతేడాది నవంబర్ 30న స్పౌజ్ బదిలీలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పౌజ్ (భార్యాభర్తలు), పరస్పర (మ్యూచువల్), వైద్య కారణాలున్న వారి బదిలీలకు అవకాశం కల్పించింది. అందులో భాగంగా విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు కూడా స్పౌజ్ బదిలీలు జరగనున్నాయి. సుమారు 850 మంది ఉపాధ్యాయ భార్యాభర్తలు ఒకేచోట పనిచేసే అవకాశం కలగనుంది. 2023 జనవరిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలను గత ప్రభుత్వం చేపట్టింది. 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను చేపట్టలేదు. దీంతో 1,500 మంది ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీలు స్పౌజ్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. వారు బదిలీల కోసం అనేకసార్లు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. మంత్రులు, అధికారులకు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిలో సుమారు 850 మంది స్పౌజ్ బదిలీలను చేపట్టేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. ఇంకోవైపు విద్యాసంవత్సరం మధ్యలో వారిని బదిలీ చేస్తే బోధనపై ప్రభావం పడుతుందనీ, విద్యార్థులు నష్టపోతారన్న అభిప్రాయం వినిపిస్తున్నది. దీనిపై సమగ్రంగా చర్చించి విద్యార్థులకు నష్టం కలగకుండా ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకునే అవకాశమున్నది. అందుకనుగుణంగానే త్వరలోనే ఉత్తర్వులు వెలువడతాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన స్పౌజ్ బదిలీలు కూడా ఆ తర్వాత నిర్వహించే అవకాశమున్నట్టు తెలిసింది.

విద్యాశాఖ కార్యదర్శిగా యోగితారాణా బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇతర అధికారులు, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు పరిధిలో ప్రస్తుతం ఉన్న సమస్యలపై వారు చర్చించారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ గురించి చర్చకు వచ్చింది. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. వాటి గురించి అధికారులు వివరించారు. ఎప్‌సెట్ సహా వివిధ ప్రవేశ పరీక్షల తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదానికి పంపించిన విషయం తెలిసిందే. వాటి గురించి యోగితారాణాకు శ్రీరాం వెంకటేశ్ గుర్తు చేశారు. ఇంకోవైపు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం కావాల్సి ఉందనీ, దాని గురించి ప్రస్తావించినట్టు తెలిసింది.

టీఎస్‌యూటీఎఫ్ అభినందనలు

విద్యాశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన యోగితా రాణాను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, కోశాధికారి టి లక్ష్మారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. సంఘం డైరీని బహూకరించారు. నూతన కార్యదర్శి ఆధ్వర్యంలో సర్వీసు నిబంధనల సమస్యను పరిష్కరించి పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పైఅధికారుల ఆదేశం మేరకే డబ్బులు బదిలీ చేశా

(మొదటిపేజీ తరువాయి)

రూ.55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేసే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి తీసుకోవాలని తెలియదా? అనే ప్రశ్నకు ఆయన సమాధానమివ్వలేదని తెలిసింది. దీని ఫలితంగా రూ.8 కోట్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి జరిమానాను ఆర్బీఐ విధించింది కదా అన్న ప్రశ్నకు కూడా.. తాను ఉన్నతాధికారుల అనుమతి మేరకే చేశానని బీఎల్ఎన్ రెడ్డి సమాధానమిచ్చినట్టు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణలో తాను నిర్వహించిన పాత్ర పూర్తిగా ఉన్నతాధికారుల సూచనతోనేనని ఆయన మరో ప్రశ్నకు సమాధానమిచ్చినట్టు తెలిసింది. విదేశీ కంపెనీకి డబ్బులు బదలాయించే విషయమై అప్పటి మంత్రి కేటీఆర్ మీకు ఆదేశాలిచ్చారా? లేక అప్పటి హెచ్ఎండీఏ కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశాల మేరకు చేశారా? అని ఏసీబీ ప్రశ్నించగా.. తాను పైవారి మాట మేరకే చేశానని చెప్పినట్టు సమాచారం. కాగా, ఆరున్నర గంటల పాటు బీఎల్ఎన్ రెడ్డిని విచారించిన ఏసీబీ అధికారులు అంతకముందు కేటీఆర్, అరవింద్ కుమార్‌లను విచారించిన సందర్భంలో వెల్లడైన అంశాలను జోడించి బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈయన విచారణలో సైతం ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి కొన్ని కీలకాంశాలను ఏసీబీ అధికారులు రికార్డు చేసినట్టు సమాచారం. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని బీఎల్ఎన్ రెడ్డికి అధికారులు చెప్పారు.

కేటీఆర్‌పై మరో కేసు నమోదు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫార్ములా ఈ-రేస్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మరో కేసు నమోదైంది. గురువారం ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్ అనంతరం ర్యాలీగా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. అయితే ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఆయనపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేటీఆర్‌తో పాటు మరో ఐదుగురు.. బాల్క సుమన్, మన్నె గోవర్ధన్, జయసింహ, క్రిశాంక్ గెల్లు శ్రీనివాస్‌పై 221,292,126(2),r/w 3(5) భారతీయ న్యాయ సంహిదాన్ శిక్ష స్మృతి ప్రకారం కేసులు నమోదు చేశారు.

ప్రజా ఉద్యమాల సారథి.. రైతాంగ పోరాటాల వారధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో సమరశీల రైతు పోరాటాలు

- మల్లన్నసాగర్, నిమ్జ్ నిర్వాసితులకు అండగా ఎర్రజెండా
- సింగూరు జలాల కోసం కొట్లాట.. ధరణి సమస్యల ఆందోళనలు
- సింగూరు జలాలు మెతుకు సీమ హక్కు: గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా ఉద్యమాల సారథి... రైతాంగ పోరాటాల వారిధిగా సీపీఐ(ఎం) నిలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ అనేక సమరశీల రైతు ఉద్యమాల్ని నడిపింది. ఊర్లకు ఊర్లను ఖాళీ చేయించి రోడ్డున పడేసిన మల్లన్న సాగర్ ముంపు బాధితుల కన్నీళ్లు తుడిచి న్యాయం జరిగే వరకు అండగా నిలిచింది. అరెస్టులు, జైళ్లను ఖాతరు చేయకుండా నిర్వాసితుల పక్షమే నిలబడింది. నిమ్జ్ పేర పరిశ్రమల కోసం వేలాది ఎకరాల్ని అప్పనంగా లాక్కుంటే మెరుగైన పరిహారం ఇచ్చే వరకు భూములివ్వబోమంటూ బాధిత రైతులకు భరోసాగా సీపీఐ(ఎం) నిలిచింది. సింగూరు జలాలు మెతుకు సీమ హక్కు అని నినదిస్తూ నీటి కేటాయింపులు చేసి సాగునీరివ్వాలని అన్నదాతల గొంతుకైంది. అక్రమాల పుట్ట ధరణి అవకతవకలను సరిచేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలని పాదయాత్రలు, ఆందోళనలు నిర్వహించింది. త్రిబుల్ ఆర్ నిర్వాసితుల పోరాటాలకూ సీపీఐ(ఎం) అండగా నిలిచింది. మార్కెట్, మద్దతు ధరలు, ఎరువులు, కల్తీ విత్తనాలు, కరువు కాటకాల వంటి సమస్యలపై సైతం సీపీఐ(ఎం) రైతుల వెన్నంటి ఉండి పరిష్కారానికి చొరవ చూపింది.

మల్లన్న సాగర్ పోరులో జైలు

మల్లన్నసాగర్ జలాశయ నిర్మాణం కోసం ఏటిగడ్డకిష్టాపూర్, రాంపూర్, ఎర్రవెల్లి, సింగారం, బ్రహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహడ్, వేములఘాట్ వంటి గ్రామాల్లో సర్వం కోల్పోయిన నిర్వాసితులతో 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) కొట్లాడింది. సర్వం కోల్పోయిన రైతులు, కూలీలు, వృత్తిదారులకు చట్ట ప్రకారం నష్టపరిహారం, పునరావాసం, ఇతర బెనిఫిట్స్ కల్పించాలని సీపీఐ(ఎం) అనేక పోరాటాలు నడిపింది. అప్పటి ప్రభుత్వం కక్షకట్టి లాఠీలు ఝుళిపించినా పోరుబాట వదల్లేదు.

నిర్వాసితుల పక్షాన కొట్లాడిన నాయకుల్ని అరెస్టు చేసి జైల్లో నెట్టినా తగ్గలేదు. సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నాయకులు ఎ.మల్లేశం, గొడ్డుబల్ల భాస్కర్ 14 రోజుల పాటు జైలుకెళ్లారు. ఎర్రజెండా పోరాడిన ఫలితంగా రైతులతో పాటు కూలీలు, వృత్తిదారులకు సైతం అన్ని రకాల బెనిఫిట్స్ అందజేసేందుకు సర్కార్ అంగీకరించాల్సి వచ్చింది.

ఎర్రజెండా పోరాటం వల్లే నిమ్జ్ రైతులకు న్యాయం

జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్) కోసం 12 వేల ఎకరాల భూముల్ని సేకరించాలని గుర్తించారు. జహీరాబాద్ ప్రాంతంలోని పలు మండలాల్లోని అనేక గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతుల భూముల్ని సేకరించడంతో సీపీఐ(ఎం) రైతుల్ని సమీకరించింది. చట్ట ప్రకారం పరిహారంతో పాటు అదనపు బెనిఫిట్స్ కల్పించాలని నిర్వాసిత గ్రామాల్లో పాదయాత్ర చేసింది. అధికారులపై వత్తిడి తెచ్చేందుకు జిల్లా కలెక్టరేట్ వరకు కూడా పాదయాత్ర చేశారు. న్యాయపోరాటం సాగించి భూములకు మెరుగైన పరిహారం దక్కేలా ఎర్రజెండా పోరాడింది. ఇప్పటికీ నిమ్జ్ భూ బాధితులు సీపీఐ(ఎం) వెనకాలే ఉంటున్నారు.

సాగునీటి కోసం పోరాటం

17 టీఎంసీల నీటిని ఇతర జిల్లాలకు తరలిస్తున్న పాలకులు మెతుకు సీమ మెదక్ జిల్లాకు సింగూర్ జలాల్ని కేటాయించాలని, రైతాంగానికి సాగునీటి వనరులు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) అనేక ఉద్యమాల్ని నడిపింది.

సుదీర్ఘ పాదయాత్ర ఫలితంగా నీటి కేటాయింపు జరిగినా అవి సద్వినియోగం కాలేదు. ఎడమ కాల్వకు నీళ్లివ్వాలని కూడా కొట్లాడింది. అదే విధంగా కరువు ప్రాంతంగా ఉన్న జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు సాగునీటి కోసం సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టు పథకాల్ని చేపట్టాలని ఆందోళనలు చేసింది. సీపీఐ(ఎం), రైతుల పోరాటాలతో గత ప్రభుత్వం ఆ రెండు లిఫ్టులకు నిధులు కేటాయించింది.

ధరణీ అవకతవకలు.. సమస్యలపై

ధరణీ వచ్చాక రైతులకు పట్టాదారు పాస్తుకాలు రాకుండా ఆగిపోయాయి. రైతుల పేరిట ఉన్న భూముల్ని నిషేధిత జాబితాలో చేర్చడం, వోల్డ్‌లో పెట్టడం వంటి సమస్యలపై సీపీఐ(ఎం) అధ్యయనం చేసింది. మునిదేవునిపల్లి గ్రామ రైతుల సమస్యలపై కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. మాందాపూర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేసిన తర్వాత ఆ రెండు ప్రాంతాల రైతులకు పట్టాదారుల పుస్తకాలు జారీ చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో బిడకన్నె, మాచిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి వంటి గ్రామాల రైతుల సమస్యలపై ఆందోళనలు చేసి న్యాయం చేకూరేలా చేశారు.

సింగూరు జలాలు జిల్లా హక్కు



సింగూరు ప్రాజెక్టు జిల్లాలో ఉన్నప్పటికీ ఈ ప్రాంత అవసరాలకు సాగు, తాగునీటికి కేటాయింపులు సరిగ్గాలేదు. సీపీఐ(ఎం) మాత్రమే సింగూరు జలాల కోసం కొట్లాడింది. కేటాయింపులు చేసిన మేరకు వినియోగించుకునేందుకు అవసరమైన నీటి వనరుల్ని అభివృద్ధి చేయాలి. పెండింగ్ ప్రాజెక్టుల్ని సత్వరమే పూర్తి చేయాలని పోరాడుతున్నాం.

త్రిబుల్‌ఆర్ భూ సమస్యపైన కూడా రైతులకు అండగా ఉన్నాం. రాష్ట్ర మహాసభల్లో తీసుకునే కర్తవ్యాలను మరింత ముందుకు తీసుకెళ్తాం.

-గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి



సెమీస్‌లో సాత్విక్ జోడీ

మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్

కౌలాలంపూర్ : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ మలేసియా ఓపెన్ పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మలేషియా షట్లర్లపై 26-24, 21-15తో సాత్విక్, చిరాగ్‌లు వరుస గేముల్లో గెలుపొందారు. 50 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో తొలి గేమ్ సూపర్ టైబ్రేకర్‌లో తేలింది. నేడు జరిగే సెమీఫైనల్లో దక్షిణ కొరియా జోడీ కిమ్, సియోలతో సాత్విక్, చిరాగ్‌లు పోటీపడనున్నారు.

ప్రతిక ఫటాఫట్

ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం



రాజ్‌కోట్ : ఐర్లాండ్‌తో తొలి వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుక్రవారం రాజ్‌కోట్‌లో జరిగిన మహిళల తొలి వన్డేలో భారత యువ బ్యాటర్ ప్రతిక రావల్ (89, 96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) సూపర్ ఇన్నింగ్స్‌తో సత్తా చాటింది. కెప్టెన్ స్మృతీ మంధాన (41), తేజల్ (53 నాటౌట్) సైతం రాణించటంతో 239 పరుగుల లక్ష్యాన్ని భారత్ (241/4) 34.3 ఓవర్లలోనే ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ అమ్మాయిలు గాబీ లూయిస్ (92, 129 బంతుల్లో 15 ఫోర్లు), లీ పాల్ (59) రాణించటంతో 50 ఓవర్లలో 238/7 పరుగులు చేసింది. భారత్, ఐర్లాండ్ మహిళల రెండో వన్డే ఆదివారం జరుగనుంది.

జితేందర్ రెడ్డిని తప్పించాలి!

శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు పదవి నుంచి ఏపీ జితేందర్ రెడ్డిని తప్పించాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) మాజీ చైర్మెన్ ఏపీ జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. 'సీఎం వారించినా, అర్హత లేకపోయినా జితేందర్ రెడ్డి టీఓఏలో తలదూర్చాడు. జాతీయ క్రీడల్లో పోటీపడే రాష్ట్ర క్రీడాకారులు అయోమయంలో పడ్డారు. జితేందర్ రెడ్డి తక్షణమే ఐఓఏ అధ్యక్షుడిగా తప్పుకుని ఒలింపిక్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరిగేలా చూడాలి. సలహాదారుగా అందరిని ఏకం చేయాల్సింది పోయి.. తానే ఓ సంఘంలో జోక్యం చేసుకుని వివాదాలు సృష్టించటం ఎంత వరకు సబబు' అని అల్లీపురం ఆవేదన వ్యక్తం చేశాడు.

తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ)లో కాంగ్రెస్ కుమ్ములాటలు క్రీడాకారులను విస్తుగోల్పుతుంది. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ టీఓఏలో ఆధిపత్యం కోసం పోటీపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితులు ఒలింపిక్ సంఘంలో వర్గపోరుకు తెరతీయటంతో ఎటు వైపు నిలవాలనే సంశయంలో క్రీడా సంఘాలు ఉన్నాయి.

ఒలింపిక్ సంఘంలో కాంగ్రెస్ కుమ్ములాట!

- టీఓఏలో జితేందర్ రెడ్డి వర్సెస్ మహేశ్ కుమార్
- సీఎం రేవంత్ రెడ్డి జోక్యం అనివార్యం





నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) రాజకీయం రక్తి కడుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏపీ జితేందర్ రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా జితేందర్ రెడ్డి ప్యానల్ అభ్యర్థులు విజయం సాధించారు. కానీ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి టీఓఏ నూతన కార్యవర్గానికి ఇంకా గుర్తింపు దక్కలేదు. నేషనల్ స్పోర్ట్స్ కోడ్, ఎలక్ట్రోరల్ కాలేజ్‌లో అవకతవకలు, సహా ఎన్నికలకు ఐఓఏ పరిశీలకులు లేకపోవటం ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. 38వ జాతీయ క్రీడలకు చెఫ్ డి మిషన్‌ను నియమించే అధికారం చేతుల్లోకి తీసుకున్న ఐఓఏ.. టీఓఏకు గట్టి షాక్ ఇచ్చింది. జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్లను సైతం పంపే అధికారం కోల్పోయిన టీఓఏ ఇప్పుడు సంక్షోభంలో కూరుకుంది. ఈ పరిస్థితి ఒలింపిక్ సంఘంలో కాంగ్రెస్ కుమ్ములాటలే కారణమని విమర్శలు వస్తున్నాయి. టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి ఒలింపిక్ సంఘం వేదికగా ఆధిపత్య పోరుకు తెరతీయటం ప్రభుత్వ పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. జాతీయ క్రీడలకు జట్లను పంపాల్సిన ఐఓఏ నియమిత చెఫ్ డి మిషన్ అధికారులు ఓ వైపు, టీఓఏ ఆఫీస్ బేరర్లు ఓ వైపు పోటాపోటీ సమావేశాలు నిర్వహించటంతో క్రీడాకారులు, క్రీడా సంఘాలు గందరగోళానికి గురవుతున్నాయి.

సీఎం రేవంత్ జోక్యం అనివార్యం

క్రీడా మంత్రిత్వ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో జరిగే ప్రతి క్రీడా ఈవెంట్‌కు సీఎం హాజరవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో క్రీడలకు భారీ కేటాయింపులు చేశారు. రాష్ట్రంలో క్రీడా రంగం ప్రగతి పథాన సాగుతుందనే ఆశ క్రీడాకారుల్లో చిగురించింది. ఇదే సమయంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం వేదికగా వర్గ రాజకీయం క్రీడాకారులను గందరగోళంలోకి నెట్టివేసింది. ముఖ్యమంత్రి తక్షణమే ఈ అంశంలో జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దాలి. సీఎం జోక్యం చేసుకుని తెలంగాణ ఒలింపిక్ సంఘాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, రాష్ట్రంలో క్రీడా రంగం మళ్లీ తిరోగమనంలో పడిపోయే ప్రమాదం ఉంది.



అదే తప్పు చేస్తే?

దర్శకుడు శంకర్ చేసిన తొలి తెలుగు సినిమా.. 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటించిన సినిమా.. దిల్‌రాజు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేసిన తన 50వ సినిమా.. సంక్రాంతి బరిలో పోటీ పడుతున్న సినిమా.. వెరసి ఎన్నో అంచనాలతో 'గేమ్ ఛేంజర్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. అవినీతిపై ఉక్కుపాదం మోపే ఓ ఐఏఎస్ అధికారికి, ఎలాగైనా ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవాలని ఆశపడే ఓ స్వార్థపూరిత పొలిటీషన్‌కి మధ్య జరిగే వార్ కథగా దీన్ని శంకర్ తన మార్క్ డైరెక్షన్‌తోనే భారీ హంగులతో తెరకెక్కించారు. అయితే ఇక్కడ ఆయన చేసిన బిగ్గెస్ట్ మిస్టేక్ ఏంటంటే, ఇంకా 90ల్లో మాదిరిగానే పూర్తి నాటకీయంగా, సహజత్వానికి దూరంగా సన్నివేశాలను రాసుకోవడం, ఇప్పటి ట్రెండ్‌ని, ప్రేక్షకుల అభిరుచిని ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో ఈ సినిమా అందర్నీ నిరాశపర్చింది. 'భారతీయుడు 2' వంటి బిగ్గెస్ట్ డిజాస్టర్ తర్వాత దర్శకుడు శంకర్ ఈ కథ మీద కసరత్తు చేయకపోవడం శోచనీయం. పైగా తొలిసారి శంకర్ తన కథతో కాకుండా దర్శకుడు కార్తీక్‌సుబ్బరాజ్ ఇచ్చిన కథతో దీన్ని తీశారు. కాలం చెల్లిన కథ, కథానాలకు భారీ హంగుల్ని అద్ది ప్రేక్షకుల్ని మెప్పించాలని చూస్తే ఫలితం దారుణంగా ఉంటుందని 'గేమ్ ఛేంజర్' రిజల్ట్ చెప్పకనే చెప్పింది. ఈ విషయంలో నిర్మాత దిల్‌రాజు తప్పు కూడా లేకపోలేదు. కాంబినేషన్, బడ్జెట్ మీద పెట్టిన కాన్సన్ట్రేషన్ కథ మీద పెట్టక పోవడం శోచనీయం. నటీనటులు, సాంకేతిక నిపుణులు గొప్ప పనితీరు కనబర్చినప్పటికీ ప్రేక్షకుల్ని మెప్పించేలా కథని తీయలేకపోతే అదంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఇలాంటి నేపథ్యంలో 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్ ఈ సినిమాలో బాగా నటించినప్పటికీ తన ఖాతాలో ఫ్లాప్ సినిమాని చేర్చుకోవడం, సంక్రాంతి పోటీలో డిజాస్టర్ సినిమాగా నిలవడం మరింత బాధాకరం.



శంకర్, దిల్‌రాజు

- రెడ్డి హనుమంతరావు

నవచిత్రం

ఘనంగా 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్



'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి వరుస ఘన విజయాల తరువాత బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఐటీసీ కోహినూర్‌లో ప్రీ రిలీజ్ వేడుకను మేకర్స్ ఘనంగా చేశారు. ఇదే వేడుకలో 'డాకు మహారాజ్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

బాలకృష్ణ మాట్లాడుతూ, "అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే అప్పట్లో 'ఆదిత్య 369'లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి ఈ 'డాకు మహారాజ్' కథ పుట్టింది. రిలీజ్ చేసిన ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. బాలకృష్ణ నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఏం కోరుకుంటారో అందుకు తగ్గట్టుగా ఈ ట్రైలర్ ఉంది. దర్శకుడు బాబీ ఆలోచనకు తగ్గట్టుగా, కెమెరామెన్ విజయ్ కన్నన్ తన అద్భుత పనితీరుతో సన్నివేశాలకు ప్రాణం పోశారు. తమన్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎడిటర్స్ రూబెన్, నిరంజన్, ఆర్ట్ డైరెక్టర్ అవినాష్, ఫైట్ మాస్టర్ వెంకట్ ఇలా టీం అంతా మనసు పెట్టి పని చేశారు. మూడు వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకముంది' అని తెలిపారు.

బ్లాక్‌బస్టర్ ఖాయమనే నమ్మకంతో ఉన్నాం



అనిల్ రావిపూడి

"సంక్రాంతి వస్తున్నాం' సినిమాతో వెంకటేష్‌తో ఒక డిఫరెంట్ జోనర్ ట్రై చేశాను. ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు క్రైమ్ రెస్క్యూ ఎడ్వంచర్‌లా ఉంటుంది. సెకండ్ హాఫ్ డిఫరెంట్ జోనర్‌లో ఉంటుంది. వెంకీతో యాక్షన్ సినిమా చేసినా కూడా వినోదానికే పెద్దపీట వేస్తాను. ఆయనతో ఆ ఎంటర్‌టైన్మెంట్ చేయటం నాకు చాలా ఇష్టం' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు.

వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబోలో వస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటించారు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. అద్భుతమైన సాంగ్స్ ఉన్నాయి. ట్రైలర్‌లో ఫన్ మూమెంట్స్ అలరించాయి. సినిమాలో చూడటానికి ఎంగేజింగ్ కంటెంట్ ఉందని ఫిక్స్ అయ్యారు. థియేటర్స్‌కి వచ్చాక అద్భుతంగా నచ్చితే సినిమా బ్లాక్ బస్టర్. సినిమాకి వచ్చిన ఆడియన్స్ హ్యాపీగా నవ్వుకుని వెళ్తారు.
- 'ఎఫ్ 2, ఎఫ్ 3' కంటే 'సంక్రాంతికి వస్తున్నాం'తో వెంకీతో నా బాండింగ్ డబుల్ అయ్యింది. ఈ సినిమాతో బెస్ట్ బడ్డీస్ అయిపోయాం. చాలా క్లోజ్ అయ్యాం. ఆయనకి బ్లాక్‌బస్టర్ పొంగల్ సాంగ్ చాలా నచ్చేసింది. ఆయనే స్వయంగా పాడతానని చెప్పారు. నేను షాక్ అయ్యాను. అదే టైమింగ్‌లో ఓ రీల్ చేశాం. వెంకటేష్ 20 నిమిషాల్లో ఆ పాట పాడేశారు.
- భీమ్స్ ఇచ్చిన 'గోదారి గట్టు..' ట్యూన్ వినగానే ఒక పెక్యులర్ వాయిస్‌తో పాడిస్తే బావుంటుందని అనుకుని, రమణ గోగులని ఫస్ట్ ఆప్షన్‌గా ఎంచుకున్నాం. భీమ్స్ ఆయన్ని సంప్రదించి పాడించారు. ఈ క్రెడిట్ భీమ్స్‌కి దక్కుతుంది. రమణ గోగుల కూడా తన మార్క్‌ని యాడ్ చేశారు. హిట్ సాంగ్ అనుకున్న పాట కాస్త ఈ రోజు గ్లోబల్ సాంగ్ అయ్యింది.
- ఇందులో భాగ్యం క్యారెక్టర్ చాలా స్పెషల్. వెరీ ఎడ్జ్‌లో నడిచేది. చాలా కేర్ తీసుకొని చేయాల్సిన క్యారెక్టర్. ఐశ్వర్య బెస్ట్ పెర్ఫార్మర్. అయితే తను గోదారి యాస ఎలా పలుకుతుంది?, ఆ క్యారెక్టర్‌లో తన బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి చిన్న ఆడ షన్‌లా చేశాం. భాగ్యం చాలా మంచి క్యారెక్టర్. ఐశ్వర్యకి మంచి పేరు వస్తుంది. మీనాక్షి కూడా చాలా క్రమశిక్షణ గల నటి. తనకి మంచి టైం సెన్స్ ఉంది. చాలా చక్కగా పెర్ఫార్మ్ చేసింది. ఇద్దరూ ఆదరగొట్టారు.
- దిల్ రాజు బ్యానర్‌లోనే ఎక్కువగా సినిమాలు చేయడానికి కారణం ఒకటే.. మంచి అండర్‌స్టాండింగ్. ఆయనతో నాకు 'పటాస్' సినిమాతో ట్రావెల్ ఉంది. నాకు ఎవరైనా కనెక్ట్ అయితే వాళ్ళతోనే ట్రావెల్ చేయడానికి ఇష్టపడతాను. దిల్ రాజు, శిరీష్ అంటే నాకు ఫ్యామిలీ. అల్మోస్ట్ పదేళ్ళ జర్నీ మాది.
- ఫైనల్ కాపీ చూసిన తర్వాత వెరీ హ్యాపీ. వెంకీతో 'ఎఫ్2, ఎఫ్3' చేసినప్పుడు ఎంత హ్యాపీగా ఉన్నామో అంతే కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. పబ్లిక్ కూడా మేం హిట్ కొట్టేస్తామని కాన్ఫిడెంట్‌గా ఉండటం ఇంకా హ్యాపీ. ఎఫ్4 డెఫినెట్‌గా ఉంటుంది. అలాగే 'సంక్రాంతికి వస్తున్నాం'ని కూడా ఫ్రాంచైజ్ చేసుకునే స్కోప్ ఉంది.



విజువల్ ఎఫెక్ట్స్‌లో అద్భుతాలు సృష్టించాలి

కల్ప్రా విఎఫ్‌ఎక్స్ సంస్థ ప్రారంభోత్సవం శుక్రవారం ప్రసాద్‌ల్యాబ్స్‌లో వైభవంగా జరిగింది.

దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ, 'కల్ప్రా విఎఫ్‌ఎక్స్ సీఈవో మలిశ్వర్ సిద్దిపేట లాంటి పట్టణాల్లో ఐటీ కంపెనీని పెట్టి ఎంతో మంది యువతను ప్రోత్సహించారు. ఇప్పుడు కల్ప్రా విఎఫ్‌ఎక్స్‌తో కూడా ఉపాధి కల్పించబోతున్నారు. అలాగే తెలుగు సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్ స్థాయిని కూడా పెంచబోతున్నారు. హాలీవుడ్‌తో తెలుగు సినిమా పోటీ పడేందుకు విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగపడతాయి. అలాగే ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ తెలుగు చిత్రపరిశ్రమ ఉన్నతికి మరింత దోహదపడుతుంది. విజువల్ ఎఫెక్ట్స్‌లో అద్భుతాలు సృష్టించాలి. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు ఆస్కార్ అవార్డులు రావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం. తెలుగు ప్రజల గౌరవం ప్రపంచవ్యాప్తంగా పెరగాలి. మరింత మంచి చిత్రాలు విజువల్ ఎఫెక్ట్స్‌లో రావాలి. కల్ప్రా విఎఫ్‌ఎక్స్ సంస్థ తెలుగు పరిశ్రమలో రాణించాలని, మంచి అవకాశాలు అందుకోవాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.



సాయి రాం శంకర్

'ఒక పథకం ప్రకారం'

సాయిరాం శంకర్ నటిస్తున్న మరో విభిన్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. ఈ సినిమా ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేశారు.

దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ ఈ చిత్రాన్ని తన వినోద్ విహన్ ఫిల్మ్స్ బ్యానర్‌తో పాటు గార్లపాటి రమేష్ విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ, 'ఇదొక విభిన్నమైన కథ. అడ్వకేట్ పాత్రలో సాయిరాం శంకర్, పోలీసు పాత్రలో సముద్రఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో ఉత్కంఠభరితంగా తీసుకెళ్ళే క్రైం, మిస్టరీ కథనాలతో ఆద్యంతం కట్టిపడేస్తుంది. రాహుల్ రాజ్, గోపి సుందర్ పాటలు - స్కోర్ అద్భుతంగా వచ్చాయి. ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నాం' అని అన్నారు. శ్రుతి సోధి, ఆషిమ నర్వాల్, రవి, పచముతు, భాను శ్రీ, గార్లపాటి కల్పలత, పల్లవి గౌడ నటించిన ఈ చిత్రానికి డి. ఓ. పి - రాజీవ్ రవి, సంగీతం - రాహుల్ రాజ్, ఆర్. ఆర్ - గోపి సుందర్, ఎడిటర్ - కార్తీక్ జోగేశ్, ఆర్ట్ డైరెక్టర్ - సంతోష్ రామన్, కథ-మాటలు-దర్శకత్వం : వినోద్‌కుమార్ విజయన్.

ఒగ్గు కళాకారుల నేపథ్యంలో 'బ్రహ్మాండ'



ఆమని ప్రధాన పాత్రధారిణిగా రూపొందిన చిత్రం 'బ్రహ్మాండ'. మమత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మించింది. తాజాగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,'నా 'అఖండ' సినిమా ఎంతటి ఘనవిజయం సాధించిందో ఈ సినిమా కూడా అంతటి విజయాన్ని అందుకుంటుంది. టీజర్, డిజైన్స్ చూశాను చాలా బాగా ఉన్నాయి' అని తెలిపారు. 'సినిమా అద్భుతంగా వచ్చింది' అని నిర్మాత దాసరి సురేష్ చెప్పారు. దర్శకుడు రాంబాబు మాట్లాడుతూ,'మొట్టమొదటిసారిగా ఒగ్గు కళాకారుల నేపథ్యంలో, వారి సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న చిత్రం ఇది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆదివాసీల హామీలను విస్మరిస్తే
ప్రజాక్షేత్రంలో పోరు ఉధృతం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో పోరు తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఆదివాసీ సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆదివాసీ గూడేలు ఆగమయ్యాయనీ, అనేక సమస్యలతో వారు జీవిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం హామీలు ఇవ్వడం, ప్రకటనలు చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి సీఎం పనిచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల తాను, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌తో కలిసి బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ఆదివాసి గూడేలను సందర్శించాననీ, ఆ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను స్వయంగా చూశానని తెలిపారు. వారి విద్యా , వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ప్రధానంగా అనేక సీజనల్ వ్యాధులతో ఆదివాసీలు సతమతమవుతున్నారనీ, కానీ వారికి సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల కారణంగా అనేకమంది మరణించినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని పేర్కొన్నారు.

సిద్దిపేటలో నకిలీ వైద్యునిపై కేసు నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్దిపేట జిల్లా, కుక్నూర్‌పల్లి గ్రామానికి చెందిన నకిలీ, ఎలాంటి అర్హత లేకుండా ప్రాక్టీస్ చేస్తున్న డి.నర్సింలుపై కేసు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుని క్లినిక్‌పై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ సుష్మి ఆధ్వర్యంలో అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో రూ.68 వేల విలువైన 11 రకాల మందులను అధికారులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో యాంటీబయాటిక్స్ మందులు అర్హత లేని వ్యక్తుల ద్వారా తీసుకుంటే ప్రజారోగ్యానికి ప్రమాదమని అధికారులు హెచ్చరించారు.

187 మంది ఏఎస్సైలకు
ఎస్సైలుగా పదోన్నతులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని మల్టీజోన్-2 పరిధిలో గల జిల్లాలకు చెందిన 187 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఏఎస్సైలు)కు ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ఈ జోన్ ఐజీ వి. సత్యనారాయణ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. 1989, 1990 బ్యాచ్‌కు చెందిన ఏఎస్సైలు ఎస్సైలుగా అంతర్గత శిక్షణను పొందారు. వీరి శిక్షణ పూర్తి కాగానే పదోన్నతులు ఇచ్చినట్టు సత్యనారాయణ తెలిపారు. వీరికి పదోన్నతులు ఇచ్చే విషయంలో పోలీసు శిక్షణ విభాగం డీజీపీ అభిలాష బిస్త్, రాష్ట్ర డీజీపీ జితేందర్‌లు క్షుణ్ణంగా పరిశీలనలు జరిపారన్నారు. అనంతరం పదోన్నతులకు వీరు అర్హులుగా నిర్ణయించారని ఆయన చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు మరికొన్ని జిల్లాలకు చెందిన ఈ ఎస్సైలకు త్వరలోనే కొత్త పోస్టింగ్‌లను ఇస్తామని ఆయన చెప్పారు. ఇది వారికి తాము ఇచ్చిన సంక్రాంతి కానుక అని తెలిపారు.

క్రిప్టో కరెన్సీ పేరిట
రూ.95 కోట్లు ముంచిన ఘనుడి అరెస్ట్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

క్రిప్టో కరెన్సీ పేరిట అధిక లాభాలను ఇస్తానంటూ డిపాజిటర్ల నుంచి రూ.95 కోట్లు సేకరించి, మోసపుచ్చిన నిందితుడిని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. సీఐడీ డీజీపీ షికా గోయెల్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన కె.రమేశ్ గౌడ్ చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీని తెరిచి, క్రిప్టో కరెన్సీ పేరిట వ్యాపారాన్ని మొదలు పెట్టాడు. ఈ క్రిప్టో కరెన్సీ వ్యాపారంలో పెట్టుబడి పెడితే దానికి పెద్ద మొత్తంలో లాభాలను ఇస్తానంటూ నమ్మబలికి పలువురి నుంచి డబ్బులను సేకరించాడు. ఈ విధంగా రూ.95 కోట్లను డిపాజిట్లుగా తీసుకున్న రమేశ్‌గౌడ్.. తర్వాత డిపాజిటర్లకు ఎలాంటి లాభాలూ ఇవ్వకుండా మొఖం చాటేశాడు. దీంతో బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న సీఐడీ అధికారులు.. నిందితుడు రమేశ్ గౌడ్‌ను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.



ఎంఎస్పీ, రుణమాఫీ కోసం ఐక్య పోరాటం

స్పష్టం చేసిన ఎస్కేఎం నేతలు
దల్లేవాల్‌ను పరామర్శించిన ఎస్కేఎం ప్రతినిధి బృందం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ), అప్పుల బారినుంచి బయటపడేందుకు రైతులకు రుణమాఫీ కోసం ఐక్య పోరాటం కొనసాగుతోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) నేతలు స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా శుక్రవారం ఎస్కేఎం ప్రతినిధి బృందం ఖన్నౌరి సరిహద్దుకు చేరుకుని రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌ను కలిసింది. దల్లేవాల్ నేతృత్వంలోని ఎస్కేఎం (నాన్ పొలిటికల్) వర్గాన్ని 15న పటియాలాలో జరిగే రైతు సంఘాల సంయుక్త సమావేశానికి ఆహ్వానిస్తూ లేఖను అందజేశారు. పంటలకు లాభదాయక మైన కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దల్లేవాల్ నవంబర్ 26 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం



విదితమే. పంజాబ్ నుంచి ఢిల్లీ చలో మార్చ్ చేపట్టిన దల్లేవాల్, ఆయన సహచరులను పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభు, ఖన్నౌరి వద్ద హర్యానా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పంజాబ్‌లోని మోగాలో గురువారం సమావేశమైన కిసాన్ మహాపంచాయత్ నిర్ణయం ప్రకారం ఎస్కేఎం బృందం దల్లేవాల్‌ను సందర్శించి చర్చలకు ఆహ్వానించింది. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ మోర్చా, ఎస్కేఎం (నాన్ పొలిటికల్) ఇతర నాయకులతో కూడా చర్చలు జరిగాయి. ఎస్కేఎం ప్రతినిధి బృందంలో పి. కృష్ణ ప్రసాద్, జగ్బీర్ సింగ్ చౌహాన్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రామిందర్ సింగ్ పాటియాలా, దర్శన్ పాల్, జోగిందర్ సింగ్ ఉన్నారు. 2020 ఉద్యమం తర్వాత కేంద్రం హామీ ఇచ్చిన కనీస మద్దతు ధర, వ్యవసాయ రుణ ఉపశమన పథకం, ఇతర హామీలను సాధించడానికి సమిష్టి ఆందోళన కొనసాగుతుందని నాయకులు విలేకరుల సమావేశంలో తెలిపారు.

సీఎం హోదాను గౌరవించడం నేర్చుకోండి

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి హోదాను ఏ విధంగా గౌరవించాలో నేర్చుకోవాలంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి హోదాలో ఉండి కూడా విచారణ సంస్థలను అవమానిస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అవమానించడం సరైందికాదన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన ధరణిలో ఉన్న సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చిందని తెలిపారు. సంక్రాంతి కానుకగా భూభారతిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. భూభారతి చట్టాన్ని ఆమోదించినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తీరుతో వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థ లేకుండా పోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థ రానుందని వివరించారు.

గతంలో భూ సమస్యల కోసం కోర్టులకు వెళ్లడమే మార్గమన్నట్టు ఉండేదనీ, ప్రస్తుతం కాంగ్రెస్ రెవెన్యూ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రైతుల పండుగ సంక్రాంతి కానుకగా భూ భారతి అమలులోకి తేవాలని కోరారు. గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చట్టం తన పని తాను చేసుకపోతోంది

- ఫార్ములా ఈ రేసు కేసులో
- క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


ఫార్ములా ఈ రేసు కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోందని క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్‌జాన్ చెప్పారు. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రిని కించపరుస్తూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ కూడా సీఎంగా పని చేశారనీ, ఆయన కూడా లొట్టపీస్ ముఖ్యమంత్రేనా? అని ప్రశ్నించారు. సీఎంపై ఇష్టమెచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

2024లో రికార్డు స్థాయిలో పెరిగిన భూగోళ ఉష్ణోగతలు !

- 1.5డిగ్రీల సెల్సియస్‌ను అధిగమించిన తొలి ఏడాది
- ఈయూ వాతావరణ డేటా వెల్లడి

బ్రస్సెల్స్ : గడచిన 2024 సంవత్సరం భూగోళంపై అత్యంత అధిక ఉష్ణోగ్రతలను నమోదు చేసిన సంవత్సరంగా నిలిచింది. పైగా 1.5 డిగ్రీల సెల్సియస్‌ను అధిగమించరాదంటూ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పదే పదే చేసిన హెచ్చరికలను అధిగమించేసిన తొలి సంవత్సరంగా కూడా రికార్డులకెక్కింది. వాతావరణ సంక్షోభం వల్లనే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఆధునిక మానవులు ఇంతవరకు ఎన్నడూ అనుభవించిన స్థాయిలకు చేరుకుంటున్నాయని యురోపియన్ యూనియన్ వాతావరణ పర్యవేక్షక సంస్థ కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్ (సి3ఎస్) శుక్రవారం పేర్కొంది. రికార్డులు నమోదు చేయడం ఆరంభించినప్పటి నుండి 2024లో ప్రతి నెలా కూడా అత్యంత వేడిగా వుండడం లేదా రెండో స్థానంలో వుండడం జరుగుతూ వచ్చిందని సి3ఎస్ డైరెక్టర్ కార్లో బంటెంపో మీడియాతో పేర్కొన్నారు. 2024లో భూగోళం సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామికీకరణ కాలం 1850-190నాటి కన్నా 1.6 డిగ్రీల సెల్సియస్ అధికంగా వున్నాయని తెలిపారు. అంటే మానవులు కాలుష్య కారక వాయువులను వెలువరించే శిలాజ ఇంధనాలను పెద్ద మొత్తంలో వినియోగించడానికి ముందుగా వున్న ఉష్ణోగ్రతల కంటే ఇవి ఎక్కువగా వున్నాయి. అయితే శాశ్వతంగా ఈ లక్ష్మణరేఖను ఉల్లంఘించినట్లు కాదని, కానీ ఆ ప్రమాదానికి చాలా దగ్గరగా వస్తున్నామని సి3ఎస్ పేర్కొంది. వాతావరణంలో కాలుష్య కారక వాయువులు పేరుకుపోవడం వల్లనే రికార్డు స్థాయిలో ఇలా ఉష్ణోగ్రతలు పెరగడానికి ప్రథమ కారణమని కోపర్నికస్‌లో వ్యూహాత్మక పర్యావరణవేత్త సమంతా బర్గెస్ వ్యాఖ్యానించారు. కాలుష్య వాయువుల వల్ల సముద్ర మట్టాలు కూడా పెరుగుతున్నాయని, హిమనదాలు కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

2030 నాటికి లక్షలాది ఉద్యోగాలపై ఏఐ దెబ్బ



కృత్రిమ మేధస్సు(ఏఐ) విస్తరణ ప్రపంచవ్యాప్తంగా కార్మిక మార్కెట్ ను భారీగా దెబ్బ తీస్తుందని, ప్రపంచ కంపెనీలలో భారీ తొలగింపులకు దారితీస్తుందని బుధవారం ప్రచురించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక హెచ్చరించింది.

ప్రపంచవ్యాప్తంగా వందలాది పెద్ద వ్యాపారాలను సర్వే చేసిన అధ్యయనం, ఏఐ కి పెరుగుతున్న సామర్థ్యాలకు ప్రతిస్పందనగా 2030 నాటికి 41 శాతం కంపెనీలు తమ శ్రామిక శక్తిని తగ్గించుకోవాలని యోచిస్తున్నాయని కనుగొంది. ఇంకా, 77 శాతం కంపెనీలు 2025 నుంచి 2030 వరకు మెరుగైన మానవ-యంత్ర సహకారం కోసం తమ ప్రస్తుత సిబ్బందికి నైపుణ్యాన్ని పెంచడానికి సిద్ధమవుతున్నాయి.

దశాబ్దం చివరి నాటికి 170 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడితే.. 92 మిలియన్ల ఉద్యోగాలు తొలగించబడతాయని నివేదిక అంచనా వేసింది. ఏఐ, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీలలో నైపుణ్యాలకు అధిక డిమాండ్ ఉంటుందని డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. "జనరేటివ్ ఏఐ మరియు వేగవంతమైన సాంకేతిక మార్పుల వంటి ధోరణులు పరిశ్రమలను, కార్మిక మార్కెట్లను పెంచుతున్నాయి. అపూర్వమైన అవకాశాలను, తీవ్ర నష్టాలను సృష్టిస్తున్నాయి" అని డబ్లుఇఎఫ్ లో "పని, వేతనాలు మరియు ఉద్యోగ సృష్టి" విషయాల అధిపతి టిల్ లియోపోల్డ్ అన్నారు.

ఏఐ, రోబోటిక్స్ మరియు ఇంధన వ్యవస్థలలో, ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ ఇంజనీరింగ్‌లో పురోగతి ఈ రంగాలలో నిపుణుల పాత్రలకు డిమాండ్‌ను పెంచుతుందని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. ఏఐ, ఇతర సాంకేతిక ధోరణుల కారణంగా సంఖ్యలో అతిపెద్ద క్షీణతను ఎదుర్కొనే ఉద్యోగ వర్గాలను కూడా నివేదిక గుర్తించింది. వాటిలో సర్వీస్ క్లర్క్ లు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీలు, పేరోల్ క్లర్క్ లు, గ్రాఫిక్ డిజైనర్లు ఉన్నారు.

"వేగంగా తగ్గుతున్న టాప్ 10 ఉద్యోగ విభాగాల జాబితాలో గ్రాఫిక్ డిజైనర్లు, లీగల్ సెక్రటరీలు ఇద్దరూ ఉండటం, ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ యొక్క మునుపటి ఎడిషన్లలో కనిపించని మొదటి అంచనా. ఇది జెన్ ఏఐ కి జ్ఞాన పనిని నిర్వహించడానికి పెరుగుతున్న సామర్థ్యాన్ని వివరిస్తుంది" అని నివేదిక పేర్కొంది.ఏఐ ప్రభావం ఉద్యోగ స్థానభ్రంశానికి మించి విస్తరించిందని, మానవ ఉత్పత్తిని పూర్తిగా భర్తీ చేయకుండా పెంచడానికి సాంకేతికత సామర్థ్యాన్ని హైలైట్ చేస్తుందని నివేదిక నొక్కి చెప్పింది.సృజనాత్మక ఆలోచన, స్థితిస్థాపకత, ఆవశ్యత మరియు చురుకుదనం వంటి "మానవ-కేంద్రీక త నైపుణ్యాలు" కీలకంగా కొనసాగుతాయని డబ్ల్యూఈఎఫ్ తేల్చింది. ఇంతలో, ఇటీవలి సంవత్సరాలలో ఉన్నత స్థాయి వ్యక్తులు, శాస్త్రవేత్తలు ఏఐ వల్ల కలిగే ప్రమాదాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం, కంప్యూటర్ శాస్త్రవేత్త, రచయిత పాల్ గ్రాహం రచన కోసం ఏఐ ని ఉపయోగించడం వల్ల కొన్ని దశాబ్దాలలో ఎక్కువ మంది ప్రజలు నైపుణ్యాన్ని కోల్పోతారని హెచ్చరించారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం వల్ల కార్మిక మార్కెట్ గణనీయంగా మారుతుందని టి-బ్యాంక్ ఏఐ రీసెర్చ్ లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ లాబోరేటరీ అధిపతి డేనియల్ గావ్రిలోవ్ అన్నారు. మానవుడు చేయగలిగే ప్రతిదాన్ని ఏఐ చేయగలదు . యంత్రాలు దానిని బాగా చేయగలవని ఆయన అన్నారు. స్వల్ప, మధ్యస్థ కాలాలలో, ఉద్యోగులు పోటీతత్వాన్ని కొనసాగించడానికి ఏఐ నైపుణ్యాలను నేర్చుకోవాల్సి ఉంటుందని గావ్రిలోవ్ గుర్తించారు.

'పుతిన్ కలవాలనుకుంటున్నారు' - ట్రంప్



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ గురువారం తనకు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు మధ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. "అతను కలవాలనుకుంటున్నాడు, మేం దానిని ఏర్పాటు చేస్తున్నాం" అని ట్రంప్ ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లోని తన మార్-ఎ-లాగో నివాసంలో రిపబ్లికన్ గవర్నర్‌లతో సమావేశానికి ముందు చెప్పారని రాయిటర్స్ తెలిపింది. సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఆయన పేర్కొనలేదు.

జనవరి 20న పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న ట్రంప్, కీవ్‌కు పదవీ విరమణ చేసే అధ్యక్షుడు జో బైడెన్ బేషరతుగా సహాయం చేయడాన్ని విమర్శించారు. తన ఎన్నికల సమయంలో, రష్యా ఉక్రెయిన్‌లను త్వరగా చర్చలు పునఃప్రారంభించమని బలవంతం చేస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. అదనపు సైనిక, ఆర్థిక సహాయం అందించమని పాశ్చాత్య దేశాలకు ఆయన నిరంతరం చేసిన అభ్యర్థనలను ప్రస్తావిస్తూ ఉక్రెయిన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీని "భూమిపై గొప్ప సేల్స్‌మ్యాన్" అని కూడా ఆయన అభివర్ణించారు.

ట్రంప్ శాంతి కోసం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను వెల్లడించనప్పటికీ, ప్రస్తుత ఫ్రంట్ లైన్‌లో సంఘర్షణను స్తంభింపజేయాలని ఆయన బృందం పరిశీలిస్తున్నటుఅట మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ, ట్రంప్-పుతిన్ సమావేశం కోసం మాస్కోకు "ఎటువంటి అభ్యర్థనలు అందలేదని" అన్నారు. "ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించే వరకు వేచి ఉండటమే మంచిది" అని పెస్కోవ్ అన్నారు.

ట్రంప్ పదవీ స్వీకార దినోత్సవం తర్వాత 100 రోజుల్లోపు రష్యన్ , ఉక్రెయిన్ మధ్య ఒప్పందాన్ని కుదుర్చుకోగలడని కాబోయే ఉక్రెయిన్ రాయబారి కీత్ కెల్లాగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌లో సైనిక చర్యను ప్రారంభించినప్పటి నుంచి పుతిన్‌తో మాట్లాడకపోవడాన్ని కూడా ఆయన విమర్శించారు. 2022 వసంతకాలంలో మాస్కో, కీవ్ ల మధ్య చర్చలు విఫలమయ్యాయి. ఇరుపక్షాలూ అవాస్తవ డిమాండ్లు చేస్తున్నాయని ఒకరినొకరు నిందించుకున్నాయి. పుతిన్ ప్రకారం, ఉక్రెయిన్ బృందం రష్యా నిబంధనలలో కొన్నింటికి అంగీకరించింది, కానీ అకస్మాత్తుగా చర్చల నుంచి తప్పుకుంది. 2022లో రష్యా నిబంధనలకు అంగీకరించవద్దని పాశ్చాత్య దేశాలు కీవ్‌కు సలహా ఇచ్చాయని మాజీ సీనియర్ స్టేట్ డిపార్ట్ మెంట్ అధికారి విక్టోరియా నులాండ్ తరువాత వెల్లడించారు.

ప్రతి ఏడాదీ ఇంతేనా?

- పొగమంచును ముంబయి ఎదుర్కోవాల్సిందేనా?
- వాయు కాలుష్యంపై బాంబే హైకోర్టు ప్రశ్న



న్యూఢిల్లీ : ముంబయి నగరంలో గాలి కాలుష్యంపై బాంబే హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "శాశ్వత పరిష్కార మార్గం ఉందా? లేక పౌరులు దీపావళి తర్వాత ప్రతి ఏడాదీ తీవ్ర పొగమంచును ఎదుర్కోవాల్సిందేనా?" అని బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులను ప్రశ్నించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.కె ఉపాధ్యాయ, జస్టిస్ గిరీశ్ కులకర్ణిలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై విచారణ సాగించింది. కాలుష్యానికి గల కారణాలు తెలిసినప్పటికీ.. నిర్దిష్ట పరిష్కారాలు అస్పష్టంగానే ఉన్నాయని అభిప్రాయపడింది. "ఇలాంటి సందర్భాల్లో పరిష్కారం ఏమిటి? ప్రతి సంవత్సరం దీపావళి తర్వాత ఇది మొదలవుతోంది. సమస్యలు, కారణాలు మనకు విస్తృతంగా తెలుసు. మరిప్పుడు పరిష్కారం ఏమిటి? లేక ప్రతి ఏడాదీ ముంబయి అంతటా ఈ పొగమంచును చూడాలా? కొన్ని రోజుల్లో విజిబులిటీ తక్కువగా ఉంటున్నది" అని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.

నగరంలో క్షీణిస్తున్న గాలి నాణ్యతపై అవగాహన ఉన్న అధికార యంత్రాంగాలు.. తక్షణ, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదని తెలిపింది. ముంబయిలో గాలి కాలుష్యంపై 2023 నుంచి ధర్మాసనం మానిటర్ చేస్తున్నది. ఈ సమస్యను కోర్టు సుమోటోగా స్వీకరించి, విచారిస్తున్నది. దీపావళి సందర్భంగా ఆంక్షల విషయంలో 2023లో కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. అమలు లోపించిందని న్యాయమూర్తులు గుర్తించారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవటంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా అడ్వొకేట్ దరియస్ ఖంబట, ఎన్జీఓ తరఫున జనక్ ద్వారకాదాస్‌లు వాదనలు వినిపించారు. నాణ్యమైన గాలి కంటే అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని చూస్తున్నదని బృహన్‌ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)ను ఈ విషయంలో తప్పుబట్టారు. బీఎంసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ మిలింద్ సాథే వాదనలు వినిపించారు. బీఎంసీ చర్యను సమర్థించారు. అయితే, కఠిన చర్యలు అవసరమని కోర్టు తెలిపింది.

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో
సీబీఐ సప్లమెంటరీ చార్జిషీట్‌పై విచారణ వాయిదా

వర్చువల్‌గా కోర్టు ముందుకు కవిత, కేజ్రీవాల్, సిసోడియా, సహనిందితులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీబీఐ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జిషీట్‌పై విచారణను రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. సీబీఐ చార్జిషీట్‌లో పలు పేజీల మిస్సింగ్, ఖాళీలపై ప్రతివాదులు లేవనెత్తిన అభ్యంతరాలను సరి చేసి ఇవ్వాలని సీబీఐ అధికారులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 17కు వాయిదా వేస్తున్నట్టు ట్రయల్ కోర్టు వెల్లడించింది. ఈ కేసు వ్యవహారంలో గతేడాది జూన్ 7న కవితతో పాటు, మరో నలుగురిపై సీబీఐ సప్లమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌ను జులై 22న కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అలాగే కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, అమన్ దీప్ దళ్, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రులపై సీబీఐ అదనపు చార్జిషీట్ వేసింది. ఈ చార్జిషీట్లపై శుక్రవారం మరోసారి సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కవితతో పాటు, కేజ్రీవాల్, సిసోడియా, ఇతర సహ నిందితులు వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు హాజరయ్యారు. సీబీఐ చార్జిషీట్‌లో స్పష్టంగా లేని పలు పేజీల విషయాన్ని పలువురు నిందితుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కోరినప్పటికీ... దర్యాప్తు సంస్థలు మరోసారి పాత కాపీలే సర్వ్ చేశారని నివేదించారు. ఇందులో చాలా పేజీల్లో అక్షరాలు నల్లగా, స్పష్టంగా లేవని, ఖాళీలు ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. గతంలో కోర్టు ఆదేశించినా, సీబీఐ అధికారులు కొత్త కాపీలు అందించలేదని తెలిపారు. ఇందుకు సీబీఐ



స్పందిస్తూ మరోసారి అప్ డేట్ చేసిన కాపీలు అందజేస్తామని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ప్రతివాదులు అడిగినట్లు స్పష్టతతో కూడిన కాపీలను సప్లై చేయాలని స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా సీబీఐని ఆదేశించారు. తదుపరి విచారణను వచ్చే 17కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. కాగా గత మూడు నెలలుగా సీబీఐ సర్వ్ చేసిన కాగితాల్లో స్పష్టత లేకపోవడంతో కేసు వాయిదా పడుతూ వస్తోంది. మరోవైపు సీబీఐ కేసులో అరెస్ట్ అయిన నిందితులు ఇప్పటికే బెయిల్ పై విడుదలయ్యారు.

గాలి జనార్దన్ రెడ్డి కేసు తుది గడువు పొడిగింపు

- మరో నాలుగు నెలలు పెంచుతూ ఉత్తర్వులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కర్నాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డిపై 2011లో నమోదైన ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసు విచారణను ముగించేందుకు ట్రయల్ కోర్టు తుది గడువును పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జనార్దన్‌రెడ్డిపై 2011లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ 13 ఏండ్లుగా కేసు పెండింగ్‌లో ఉంది. అయితే సుప్రీంకోర్టు 2022 అక్టోబర్ 10న విచారణ జరుపుతూ ట్రయల్ కోర్టు 2022 నవంబర్ 9 నుంచి విచారణ జరిపి ఆరు నెలల్లో ముగించాలని సూచించింది. అయితే విచారణ ముగించడంలో ట్రయల్ కోర్టు విఫలమైంది. శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం తుది విచారణ గడువును నాలుగు నెలలు పొడిగించింది. మళ్లీ విచారణ గడువును పొడిగించలేమని స్పష్టం చేసింది.

శ్రీనివాస్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి, అధికారుల పర్యటన

- ఆశాలు, అంగన్‌వాడీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశం



నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జయరాంతోపాటు తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కార్యాలయ అధికారులు సెల్వరాజు, నజీర్ శుక్రవారం పర్యటించారు. గ్రామస్థాయి ఉద్యోగులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వెంకటరమణచౌదరి పదవీ కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా ఇండ్ల నుంచి చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువు తయారీ విధానం గురించి వివరాలు అడిగారు.

ఈ సందర్భంగా వెంకటరమణచౌదరి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ చెత్త సేకరణ, ఎరువుల తయారీ కోసం ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నుంచి ఇద్దరు గ్రీన్ అంబాసిడర్స్ నియామకం చేపడితేనే ఈ కార్యక్రమం విజయవంతం చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌బీఎం ప్రతినిధి మోహిద్, పంచాయతీ కార్యదర్శి ఎ.భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీడీలకు పెరిగిన రోగ నిర్ధారణ పరీక్షలు

- డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సీడీ-అసాంక్రమిక రోగాలు) ప్రారంభంలోనే గుర్తించేందుకు వీలుగా రాష్ట్రంలో రోగ నిర్ధారణ పరీక్షలు పెంచినట్టు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సీడీలు)పై రెండ్రోజుల పాటు హైదరాబాద్ జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఎన్సీడీలను ఎదుర్కోవడం, ప్రారంభంలో రోగ నిర్ధారణ చేయడం, నివారణ కోసం ఆవిష్కరణలు, వ్యూహాలపై చర్చించేందుకు ఆరోగ్య నిపుణులు, విధాన రూపకర్తలు, భాగస్వాములను ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడింది. అదే విధంగా ఎన్సీడీలకు సంబంధించి జాతీయ ప్రోగ్రాం అమలుకు సంబంధించి ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పరస్పరం తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లో డయాబెటీస్, హైపర్ టెన్షన్, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ ఇబ్బందులు నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, స్ట్రోక్ తదితర వ్యాధులపై కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిస్టీనా మాట్లాడుతూ అసాంక్రమిక వ్యాధులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలను వివరించారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ క్లినిక్కులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ క్లినిక్కులను టి డయాగ్నస్టిక్ సేవలతో అనుసంధానం చేసినట్టు వెల్లడించారు. దీంతో ఎన్సీడీ రోగనిర్ధారణ పరీక్షల రేటు మరింతగా పెరుగుతుందని తెలిపారు. మరణాల్లో 65 శాతం చావులు ఎన్సీడీలతోనే చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ వర్క్‌షాప్ ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి పుణ్య సలీలా మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘానికి ఆరోగ్య ప్రధానమైన విషయమని, ఆయా రాష్ట్రాలు ఎన్సీడీ ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సహ కార్యదర్శి ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ, ఈ ఏడాది 50 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. మారిన పరిస్థితుల్లో ఎన్సీడీలకు సంబంధించి వ్యూహాలకు మరింత పదును పెట్టాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఆరోగ్య కార్యదర్శులు, అదనపు ముఖ్య కార్యదర్శులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, మిషన్ డైరెక్టర్లు, ఎన్పీ-ఎన్సీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు, నిపుణులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్వరలో ఎన్నికలు జరగనున్న రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ ఉపాధ్యాయ నియోజక వర్గ ఎమ్మెల్సీ స్థానం నుంచి మల్క కొమరయ్య, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పులి సరోత్తం రెడ్డి అభ్యర్థులుగా పోటీచేయనున్నట్టు తెలిపారు. కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి.అంజిరెడ్డి పేరును ప్రకటించారు.

సంభాల్ మసీదు బావి వివాదం

- యథాతథ స్థితి కొనసాగించండి : యూపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం
- కేంద్రానికి, ఏఎస్ఐకి నోటీసులు

న్యూఢిల్లీ : సంభాల్‌లోని షాహి జామా మసీదు బావిపై యథాతథ స్థితి కొనసాగించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. అలాగే, ఈ కేసులో తదుపరి ఉత్తర్వులు జారీ వరకూ ఈ ప్రయివేటు బావి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకొవద్దని కేంద్రానికి, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)కి, సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్‌కు, హిందూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. మసీదుకు సమీపంలో ఉన్న బావిని పునర్ధురించడాన్ని వ్యతిరేకిస్తూ మసీదు నిర్వహణ కమిటీ తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారించింది. మసీదు కమిటీ తరుపున సీనియర్ న్యాయవాది హుఫేజా అహ్మది వాదనలు వినిపించారు. సంభాల్ జిల్లా అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఈ బావిని పునరుద్ధరించారని, ఈ బావి నీటిని ఎప్పటి నుంచో మసీదు కమిటీ ఉపయోగిస్తుందని తెలిపారు. అయితే ప్రాంతానికి 'హరి మందిర్' అని పేరుపెట్టి ఇక్కడ మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 'అలాంటి కార్యకలాపాలు అనుమతించబడవు.

కాళేశ్వరం పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు మహా కుంభాభిషేకం : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష



నవతెలంగాణ-మహదేవపూర్

కాళేశ్వరం పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పుష్కరాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే మహా కుంబాభిషేకానికి అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద ఫిబ్రవరిలో మహాకుంబాభిషేకం, మేలో సరస్వతీ పుష్కరాలు ఉన్నందున ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో కాళేశ్వరంలోని ఈఓ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుంబాభిషేకానికి రాజగోపురంపై ఒకేసారి 20మంది వరకు నిల్చోడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలకు 19 లైన్ డిపార్ట్‌మెంట్‌ల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి, ఇతర జిల్లాల నుంచి రోజుకు 50వేల మందికిపైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, వన్ వే రూట్ ఏర్పాటు చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ద్వారా అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, రూరల్ వాటర్ శాఖ ద్వారా సురక్షిత మంచి నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది పరిసరాల్లో మహిళల కోసం కొన్ని శాశ్వత గదులతోపాటు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకోవాలని సూచించారు.

అన్ని శాఖలు టీమ్ వర్క్‌తో పని చేయాలని, చేసే విధుల్లో ఒక్కరిపై భారం పడకుండా అందరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. తిరిగి తాను కుంబాభిషేకానికి వస్తానని. అప్పటి వరకు మిగిలిన పనులు పూర్తి కావాలని తెలిపారు. నేషనల్ హైవేపై కుదురుపల్లి బ్రిడ్జి దగ్గర రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశానికి ముందు తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయ స్థాయిని పెంచాలని, సహాయ కమిషనర్ హెూదా ఇవ్వాలని కమిషనర్‌కు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాజబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈఓ మారుతి, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డిజిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య, జిల్లా అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ మహదేవపూర్ సీఐ రామచంద్రరావు, కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి, ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలివ్వాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

వనపర్తి ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర , అధికారులకు వినతి



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నో ఏండ్లుగా సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి జిల్లా ఘనపురం మండలం కర్నే తండా నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు సుమారు 22 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘనపూర్ మండలం మామినిమాడ శివారులోని ఎనికి తండా, మేడి బావితండా, ముందరి తండా, కర్నే తండా, ఆముదంబండ తండా, చిన్నపీరు తండా, నిత్య తండా, భీముని తండా గిరిజనులు తరతరాల నుంచి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. వారికి పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజశేఖర్ బహదూర్ వనపర్తి సంస్థాన్ ఆఫీసుల పేరిట 460 ఎకరాల భూమి ఉండటం సీలింగ్ చట్టానికి వ్యతిరేకమని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోని సీలింగ్ యాక్ట్ ప్రకారం ఒక కుటుంబానికి 53 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉండకూడదనే నిబంధన ఉన్నప్పటికీ.. ఆయన పేరుపై 460 ఎకరాలు ఉన్నా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఆ భూముల్లో లంబాడ తండా గిరిజనులు తరతరాల నుంచి సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు ఇవ్వకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. సర్వేనెంబర్ 369 నుంచి 414లోని 463 ఎకరాల భూముల్లో 153 కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని వివరించారు. ప్రస్తుత ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెగారెడ్డి తక్షణమే స్పందించి సాగు చేసుకుంటున్న గిరిజన లంబాడ కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీలోపు గిరిజన కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేసి రైతుభరోసా వర్తింపజేయాలని కోరారు. మహబూబ్‌నగగర్ ఉమ్మడి జిల్లా వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నా అధికారుల తీరులో మార్పు కనబడటం లేదన్నారు. ఈ అంశంపై త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నట్టు చెప్పారు. గిరిజనులకు పట్టాలు ఇవ్వకపోవడం వల్ల రైతుబంధు, రైతుబీమా, ఇతర సంక్షేమ పథకాలు అందలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలనూ ఒక వేదికపైకి తీసుకొచ్చి రైతుల పక్షాన న్యాయమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

భూమి పట్టాలు సాధించేవరకు పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు అజయ్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్య నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు పద్మ కృష్ణనాయక్, ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ పాషా, గిరిజన సంఘం జిల్లా నాయకులు సక్కునాయక్, జిల్లా కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు కురుమయ్య, బొబ్బిలి నిక్సన్, రైతులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

రైతన్నల ఎదురుచూపులు

ఆన్‌లైన్‌లో జమ

ఖాతాల్లో జమ కాని బోనస్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

"సన్నాలకు రూ.76,200 బోనస్ నా ఖాతాలో పడాలే.. ఇప్పటికే చాలా రోజులయింది. దాంతో సివిల్ సప్లరు అధికారులను సంప్రదించిన.. జనవరి 19నే బోనస్ చెల్లించినట్టు ఆన్‌లైన్‌లో చూపించారు. ఎస్‌బీఐ పరకాల శాఖలో విచారణ చేస్తే ఆ నిధులు జమ కాలేదు. ఈ విషయంలో మళ్లీ సివిల్ సప్లయ్ అధికారులను వివరణ కోరితే.. సర్కార్ నిధులు విడుదల చేస్తే ఖాతాలో జమవుతాయని చెబుతున్నారు" హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన రైతు పోరండ్ల సంతోష్ విక్రయించిన సన్నాల బోనస్‌కు సంబంధించిన పరిస్థితి ఇది. ఇలాంటి పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లా అంతా ఉందని, కొనుగోలు చేసిన ధాన్యం బోనస్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో సన్నాలకు సర్కార్ ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపులో తాత్సారం జరుగుతోంది.

ఒక్కో జిల్లాలో ఒక్కోలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బోనస్ చెల్లింపులు ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ఉన్నాయి. వరంగల్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 190 కొనుగోలు కేంద్రాల్లో 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 1.10 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు ఉండగా.. వాటికి బోనస్ కింద రూ.55.05 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.25.15 కోట్లు మాత్రమే చెల్లించగా.. మరో రూ.29.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. హన్మకొండ జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాల్లో 89,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 60,157 మెట్రిక్ టన్నులు సన్నాలే కావడం గమనార్హం. ఇందుకుగాను 55,022 మెట్రిక్ టన్నులకు చెల్లింపులు ఆన్‌లైన్ చేశారు.

ఇందులో 12,665 మంది రైతులకు రూ.27.51 కోట్లు బోనస్‌గా చెల్లించాల్సి ఉంది. కాగా 9,417 మంది రైతులకు సంబంధించిన 42,862 మెట్రిక్ టన్నుల సన్నాలకు బోనస్‌గా రూ.21.43 కోట్లు చెల్లించారు. 3,248 మంది రైతులకు సంబంధించి మరో 12,160 మెట్రిక్ టన్నులకు బోనస్‌ను రూ.6.08 కోట్లు చెల్లించాల్సి ఉంది.

బ్యాంకు ఖాతాలో జమ కాని బోనస్..

సన్నాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాల్సి ఉండగా, సివిల్ సప్లయ్ అధికారులు ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి లాగిన్‌లో నమోదు చేశాక సంబంధిత రైతుకు బోనస్ చెల్లించినట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. క్షేత్రస్థాయిలో సంబంధిత రైతు బ్యాంకు ఖాతాలో మాత్రం జమ కావడం లేదు. దాంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

తొలిసారిగా ఇంటర్‌పోల్ 'సిల్వర్ నోటీసులు'

న్యూఢిల్లీ : అంతర్జాతీయ పోలీస్ సహకార సంస్థ (ఇంటర్‌పోల్) మొట్టమొదటిసారిగా సిల్వర్ నోటీసులు జారీచేసింది. విదేశాల్లో అక్రమంగా కూడబెట్టిన ఆస్తుల వివరాల గుట్టువిప్పేందుకు వీలుగా ఇంటర్‌పోల్ కొత్తగా ఈ నోటీసులు తీసుకువచ్చింది. ఈ పైలట్ ప్రాజెక్టులో భారత్‌తో సహా 52 దేశాలు భాగస్వామ్యులుగా ఉన్నాయని తెలిపింది. ఒక మాఫియా సభ్యుడి ఆస్తులకు సంబంధించి ఇటలీ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు తొలిసారిగా వీటిని జారీ చేసినట్లు ఇంటర్‌పోల్ వెల్లడించింది. విదేశాలకు పారిపోయిన నేరస్థులు, ఆర్థిక నేరగాళ్లకు సంబంధించి కీలక సమాచారం కోసం ఆయా దేశాల నుంచి వచ్చే విజ్ఞప్తుల మేరకు కొన్ని నోటీసులను ఇంటర్‌పోల్ ఇప్పటికే జారీ చేస్తుంది. ఇప్పటి వరకూ రెడ్, ఎల్లో, బ్లూ, బ్లాక్, గ్రీన్, ఆరెంజ్, పర్పుల్ రంగులు వాడుతోన్న ఇంటర్‌పోల్.. తాజాగా సిల్వర్‌ను జోడించింది. ఉదాహరణకు విదేశాలకు పారిపోయిన వారిని నిర్బంధించాలని కోరేందుకు రెడ్ నోటీసులు ఉపయోగించడం మనకు తెలిసిందే. ఇంటర్‌పోల్‌లో భారత్ కూడా సభ్య దేశమే. మన దేశం నుంచి దాదాపు 10 మంది పారిపోయిన ఆర్థిక నేరస్తుల జాబితాలో ఉన్నారు.

అయితే, వీరు విదేశాలకు తరలించిన మొత్తం నల్లధనం ఎంతనే విషయంపై కచ్చితమైన అంచనాలు లేవు. ఈ క్రమంలో నేరస్థులు ఇలా అక్రమంగా సరిహద్దులు దాటించిన సంపదను గుర్తించేందుకు సిల్వర్ నోటీసులు భారత్‌కు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. నేరస్థుల అక్రమ ఆస్తుల వివరాలకు సంబంధించి సిల్వర్ నోటీసు కోడ్‌తో ఇంటర్‌పోల్ ఇటీవల పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. మోసం, అవినీతి, డ్రగ్ అక్రమ రవాణా, ఇతర తీవ్ర నేరాలతో సంబంధమున్న వ్యక్తుల కీలక సమాచారాన్ని గుర్తించి, ఆయా దేశాలకు అందిస్తుంది. ఫ్రాన్స్‌లోని లియోన్ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్‌పోల్‌లో ప్రస్తుతం 196 సభ్య దేశాలున్నాయి.

జాతీయ పార్టీల జోరులో ప్రాంతీయ పార్టీలు బెంబేలు

- హెచ్‌సీయూలో 2024 లోక్‌సభ ఎన్నికలపై ముగిసిన జాతీయ సెమినార్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ పార్టీల జోరులో ప్రాంతీయ పార్టీల బెంబేలయ్యాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో వక్తలు అభిప్రాయ పడ్డారు. "2024 లోక్‌సభ ఎన్నికలు, దాని ఫలితాల తీరు తెన్నులు" అనే అంశంపై హెచ్‌సీయూలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. ప్రొఫెసర్ ఈ వెంకటేశుఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, సంస్థల నుంచి రాజనీతి శాస్త్రవేత్తలు, రాజకీయ పండితులు, రీసెర్చ్ స్కాలర్స్ హాజరయ్యారు. ఈ సదస్సులో సీఎస్‌డీఎస్ లోక్‌నీతి డైరెక్టర్ సందీప్ శాస్త్రి, ప్రొఫెసర్ సంజయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. దేశంలోని ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీల కూటమిలో చేరుతుండటం వల్ల మరోసారి దేశ రాజకీయాలు జాతీయ పార్టీల చుట్టూ కేంద్రీకృతం అవుతున్నాయని అన్నారు. ఫలితంగా కొన్ని ప్రాంతీయ పార్టీలు బలపడుతుండగా, కొన్ని బలహీనమవుతున్నాయని తెలిపారు.

ప్రాంతీయ పార్టీలు, జాతీయ రాజకీయాలని శాసించడం కాకుండా అందులో అంతర్భాగం అవుతున్నాయని అన్నారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ, ప్రాంతీయ పార్టీలతో పొత్తు కుదుర్చుకోవడం, నూతన సామాజిక వర్గాలకి ప్రాతినిధ్యం కల్పించడం, మైనార్టీ వర్గాలని తీవ్రంగా విమర్శించడం ఫలితంగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) 50 లోక్‌సభ స్థానాలన్ని సంపాదించుకోగలిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీల కలయిక వల్ల తెలుగుదేశం పార్టీ విజయం సాధించగా , కుటుంబ కలహాల వల్ల వైఎస్సార్ సీపీ పరాజయం పాలైందని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి ఫలితంగా బీజేపీ పూర్తి స్థాయిలో రాజకీయ ప్రయోజనం పొందిందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్తలు అశుతోష్ కుమార్ (పంజాబ్ యూనివర్సిటీ), జ్యోతి మిశ్రా (హర్యానా), సంజయ్ లోధా (రాజస్థాన్), యతింద్ర సిసోడియ (మధ్యప్రదేశ్), రామ జయం, కార్తీక్ విఘ్నేష్ (తమిళనాడు), ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అజయ్ గుడవర్తి (జెఎన్‌యూ), హారతి వాగీషన్ (నల్సార్), ప్రొఫెసర్ కేసీ సూరి, కైలాష్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొ॥జ్యోతిర్మయ శర్మ, వివిధ రాజకీయ విశ్లేషకులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీ చైర్మెన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యోగులు, కార్మికులు ఆదివారాలు కూడా పని చేయాలనీ, ఎంత సేపు ఇంట్లో భార్యలను చూస్తూ కూర్చుంటారు వారంలో కనీసం 90 గంటల పని చేయండని ఎల్‌అండ్‌టీ చైర్మెన్ సుబ్రమణ్యన్ చేసిన వ్యాఖ్యలను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తీవ్రంగా ఖండించారు. కార్మికులకు, ఉద్యోగులకు వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే యాజమాన్య, కార్మిక సంబంధాలను దెబ్బతీసేలా అనేక చర్యలు తీసుకున్నదని విమర్శించారు. కార్మికులకు శ్రమకుతగ్గ వేతనం దక్కట్లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా లక్షలాది ఉద్యోగ ఖాళీలను కేంద్రం భర్తీ చేయడం లేదని విమర్శించారు. కార్మికులను కార్పొరేట్లకు కట్టు బానిసలుగా మార్చేందుకుగానూ 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసు కొచ్చిందని తెలిపారు. ఇవి సరిపోవన్నట్టుగా 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అనటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎల్‌అండ్‌టీ చైర్మెన్ సుబ్రమణ్యన్ మాట్లాడుతూ ఇంట్లో భార్యలను చూస్తూ ఏం కూర్చుంటారు..90 గంటలతో పాటు ఆదివారం కూడా పని చేయాలనటం దుర్మార్గమని తెలిపారు. కార్పొరేట్లకు ఊడిగం చెయ్యడం కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు అన్ని రంగాల కార్మికులు ఐక్య పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

సీఎం సోదరుడి అధికార దుర్వినియోగాన్ని ఖండిస్తున్నాం

- బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రోటోకాల్‌ను కాలరాస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడటాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్వీ సుభాష్ ఖండించారు. తిరుపతిరెడ్డిని నియంత్రించాలని సీఎంకు సూచించారు. లేకుంటే కేసీఆర్ కుటుంబానికి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుపతిరెడ్డి ఏ హోదాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ప్రశ్నించారు. ఆయన వెంట పోలీస్ కాన్వాయ్ ఎందుకని నిలదీశారు. స్కూలు పిల్లలతో పరేడ్ నిర్వహించి స్వాగతం పలికించుకోవడంతో పాటు రాచమర్యాదలు పొందిన తీరును తప్పుబట్టారు. తిరుపతి రెడ్డి పక్కనే వికారాబాద్ కలెక్టర్ ఓ బాడీగార్డుగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం తన సోదరుడిని నియంత్రించకపోతే ప్రజాగ్రహానికి గురవ్వడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్లోబల్ బ్యాంక్‌ల్లో లక్షలాది ఉద్యోగులకు ముప్పు

న్యూఢిల్లీ : కృత్రిమ మేథ (ఏఐ) ప్రభావంతో వచ్చే ఐదేళ్లలో బ్యాంకింగ్ రంగంలో లక్షలాది ఉద్యోగాలు ఊడనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ప్రస్తుతం మానవ ఉద్యోగులు నిర్వహిస్తున్న పనులను ఏఐ ఆక్రమించడంతో అంతర్జాతీయ బ్యాంకులు రాబోయే మూడు నుండి ఐదు సంవత్సరాలలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలను తొలగించనున్నాయని అంచనా. ఆయా బ్యాంకుల చీఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ అధికారులను బ్లూమ్‌బర్గ్ సర్వే చేసి ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఒక్కో బ్యాంకు సగటున తమ వర్క్‌ఫోర్స్‌లో నికరంగా 3 శాతం మందిని తగ్గిస్తుందని అంచనా. ఇక కేవైసీ విధులను నిర్వర్తించే పాత్రలకు ముప్పు తప్పదని పేర్కొంది. మానవ వనరుల సంఖ్యలో 5 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గొచ్చని మొత్తం 93 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సర్వేలో దాదాపు నాలుగింట ఒక వంతు మంది అభిప్రాయపడ్డారు.

రెన్యూబై నుంచి కొత్త స్మార్ట్ టర్మ్ ప్లాన్

హైదరాబాద్ : ఆన్‌లైన్ బీమా వేదిక రెన్యూబై కొత్తగా రెన్యూబై స్మార్ట్ టర్మ్ ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీన్ని ఎల్ఐసీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, డిజిట్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్టు ప్రకటించింది. వృత్తి నిపుణులు, చిన్న వ్యాపార యాజమానుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ టర్మ్ ప్లాన్‌ను రూపొందించినట్లు పేర్కొంది. ఇందులో పదేండ్ల ప్రీమియం చెల్లించి జీవితకాలం కవరేజీ పొందే అవకాశం ఉందని తెలిపింది. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు కవరేజీ హామీ ఉంటుందని పేర్కొంది.